thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 28 కరీంనగర్ మంగళవారం, 8 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్ సహా 13 దేశాల వీసాలు తాత్కాలికంగా నిషేధం..

సౌదీ అరేబియా హజ్ యాత్రకు వెళ్లే హజ్ యాత్రికులు, ఉమ్రా సందర్శకులకు 2025 సీజన్‌లో కీలకమైన మార్పులు ప్రకటించారు. ఈ ఏడాది హజ్ యాత్ర దగ్గరపడుతుండటంతో సౌదీ అరేబియా.. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా ఇతర 11 దేశాల పౌరులపై వీసా నిషేధం విధించింది. ఈ నిర్ణయం 2025 జూన్ నెల మధ్య వరకు అమల్లో ఉంటుంది.

**ప్రభావిత దేశాలు :** హజ్ 2025 సీజన్ సందర్భంగా భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇరాక్, నైజీరియా, జోర్డాన్, అల్జీరియా, సూడాన్, ఇథియోపియా, ట్యునీషియా, యెమెన్, మొరాకో వంటి 14 దేశాలకు చెందిన పౌరులపై వీసా నిషేధం అమలులోకి వచ్చింది. దీంతో, ఈ దేశాలకు చెందిన వ్యక్తులు ఉమ్రా, వ్యాపార లేదా కుటుంబ సందర్శన వీసాలు పొందడానికి ఇప్పుడు తాత్కాలికంగా అవకాశం లేదు.




తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తొలి దశలో భాగంగా జనవరి 26న 71 వేల మందికి ప్రభుత్వం ఇండ్ల మంజూరు పత్రాలు అందించింది. రీ వెరిఫికేషన్ లో 6 వేల మందిని అధికారులు అనర్హులుగా తేల్చి తొలగించారు. చివరికి 65వేల మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 12వేల మంది ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. బేస్ మెంట్ నిర్మాణంలో భాగంగా గుంతలు తీసి మట్టి, రాళ్లతో పూడ్చారు. మరో 1,200 మంది బేస్?మెంట్ పూర్తి చేసుకున్నట్లు హౌసింగ్ డిపార్ట్?మెంట్?కు జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు నివేదిక ఇచ్చారు. ఉగాది పూర్తి కావడం, మంచి ముహుర్తాలు ఉండటం, వ్యవసాయ పనులు చివరి దశకు చేరుకోవడంతో ఇక ఇండ్ల నిర్మాణ పనులు మరింత ఊపందుకుంటాయని అధికారులు చెప్తున్నారు.

**ఈ వారంలోనే డబ్బులు రిలీజ్!...** ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం 4 దశల్లో రూ.5 లక్షలను లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుంది. తొలి దశలో బేస్ మెంట్ కంప్లీట్ అయ్యాక లక్ష రూపాయలు ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 1,200 మంది బేస్?మెంట్ పనులు పూర్తి చేసుకున్నారు. ఈ నెల చివరికల్లా మరో వెయ్యి మంది లబ్ధిదారులు పునాది పనులు పూర్తి చేస్తారని అధికారులు చెప్తున్నారు. బేస్?మెంట్ కంప్లీట్ చేసిన అందరికి మొదటి విడతలో భాగంగా వెయ్యి కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ వారంలోనే డబ్బులు రిలీజ్ అవుతాయని ఉన్నతాధికారులు చెప్తున్నారు. ఈ నిధులన్నీ జిల్లాల ట్రెజరీల్లో ఉంటాయి.




## దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసుపై ఏప్రిల్ 8న తీర్పు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో తెలంగాణ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో హైకోర్టు తీర్పుపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. 2013లో అంటే.. నాటి యూపీఏ హయాంలో ఈ బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో 18 మంది మృతి చెందగా.. మరో 130 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాంబు పేలుళ్ల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఫాస్ట్ ట్రాక్ కోర్టు.. 2016లో యాసిన్ భత్కల్‌తో సహా ఐదుగురికి ఉరి శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో ఈ కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ముద్దాయిలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడు రియాజ్ భత్కల్ ఇప్పటికీ పరారీలో ఉన్న సంగతి తెలిసిందే.

**బాంబు పేలుళ్ల.. వివరాలు..** 2013 ఫిబ్రవరి 21వ తేదీన హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌లో పేలుళ్లు సంభవించాయి. ఈ దాడిలో 18 మంది మరణించారు. 130 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు జరిపింది. ఈ కేసు విచారణలో భాగంగా 157 మంది సాక్ష్యాలను రికార్డ్ చేసింది. ఈ దర్యాప్తులో ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థ సహ వ్యవస్థాపకుడు యాసిన్ భత్కల్ ప్రధాన నిందితుడని తేలింది.





# శాఖల మార్పు!

## మంత్రులను టెన్షన్ పెడుతున్న క్యాబినెట్ విస్తరణ అంశం..!!

అమరావతి : మంత్రివర్గ విస్తరణ ప్రాసెస్ క్లైమాక్స్ కు చేరుతుంటే ఆశావహులతో పాటు మంత్రులు కూడా టెన్షన్ పడుతున్నారట. అసలు క్యాబినెట్ లో చోటు దక్కుతుందా లేదా అని ఆశావహులు అయోమయంలో ఉంటే, శాఖలు మారిపోయాయంటూ మంత్రులు ఫీల్ అవుతున్నారట. శాఖల మార్పు నిర్ణయం వల్లే క్యాబినెట్ విస్తరణ ఆలస్యం అవుతోందనే గాసిప్స్ గాంధీభవన్ లో రీసౌండ్ చేస్తున్నాయి. దీంతో తమ శాఖ ఉంటుందా ఉండదా అనే భయం మంత్రుల్లో కనిపిస్తోందనే ప్రచారం జోరందుకుంది. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ థ్రిల్లర్ సినిమాను మించిన సస్పెన్స్ ను క్రియేట్ చేసింది. ఇదిగో లిస్ట్, అదిగో ముహూర్తం అంటూ ఊరిస్తున్నారు తప్ప.. ఇప్పటివరకు పదవులు పంచింది లేదు. ఏప్రిల్ 3న విస్తరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నా వర్కౌట్ కాలేదు. ఈసారి క్యాబినెట్ విస్తరణకు తుది కసరత్తు జరుగుతోందని, మంత్రివర్గంలో భారీ మార్పులు తప్పవనే ప్రచారం జోరందుకుంది. ప్రస్తుతం ఉన్న అమాత్యుల్లో ఎవరి శాఖలు మారబోతున్నాయి? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పలువురు మంత్రులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయని తెలుస్తోంది. సచివాలయంలోనే ఓ శాఖా మంత్రి ఛాంబర్ ఎదుట కాంట్రాక్టర్లు ఆందోళనలు కూడా చేశారట. ఈ విషయం తెలుసుకున్న ఢిల్లీ పెద్దలు గుర్రుగా ఉన్నారని గాంధీభవన్ లో చర్చించుకుంటున్నారు. మొన్న ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కొందరు మంత్రుల శాఖలను మార్చాలనే అభిప్రాయాన్ని హైకమాండ్ ముందు ఉంచారని తెలుస్తోంది. దీంతో మంత్రివర్గంలో తీసివేతలు తప్పవని తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొందరు మంత్రులు తమ శాఖలు మార్చాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నారట. కీలకమైన విద్యాశాఖను తనకు కేటాయించాలని ఓ సీనియర్ మంత్రి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. హోంశాఖను ఇవ్వాలని మరో మంత్రి కూడా రిక్వెస్ట్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీలో ఇన్నర్ టాక్. దీనికి తోడు ఒకరిద్దరు మంత్రులను క్యాబినెట్ నుంచి తొలగిస్తారనే బలమైన టాక్ నడుస్తోంది. ఇన్ని పరిణామాల మధ్య మంత్రివర్గ విస్తరణలో భారీ మార్పులు తప్పవనే చర్చ ఊపందుకుంది.

తెలంగాణ క్యాబినెట్ విస్తరణ ఏప్రిల్ రెండో వారంలో ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. మొత్తంగా మంత్రివర్గ విస్తరణ అంశం ఆశావహుల్లో జోష్ పెంచుతుండగా తమ శాఖలకు కత్తెర పడుతుందేమో అన్న భయం మంత్రులను వెంటాడుతోంది. ఇలా అందరిలో క్యాబినెట్ విస్తరణ అంశం టెన్షన్ పుట్టిస్తోంది.

# వేడెక్కిన స్థానిక సమరం..



## రిజర్వేషన్లపై కారు-కమలం మల్లగుల్లాలు!

హైదరాబాద్ : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైందా? రేవంత్ సర్కార్ నిర్ణయంతో విపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయా? సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ప్రకటనతో ఎలా చెయ్యాలనే ఆలోచనలో మిగతా పార్టీలు పడ్డాయా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా అన్న ప్రశ్న బీఆర్ఎస్, బీజేపీలను వెంటాడుతోందా? తాము సిద్ధమేనని బీఆర్ఎస్ పైకి చెబుతోందా? దీనిపై ఇంకా నిర్ణయం వెల్లడించకుండా బీజేపీ ఎందుకు తాత్సారం చేస్తోంది? రేపో మాపో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకానుంది. దీనికి సంబంధించి ఒకొక్కటి క్లియర్ చేస్తూ వస్తోంది రేవంత్ సర్కార్. ఇందులో భాగంగా బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బీసీ డెడకేటెడ్ కమిషన్ రిపోర్టుపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పంచాయితీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించనున్నారు. దీని తర్వాత సర్పంచ్, ఎంపీటీపీ, జెడ్పీటీసీలు ఎన్ని విడతలుగా ఎన్నికలు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వం ఓ అంచనాకు రానుంది. ఇక రాజకీయాల విషయానికొద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. కులగణన సర్వే అసెంబ్లీ చర్చ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. చట్టపరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాకుంటే పార్టీ పరంగా ఎన్నికల్లో 42 శాతం అమలు చేస్తామని కుండబద్దలు కొట్టేశారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 22 నుంచి 23 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా వస్తాయి. మిగతా 20శాతం సీట్లను పార్టీ పరంగా కేటాయించాలనే నిర్ణయానికి ముఖ్యమంత్రి ఉన్నట్లు అధికార పార్టీల్లో చర్చ జరుగుతోంది. అధికార పార్టీ ఈ విధంగా చేస్తే.. మిగతా పార్టీలు కాంగ్రెస్ దారిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ సిపార్సుల ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లకు 22 శాతం రిజర్వేషన్లు అధికారంగా అమలు చేస్తూనే మిగతా 20శాతం బీసీలకు టికెట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఎంపీపీలు, జెడ్పీ ఛైర్మన్ ఎంపికలో దామాషా పాటించాలని నిర్ణయానికి వచ్చినట్టు పార్టీ వర్గాల మాట. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం కేటాయిస్తే.. మిగతా పార్టీలపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీనిపై ఇటు బీఆర్ఎస్, బీజేపీలో తేల్చుకోలేక పోతున్నాయి. ఇటీవల ఆయా పార్టీ సమావేశాల్లో దీనిపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. బీజేపీతోపాటు బీఆర్ఎస్ కూడా దీనిపై మల్లగుల్లాలు పడుతోంది. దీనిపై గతంలో కేటీఆర్ ఓ మాట ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా తాము కూడా 42 శాతం కేటాయిస్తామని చెప్పేశారు. కానీ.. పార్టీలో పరిస్థితులు ఆ స్థాయిలో లేవని అంటున్నారు. అధికారం పోయిన తర్వాత కేడర్ చెల్లాచెదురైంది. కేడర్ బలహీనం కావడంతో క్షేత్రస్థాయిలోకి వెళ్ల లేని పరిస్థితి కారు పార్టీ నేతలది. ఇక బీజేపీ విషయానికొద్దాం. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సైలెంట్ అయిపోయింది. సిటీ, పట్టణాల్లో ఆ పార్టీ కొంత కేడర్ ఉంది. రూరల్లో మరింత వీక్‌గా కనిపిస్తోంది. ఇటీవల భర్తీ చేసిన పార్టీ మండల అధ్యక్ష పదవులు బీసీలకు 50 శాతం కేటాయించామని బయటకు చెబుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో ఆ పార్టీ పడినట్టు తెలుస్తోంది. తెలంగాణలో 42 శాతం అమలు చేస్తే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇదే నినాదం రావచ్చని అంటున్నారు. మరి బీసీలకు 42 శాతం అంశం బీజేపీ ఎలా హ్యాండిల్ చేస్తుందో చూడాలి.




హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

కృత్రిమమేధ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారని పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. మొత్తం 400 ఎకరాలకు సంబంధించిన నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొంది.

నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు వెల్లడించింది.




ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కుదేలయ్యాయి. సెకన్ల వ్యవధిలో మార్కెట్లో రూ.లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఈ ప్రభావం దేశీయ కుబేరులపైనా తీవ్రంగానే పడింది. టాప్‌-4 కుబేరుల సంపద ఈ ఒక్కరోజే 10 బిలియన్ డాలర్లకు పైగా (భారత కరెన్సీలో దాదాపు రూ.85వేల కోట్లు) కరిగిపోయింది. ఈ మేరకు ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ జాబితా గణాంకాలు వెల్లడించాయి. అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేర్లు నేటి ట్రేడింగ్‌లో భారీగా పతనమయ్యాయి. నిఫ్టీలో ఈ కంపెనీ షేరు విలువ దాదాపు 3.5శాతం కుంగింది. ఇంట్రాడేలో 7.4 శాతం నష్టంతో 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. దీంతో అంబానీ వ్యక్తిగత నికర సంపద ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30వేల కోట్లు) తగ్గి 87.7 బిలియన్ డాలర్లకు చేరింది. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కూడా 5శాతం మేర నష్టపోయాయి. దీంతో ఈ సంస్థ అధినేత గౌతమ్ అదానీ నికర సంపదలో 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25వేల కోట్లు) ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఆయన మొత్తం ఆస్తుల విలువ 57.3 బిలియన్ డాలర్లకు తగ్గినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ నికర సంపద సోమవారం 2.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.18వేల కోట్లు) మేర కుంగి 33.9 బిలియన్ డాలర్లకు చేరింది. నేటి ట్రేడింగ్‌లో జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ షేర్లు దాదాపు 7శాతం పతనమయ్యాయి. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ఐటీ షేర్లు భారీగా కుదేలయ్యాయి. దిగ్గజ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు విలువ 3.3శాతానికి పైగా కుంగింది. దీంతో ఈ కంపెనీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ వ్యక్తిగత నికర సంపద 1.5 బిలియన్ డాలర్లు (రూ.12వేల కోట్లు) తగ్గి 30.9 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.

## హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులను వెంటనే ఉపసంహరించండి: భట్టి విక్రమార్క

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో, సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటితో చర్చించిన అనంతరం భట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు.

జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయాల్సిందిగా న్యాయశాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.





## మే 6 అర్ధరాత్రి నుంచి తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగనుంది. మే 6 అర్ధరాత్రి నుంచి సమ్మె చేయాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్, లేబర్ కమిషనర్‌కు ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు.

మే 7వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇవాల్టి వరకు ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు పడలేదని నోటీసుల్లో పేర్కొన్నారు.




## లైంగిక వేధింపులపై కర్ణాటక హోం మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

లైంగిక వేధింపుల విషయంలో కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బెంగళూరులో ఓ యువతిపై లైంగిక దాడి జరిగిన విషయంపై మాట్లాడుతూ.. బెంగళూరు వంటి పెద్దపెద్ద నగరాలలోని వీధుల్లో మహిళలపై ఇటువంటి ఘటనలు తరచుగా జరుగుతుంటాయని ఆయన అన్నారు. అయితే, ఆ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ ఘటనపై ఇప్పటికే కమిషనర్‌తో మాట్లాడానని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని.. బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు హోంమంత్రి తెలిపారు. మంత్రి చేసిన వ్యాఖ్యలపై పలువురు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. మహిళలను వేధిస్తున్న ఆకతాయిపై కఠిన చర్యలు తీసుకోకుండా.. అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తులు ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడుతున్నారు. అసలేమైందంటే.. గత వారం సుద్దగుంటెపాల్య ప్రాంతంలోని ఓ వీధిలో ఇద్దరు యువతులు నడుచుకుంటూ వెళ్తుండగా.. ఒక వ్యక్తి ఒక్కసారిగా వెనకనుంచి వచ్చి వారిలో ఓ యువతిని అసభ్యంగా తాకి అక్కడినుంచి పరారయ్యాడు. ఏం జరుగుతుందో తెలియక షాక్ అయిన యువతులు భయంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయనప్పటికీ.. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బెంగళూరులో గతంలోను ఇటువంటి ఘటనలు జరిగాయని.. అటువంటి ఆకతాయిలకు పోలీసులు తగిన బుద్ధి చెప్పాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. వీడియో ఆధారంగా బెంగళూరు పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## భాజపా నేతలు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలి: మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్: భాజపా నేతలు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 8 స్థానాల్లో గెలిస్తే.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు మాత్రం సున్నా.. అని విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. "దేశంలో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రోకు నిధులు అడిగితే ఇవ్వడం లేదు. మూసీ పునరుజ్జీవానికి నిధులు అడిగితే రూపాయి ఇవ్వలేదు. విభజన చట్టంలోని హామీల గురించి కేంద్ర మంత్రులు ఏనాడైనా మాట్లాడారా? మతతత్వ రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఆమోదించేందుకు కేంద్రాన్ని ఎందుకు అడగటం లేదు? గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించడం లేదా? తెలంగాణ ప్రాజెక్టుల గురించి భాజపా నేతలు ఒక్కసారి కూడా మాట్లాడలేదు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వానిది సవతితల్లి ప్రేమ. భారాస, భాజపా మధ్య ఎప్పుడూ రహస్య బంధం ఉంటుంది. పదేళ్ల పాలనలో భారాస వేల ఎకరాలు అమ్ముకుంది. అప్పుడు ఎందుకు మాట్లాడలేదు?గత ప్రభుత్వ లక్ష ఎకరాలు డీఫారెస్ట్ చేస్తే ఎందుకు ప్రశ్నించలేదు?" అని నిలదీశారు.




భద్రాద్రిలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణమండపంలో స్వామివారికి పట్టాభిషేక ఘట్టాన్ని అర్చకులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరయ్యారు. తొలుత ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి గవర్నర్ పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీరామనవమి తర్వాత రోజు మహాపట్టాభిషేకం చేయటం భద్రాచలం రామాలయం ప్రత్యేకం. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, యంగ్‌ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి వివరించారు. "ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయి. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్‌గా హైదరాబాద్ మారుతుంది. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం" అని శ్రీధర్‌బాబు వివరించారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## వైకాపా - తెదేపా నేతల మధ్య ఘర్షణ.. కారు ధ్వంసం



వెల్దుర్తి: కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైకాపా- తెదేపా నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఓ కారు ధ్వంసమైంది. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది తెదేపా నేత గిరినాథ్ చౌదరి దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య తర్వాత వైకాపాకి చెందిన 36 మంది నిందితులు గ్రామం వదిలి పారిపోయారు. తమను పోలీసు భద్రత నడుమ స్వగ్రామానికి చేర్చాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. వారికి రక్షణ కల్పించాల్సిందిగా జిల్లా ఎస్పీని ఆదేశించింది. కోర్టు అనుమతితో తాజాగా ఇవాళ నిందితులు బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి వచ్చారు. వారిని తెదేపా నేతలు అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహానికి గురైన కొందరు తెదేపా నేతలు వైకాపా నేత కారును ధ్వంసం చేశారు.

## ప్రమాణ స్వీకారం చేసిన నూతన ఎమ్మెల్సీలు



హైదరాబాద్: భాజపాకు చెందిన అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త ఎమ్మెల్సీలతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, లక్ష్మణ్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన విజయశాంతి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఆమెకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# భారత తొలి స్వాతంత్ర్య సమరయోధుడు మంగళ్ పాండే

## - ఏప్రిల్ 8... మంగళ్ పాండే ఉరితీయ బడిన రోజు




బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం అలనాడు జరిగిన పోరాటంలో ఎందరో ధీరులు ప్రాణాలర్పించారు. తెల్లదొరలపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. ప్రాణాలకు లెక్కచేయక బ్రిటీష్ వారి మీద తుపాకీ ఎక్కు పెట్టిన ధైర్యవంతుడు. బ్రిటిష్ వారి పెత్తనానికి తలవొగ్గి వారు చేస్తున్న అరాచకాలు, అవమానాలు మౌనంగా భరించిన భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వైపు మళ్లించిన ఘనత మంగళ్ పాండేదే. బ్రిటిష్ పాలన నుండి దేశాన్ని విడిపించేందుకు తన ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడుగా మంగళ్ పాండే భారత చరిత్రలో నిలిచి పోయాడు. 1857 నాటి తిరుగుబాటులో అతను కీలక పాత్ర పోషించాడు. మూడుపదుల వయసుకు చేరకుండానే ఉరికంబం ఎక్కేందుకు ఏ మాత్రం వెనకడుగు వేయని ధైర్యవంతుడు, తన త్యాగం దేశంలోని యువతను మేల్కొలుపు తుందని, విశ్వసించాడు. తన ఆత్మ బలిదానం మరెందరో వీరులకు స్ఫూర్తిని కలిగిస్తుందని, అలా స్ఫూర్తిని పొంది భరతమాత దాస్య విముక్తికి అంకితం అవుతారని, ఆ దిశగా యత్నం చేస్తారని భావించాడు. సుమారు రెండు శతాబ్దాలు మన దేశాన్ని పాలించిన శ్వేత జాతీయులపై తిరుగు బాటును ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే. మంగళ్ పాండే 1827 జూలై 19 న నేటి ఉత్తరప్రదేశ్ నందు గల పైజాబాద్ జిల్లాలోని సుర్హపుర అను గ్రామంలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. 22 సంవత్సరాల వయసులో మంగళ్ పాండే తనకు తెలిసిన వ్యక్తి ద్వారా తాను సిపాయిగా చేరాడు. శిక్షణ అనంతరం పాండేని 34 బెంగాల్ రెజిమెంట్ లోని 6వ కంపెనీకి సిపాయిగా పంపించారు. సెలవులకు ఇళ్లకు వెళ్లి వచ్చిన సైనికుల ద్వారా బ్రిటీషు వారి దోపిడీలు, దేశమంతటా చెలరేగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం గురించి వార్తలు అందుతుండేవి. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న స్థానిక పాలకులు సంఘటితంగా బ్రిటిషు వారిపై 1857 మే 31 న తిరుగుబాటు జరపాలని నిర్ణయించు కున్నారు. ఈ తిరుగు బాటుకు నాయకత్వం వహించిన వారిలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, తాంతియా తోపే, బహదూర్ షా తదితరులు ఉండిరి. తుపాకీ తూటాల తయారీలో గోవు, పంది కొవ్వు వాడుతున్న విషయం సైనికులకి తెలిసి లోలోపల రగిలి పోయారు. గోమాంసం వాడకం గురించి తెలుసుకున్న మంగళ్ పాండే ఉడికిపోయి, తోటి సైనికులతో తిరుగు బాటుకు పథకం వేశాడు. ఈ విషయం బ్రిటిషు అధికారులు మార్చి 29 న గుర్తించారు. తమ తమ తుపాకీలని సిద్ధంగా ఉంచుకొని, కన్పించిన బ్రిటిషు అధికారినల్లా కాల్చి పారేయాలని తోటి సైనికులందర్నీ ఉత్తేజ పర్చాడు పాండే . ఈ లోగా అధికారి వాగ్ రావటం మంగళ పాండే అతనిమీద తూటా పేల్చటం జరిగింది, కానీ అది గురితప్పి అతని గుర్రానికి తగిలింది. చేతి పిస్టల్ తో కాల్పులు జరిపాడు వాగ్. తప్పించుకున్న మంగళ్ పాండే తిరగబడి, తన తుపాకీ తో కొట్టబోయాడు. అప్పటికే చేరుకున్న శార్జంట్ హ్యూసన్ వచ్చి పాండే చేతిలోని తుపాకీని నెట్టి పారేశాడు. పాండే ని అరెస్ట్ చేయమని అధికారులు ఆదేశించినా ఎవ్వరూ ముందుకు రాలేదు. తెల్లవారి చేతికి చిక్కటం ఇష్టం లేక, తన తుపాకీతో తానే కాల్చుకోగా, ఆ బుల్లెట్ గాయం చేసింది కానీ ప్రాణం తీయలేదు. తర్వాత భయంతో అతన్ని బ్రిటిషు అధికారులు సమీపించి ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల్లో కోలుకున్న మంగళ్ పాండే మీద రాజద్రోహం, తిరుగుబాటు నేరాలు మోపి కోర్టులో హాజరు పరిచారు. వీలైనంత త్వరగా విచారణ ముగించటం, ఉరిశిక్ష విధించటం ఆంగ్లేయ పాలకుల దుర్నీతికి పరాకాష్ట. విచారణలో మంగళ్ పాండే ధైర్యంగా ఇలా ప్రకటించాడు... “నేను చేసిన తిరుగుబాటు నా దేశం కోసం, నా ధర్మం కోసం చేశాను. ఇది నా స్వప్రేరణతో నా మాతృభూమి కోసం చేశాను, అంతే కానీ దీనికి మరెవ్వరినీ బాధ్యులని చేయొద్దు”. విచారణ పూర్తిచేసి, ఏప్రిల్ 18న ఉరితీయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే తిరుగుబాటు వార్త వ్యాపించి, అనేక రెజిమెంట్లలో చైతన్యం మొదలయ్యింది. మరోవైపు అనేక రాజ సంస్థానాలు, సంస్థానాల్లోని ప్రజలు తిరుగుబాటుకు ఏకమయ్యారు. భారత దేశమంతా ప్రథమ స్వతంత్ర్య సంగ్రామానికి తెర లేచింది. మంగళ్ పాండే ఉరి ప్రభావంతో సైనికుల్ని అణచి వేయటానికి ఏప్రిల్ 8 నే ఉరిశిక్షను అమలు చేశారు. మంగళ్ పాండే ప్రభావమున్న సైనిక కంపెనీని పూర్తిగా రద్దు చేశారు. 2005 లో మంగళ్ పాండే పై ఒక హిందీ సినిమా తీసారు. భారత ప్రభుత్వం మంగళ్ పాండే గౌరవార్ధం, అక్టోబరు 5, 1984 న ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది. భారత దేశ స్వాతంత్ర్య పోరాటపు తొలిసారి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన వీరుడు మంగళ్ పాండే. 1857 నాటి తిరుగు బాటుకు మూలమై, బ్రిటీష్ సిపాయిగా పనిచేస్తూ బ్రిటీష్ పాలకుల మీద తిరుగు బాటు చేసిన సాహసిగా, తొలి స్వాతంత్ర్య సమర యోధుడిగా పాండే చిరకాలం గుర్తుండి పోతాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# పోషకాహార లోపం...వ్యాధులకు మూలం- ఏప్రిల్ 7... ప్రపంచ ఆహార దినోత్సవం

ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని యొక్క విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబందించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార దినోత్సవం జరుపు కుంటారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%), ఇతర సంబంధిత సంస్థల ప్రాయోజకత్వంలో జరుపుకునే ప్రపంచ ఆరోగ్య అవగాహన దినం. 1948లో, %ఔనూ% మొదటి ప్రపంచ ఆరోగ్య సభను నిర్వహించింది. 1950 నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7 ను జరుపుకోవాలని అసెంబ్లీ నిర్ణయించింది. %ఔనూ% స్థాపనకు గుర్తుగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్యానికి ప్రధాన ప్రాముఖ్యత ఉన్న అంశంపై ప్రపంచవ్యాప్త దృష్టిని ఆకర్షించేటట్లు ఈ సంస్థ చూస్తుంది. ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహార దినం పాటిస్తున్నారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకుంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవం. ఈ సందర్భంగా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఈ ఆహార దినోత్సవం సందర్భంగా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే




ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాత్రంత్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఒక సమ్రగ విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధిచేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు,జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# కోరికలు తీర్చే పవిత్ర ఏకాదశి...కామద ఏకాదశి



హిందూ సంప్రదాయంలో ఏకాదశి వ్రతాలకు అత్యంత విశిష్ట స్థానం ఉంది. ప్రతి నెలలో వచ్చే రెండు ఏకాదశుల్లో చైత్రమాసం శుక్లపక్షంలో వచ్చే కామద ఏకాదశి ప్రత్యేకమైనది. “కామద” అన్న పదానికి అర్థం ౦ “కోరికలు నెరవేర్చే”. అందుకే ఈ ఏకాదశిని కోరికల పరిపూరణకు కారణమయ్యే పవిత్ర దినంగా భావిస్తారు. ఈ ఏకాదశికి మరొక పేరు ‘దమన ఏకాదశి’. ఇది మనిషి లోపాలను ౦ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ౦ దమన చేసే శక్తిని కలిగి ఉంటుంది. ఈ వ్రతాన్ని ఆచరించడం వలన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శుభాలు సిద్ధిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. వరాహ పురాణం ప్రకారం శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఈ వ్రత మహాత్మ్యాన్ని వివరించాడు. వశిష్ఠ మహర్షి దిలీప మహారాజుకు ఈ వ్రత విశిష్టతను వివరించాడని కూడా పురాణ ప్రస్తావన ఉంది. ఈ వ్రతం ద్వారా సంతాన లభ్యం, వైవాహిక జీవిత సౌఖ్యం, సౌభాగ్య స్థిరత్వం లభిస్తాయని నమ్మకం. పూర్వం రత్నపుర అనే రాజ్యంలో పుండరీకుడు అనే రాజు పాలన సాగించేవాడు. ఆయన రాజసభలో గంధర్వులు, కిన్నెరులు, కింపురుషులు, అప్సరసలు కళలతో వినోదాన్ని అందించేవారు. ఒకరోజు, లలితకాంత అనే గంధర్వుడు తన భార్య లలితను గురించిన ఆలోచనలతో తక్కువ నిబద్ధతతో కళా ప్రదర్శన ఇవ్వడం గమనించిన రాజు, కోపంతో అతనిని రాక్షసుడిగా కమ్మని శపించాడు. తన స్వరూపం కోల్పోయిన లలిత కాంతుని భార్య లలిత, భర్తను రక్షించేందుకు శృంగి మహర్షిని ఆశ్రయించింది. మహర్షి ఆమెకు కామదా ఏకాదశి వ్రతం ఆచరించమని ఉపదేశించాడు. లలిత భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించడంతో భర్తకు శాప విమోచనం లభించి పూర్వరూపాన్ని పొందాడు. వీరిద్దరూ మోక్షాన్ని పొందినట్లు పురాణం చెబుతుంది. దశమి రోజున సాయంత్రం తర్వాత తిండి తీసుకోకుండా ఉపవాసానికి సిద్ధమవ్వాలి. సాత్విక ఆహారం తీసుకోవాలి. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే లేచి శుద్ధంగా స్నానం చేయాలి. పూజా గృహంలో విష్ణు విగ్రహాన్ని అలంకరించి, దీపం, పుష్పాలు, తులసీదళాలు సమర్పించాలి. విష్ణు సహస్రనామం, అష్టోత్తర శతనామావళి పారాయణ చేయాలి. ఉపవాసంతో, జాగరణతో ఈ దినాన్ని గడపాలి. ద్వాదశి రోజున బ్రాహ్మణులకు భోజనం పెట్టి, దానధర్మాలు చేసి, ఆ తరువాతే స్వయంగా భోజనం చేయాలి. తద్వారా పూర్వకర్మల వల్ల ఏర్పడిన పాపాలు తొలగిపోతాయి. కోరికలు నెరవేరుతాయి. సంతాన యోగం కలుగుతుంది. స్త్రీలకు సౌభాగ్యం నిలుస్తుంది. వైవాహిక సమస్యలు తొలగిపోతాయి. మోక్ష మార్గం వైపు అడుగులు వేయ గలుగుతారు. కామద ఏకాదశి ఒక పరమ పవిత్రమైన వ్రతం. భక్తి, శ్రద్ధ, నియమ నిష్టలతో ఈ వ్రతాన్ని ఆచరించే వారికి భగవంతుని అనుగ్రహం లభిస్తుంది. దురాశలు తొలగిపోయి, ఆత్మ శుద్ధి కలుగుతుంది. శాస్త్రాలు, పురాణాలు చెప్పిన విధంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే సకల శుభాలు, కోరికల పరిపూరణ జరుగుతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# కళ్యాణానికి ముస్తాబైన వాడపల్లి వెంకన్న

## స్వామి వారి రథ, కళ్యాణ మహోత్సవం చైత్ర శుద్ధ ఏకాదశి





కోనసీమ తిరుపతి’ గా...’ఏడు వారాల వెంకన్న’ గా ఖ్యాతిగాంచిన తూర్పు గోదావరి జిల్లా, వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి తీర్థ మహోత్సవాలు ఏటా ఘనంగా జరుగుతాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తూర్పు గోదావరి జిల్లాలో వాడపల్లి గ్రామం, గోదావరి నది ఒడ్డున ఉంది. ప్రసిద్ధి చెందిన వాడపల్లి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్నారు. ఇక్కడి వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని వాడపల్లి వెంకన్న స్వామి దేవాలయం అని కూడా అంటారు. గౌతమీ తీరంలో కొలువున్న ఈ స్వామిని దేవర్షి నారదుడే ప్రతిష్ఠింప చేశాడంటారు. పురాతన చరిత్రగల ఆలయాలలో ఇది ఒకటి. వెంకటేశ్వర స్వామి దేవత ఎర్రచందనం చెక్కతో చేయబడింది. వాడపల్లి వెంకన్న దేవాలయం రావులపాలెం నుండి 10 కి.మీ. శ్రీ వేంకటేశ్వర స్వామిని కల్యాణ వెంకటేశ్వర స్వామి అని కూడా అంటారు. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర వారి స్వయంభు క్షేత్రం. వాడపల్లి క్షేత్రం రాజమండ్రి (రాజ మహేంద్ర వరం) కి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. గౌతమీ నదీ తీరాన వెలసిన స్వామిని భక్తులు తమ పాలిట కొంగు బంగారంలా విశ్వసిస్తారు. ఇది ఒక చారిత్రాత్మక దేవాలయం, తరువాత విశాలమైన ప్రదేశంలో అభివృద్ధి చేయబడింది.

ఈ క్షేత్రం లో ఏడు శనివారాలు దర్శించుకుని, ఏడు ప్రదక్షిణలు చేసిన భక్తులకు కోరిన కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి శనివారం ఇక్కడకు భక్తులకు వేలాదిగా తరలి వస్తారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించు కుంటారు. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి నిలువెత్తు రూపం చూడగానే కళ్ళకు ఆకట్టుకుని ఏడు కొండల స్వామిని దర్శించిన అనుభూతి కలిగిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలో రావులపాలెం నుండి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాడపల్లికి బస్సులు, ఆటోలు మొదలైన వాటి ద్వారా చేరుకోవచ్చు. ఆలయం 6 నుండి 12 వరకు మరియు సాయంత్రం 4 నుండి 7 వరకు తెరిచి ఉంటుంది. ఆలయం వద్ద యాత్రికుల కోసం ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నదానం చేస్తారు. ప్రధాన ఆలయం పక్కన, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి (శివ) దేవాలయం ఇక్కడ ఉంది. ఆలయానికి ఎదురుగా గరుడ, గజ మరియు అనేక ఇతర స్వామి వాహనాలను మనం చూడవచ్చు. భారత దేశంలో అశేష భక్తజనం సందర్శించే ఆరాధ్య దేవాలయాలలో వాడపల్లి ఒకటి. వాడపల్లి తీర్ధం అనగా వాడవాడలా ఉత్సవమే. ఆబాల గోపాలానికి ఆనందమే. ప్రతియేటా చైత్రశుద్ధ ఏకాదశినాడు శ్రీ స్వామి వారి తీర్థం కళ్యాణోత్సవము వైభవముగా జరుగుతాయి. ఉత్సవాలు చూడడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు తరలివస్తారు. ఈ ఏటి ఉత్సవాలలో భాగంగా... 7న దశమి సోమవారం స్వామివారి ధ్వజారోహణ, నిత్య బలిహరణ, 8న ఏకాదశి మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, రాత్రి కల్యాణం, 9 ద్వాదశి బుధవారం స్వామివారి పొన్న వాహన మహోత్సవం, 10 త్రయోదశి గురువారం సద్యసం, చతుర్ధశి శుక్రవారం గౌతమి గోదావరి నదీలో. తెప్పోత్సవం, 12 పౌర్ణమి శనివారం మహా పూర్ణాహుతి, చక్రస్నాన మహోత్సవం, 13 ఫాడ్యమి ఆదివారం స్వామివారి శ్రీపుష్ప యాగముతో కల్యాణోత్సవాలు ముగియ నున్నాయి.

వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవల్లి రాజేశ్వర ప్రసాద్ చార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించ నున్నారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు, ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో రెండు దఫాలు సమీక్షా సమావేశాలు నిర్వహించారు.


చురకలు

## సంపాదకీయం

### ట్రంప్‌తో ప్రపంచీకరణ ముగిసినట్టేనా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన 'అమెరికా ఫస్ట్' విధానాలు, ప్రపంచ దేశాలపై ఆయన విధించిన భారీ పన్నులు ప్రపంచీకరణకు ముగింపు పలికాయా? బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ రాబోయే ప్రకటన ఇదే విషయాన్ని స్పష్టం చేయనుందా? అంతర్జాతీయ మీడియా కథనాలు ఈ దిశగా సంకేతాలు ఇస్తున్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనంతో ప్రారంభమైన ప్రపంచీకరణ శకం ముగిసిందని స్టార్మర్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అనుసరించిన వాణిజ్య విధానాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా చైనా వంటి దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీగా పన్నులు విధించడం ద్వారా ఆయన అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను పూర్తిగా మార్చివేశారు. ఈ చర్యల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి నెలకొందని, సరఫరా గొలుసులు దెబ్బతిన్నాయని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఈ వాదనను బలపరుస్తూ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. టైమ్స్ నివేదిక ప్రకారం.. ఆర్థిక జాతీయవాదం విషయంలో అమెరికా తీసుకుంటున్న చర్యలను స్టార్మర్ సైతం సమర్థిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో ఒక కొత్త శకం ప్రారంభమైందని ఆయన గుర్తించారు. అంతేకాకుండా, అమెరికా అధ్యక్షుడి విధానాన్ని అక్కడి ప్రజలు సమర్థిస్తున్నారని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ వల్ల చాలా మంది శ్రామికులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరలేదని స్టార్మర్ పేర్కొన్నారు. అయితే, దీనికి వాణిజ్య యుద్ధాలు సరైన పరిష్కారం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడానికి ఇది ఒక అవకాశంగా ఆయన అభివర్ణించడం గమనార్హం. ట్రంప్ తీసుకుంటున్న వాణిజ్యపరమైన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా పోటీ పెరుగుతోందని స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ఈ పోటీని తట్టుకుని నిలబడాలంటే ప్రపంచ దేశాలు తమ ఉత్పాదకతను మరింతగా పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఇటీవల హాంకాంగ్‌లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ సర్ మార్క్ టక్కర్ కూడా ఇదే తరహా అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, ట్రంప్ అనుసరిస్తున్న వాణిజ్య విధానాల కారణంగా ప్రపంచం చిన్న చిన్న ప్రాంతీయ బ్లాక్‌లుగా, క్లస్టర్‌లుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అయితే, భవిష్యత్తులో ఈ ప్రాంతీయ సమూహాల మధ్య బలమైన వాణిజ్య సంబంధాలు ఏర్పడే అవకాశం కూడా ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కీర్ స్టార్మర్ రాబోయే ప్రకటన ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రపంచీకరణ ముగిసిందనే ప్రకటన వెలువడితే, అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. అయితే, స్టార్మర్ దీనికి ప్రత్యామ్నాయంగా ఎలాంటి విధానాలను సూచిస్తారనేది వేచి చూడాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక కొత్త మలుపు తిరుగుతున్న తరుణంలో బ్రిటన్ ప్రధాని ప్రకటన కీలకంగా మారనుంది.

# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు - ఏప్రిల్ 8...బంకించంద్ర ఛటర్జీ వర్ధంతి



బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు. బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహాకవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం. బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు. బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 - 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది. దేశాన్ని మాతృమూర్తిగా సంబోధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన రతర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు. భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం. మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి.

ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఏప్రిల్ 8...భగత్ సింగ్ విధాన సభలో బాంబులు విసిరిన దినం

1929 ఏప్రిల్ 8 తేదీన ప్రజారక్షణ, వ్యాపార వివాదల చట్టాల ఆమోదానికి నిరసనగా భగత్ సింగ్, బతుకేస్వర్ దత్ తో కలిసి కేంద్రీయ విధాన సభ లోకి బాంబులు విసిరారు. భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28 %-% 1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, కరుడుకట్టిన ఉద్యమ కారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమములో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్ గా నేటికీ కొనియాడబడుతున్నాడు. భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్ , విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికి దిగిన భగత్ సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్న చిన్న గడ్డిపరక లను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ " తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. లాలా లజపత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928 లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది.

భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా,



లాల్‌జీ కూడా అహింసతో, మౌనం గా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. దాంతో పోలీసుల కంటపడకుండా ఉండటానికి భగత్ లాహెూర్ పారిపోయాడు. గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డాన్ని గీసుకోవడం, వెంద్రుకలు కత్తిరించుకోవడం ద్వారా సిక్కు మత విశ్వాసాల ఉల్లంఘనకు సింగ్ పాల్పడ్డాడు. భగత్ సింగ్ వంటి విప్లవకారులను అణచివేయడం కోసం భారత రక్షణ చట్టమును తీసుకురావడం ద్వారా పోలీసులకు బ్రిటీష్ ప్రభుత్వం మరింత అధికారం కల్పించింది. ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అది ఆమోదితం కానున్న కేంద్ర శాసనసభపై బాంబు పేలుడుకు హిందూస్తాన్ సామ్యవాద గణతంత్ర సంఘం వ్యూహరచన చేసింది. బాంబు పేలుడుకు భగత్ సింగ్ ప్రయత్నించకుండా మరో ప్రముఖ విప్లవకారుడు చంద్రశేఖర్ ఆజాద్ అడ్డుకున్నాడు. అయితే సింగ్ ఆశయాలను అంగీకరించే విధంగా మిగిలిన పార్టీ సభ్యులు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. శాసనసభ వసారాపై భగత్ సింగ్‌తో పాటు మరో విప్లవకారుడు 8 ఏప్రిల్ 1929న సింగ్, దత్‌లు బాంబు విసిరి, "ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తు పలు కరపత్రాలను వెదజల్లారు. కేంద్ర అసెంబ్లీ ఆవరణలో కరపత్రం విసిరివేత, బాంబు దాడి వల్ల ఏ ఒక్కరూ మరణించడం గానీ గాయపడటం గానీ జరగలేదు. తమ వ్యూహంలో భాగంగా ఉద్ధేశ్యపూర్వకంగానే జాగ్రత్తలతో దాడి చేసినట్లు సింగ్, దత్ అంగీకరించారు. బాంబు గాయపరిచేటంత శక్తివంతమైంది కాదని బ్రిటీష్ ఫోరెన్సిక్స్ విచారణాధికారులు కూడా తేల్చిచెప్పారు. వాస్తవానికి బాంబు జనాలకు దూర బాంబు దాడి తర్వాత సింగ్, దత్ ఇద్దరూ లొంగిపోయారు. సింగ్ అరెస్టు అనంతరం శాసనసభ పేలుడుపై విచారణ నేపథ్యంలో జే. పీ. సాండర్స్ హత్య వెనుక ఆయన హస్తంపై బ్రిటీష్ ప్రభుత్వం ఆరా తీసింది. హత్యకు సంబంధించి భగత్ సింగ్, రాజ్‌గురు , సుఖ్‌దేవ్‌లపై అభియోగాలు మోపారు. భారత స్వాతంత్ర్యానికి తన గళాన్ని వినిపించుకునేందుకు న్యాయస్థానాన్నే ఒక ప్రచార వేదికగా మలుచుకోవాలని భగత్ సింగ్ నిర్ణయించుకున్నాడు. హత్యా నేరాన్ని అంగీకరించిన ఆయన విచారణ సమయంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశాడు. ఫిరోజ్‌పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకుగాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గరికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. '%ఝొతీత్తిఖత్ శీట జుఇ-వఏఙఆశీఅ రాఆ ఎావత్వఅఏవ ఎాట ఐమ్త్ష్ట్ర%' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# స్వతంత్ర భావుకుడు శంకరంబాడి - ఏప్రిల్ 8..శంకరంబాడి సుందరాచారి వర్ధంతి

శంకరంబాడి సుందరాచారి (ఆగష్టు 10, 1914 - ఏప్రిల్ 8, 1977) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన మా తెలుగు తల్లికి మల్లె పూదండ రచయిత. శంకరంబాడి సుందరాచారిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము ప్రసన్న కవి అని గౌరవించింది. ఆయనను సుందరకవి, భావకవి అనీ, అహంభావకవి అనీ కూడా అనేవారు. సుందరాచారి, 1914 ఆగష్టు 10 న తిరుపతిలో జన్మించాడు. అతని మాతృభాష తమిళం. మదనపల్లెలో బిసెంట్ థియొసాఫికల్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివాడు. చిన్నతనం నుండే ఆయన స్వతంత్ర భావాలు కలిగి ఉండేవాడు. సనాతన సంప్రదాయాలను వ్యతిరేకించేవాడు.కన్న తండ్రి మందలిస్తే, కోపం తెచ్చుకుని, పంతానికి పోయి, ఇంటి నుండి బయటికి వెళ్ళి పోయాడు. భుక్తి కొరకు ఎన్నో పనులు చేసాడు. తిరుపతిలో హెూటలు సర్వరుగా పనిచేసాడు. రైల్వే స్టేషనులో కూలీగా కూడా పనిచేసాడు. ఆంధ్ర పత్రికలో అచ్చుదోషాలు దిద్దేవాడిగా, ఉపాధ్యాయుడిగా, పాఠశాల పర్యవేక్షకుడిగా ఎన్నో వైవిధ్య భరితమైన పనులు చేసాడాయన. అమితమైన ఆత్మవిశ్వాసం ఆయన సొంతం. ఒకసారి ఏదైనా పని వెతుక్కుందామని మద్రాసు వెళ్ళాడు. ఆంధ్ర పత్రిక ఆఫీసుకు వెళ్ళి పని కావాలని అడిగాడు. దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వర రావు పంతులు "నీకు తెలుగు వచ్చా" అని అడిగాడు. దానికి సమాధానంగా "మీకు తెలుగు రాదా" అని అడిగాడు. నివ్వెర పోయిన పంతులుతో నేనిప్పటి వరకు తెలుగు లోనే కదా మాట్లాడాను, అందుకే మీ ప్రశ్నకు సమాధానం ఎలా ఇవ్వాలో తెలియ లేదు అని అన్నాడు. ఆంధ్ర పత్రికలో ఉద్యోగం చేస్తుండగా, ఒక ప్రముఖునిపై పద్యం వ్రాయవలసి వచ్చింది. నేను వ్యక్తులపై పద్యాలు వ్రాయను అని భీష్మించుకుని, దాని కోసం ఆ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు సుందరాచారి. తరువాత విద్యాశాఖలో పాఠశాల పర్యవేక్షకుడిగా పనిచేసాడు. నందనూరులో ఉండగా ఒకసారి పాఠశాల సంచాలకుడు వచ్చాడు. ఆ సంచాలకుడు సుందరాచారిని బంట్రోతుగాను, బంట్రోతును సుందరాచారిగాను పొరబడ్డాడు. దానికి కోపగించి, సుందరాచారి ఆ ఉద్యోగానికి తక్షణమే రాజీనామా చేసాడు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్య వేదమ్మాళ్ మనో వ్యాధిగ్రస్తురాలైన కారణంగా ఆయన వేదన చెంది, జీవిత చరమాంకంలో ఒక రకమైన నిర్లిప్త జీవితం గడిపాడు. తాగుడుకు అలవాటు పడ్డాడు. సుందరాచారి 1977 ఏప్రిల్ 8 న తిరుపతి, గంగుంద్ర మండపం వీధిలో నివాస ముంటున్న ఇంట్లో మరణించాడు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి పట్టణం తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణేశ్వరి సర్కిల్‌లో సుందరాచారి జ్ఞాపకార్థం, ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన పట్ల కృతజ్ఞతాసూచకంగా విగ్రహం దగ్గర ధ్వనివర్ధకం ద్వారా నిరంతరం మా తెలుగు తల్లికీ పాట నిరంతరంగా ధ్వనించే ఏర్పాటు చేసింది. మహాత్మా గాంధీ హత్య జరిగినపుడు ఆవేదన చెంది, బలిదానం అనే కావ్యం వ్రాసాడు. ఆ పద్యాలను పాఠశాలలో పిల్లలకు ఆయనే చదివి వినిపించాడట. సుందర రామాయణం అనే పేరుతో రామాయణం రచించాడు. అలాగే సుందర భారతం కూడా వ్రాసాడు. తిరుపతి వేంకటేశ్వర స్వామి పేరు మకుటంగా శ్రీనివాస శతకం రచించాడు. ఇవే కాక జపమాల, బుద్ధగీతి అనే పేరుతో బుద్ధ చరిత్ర కూడా రాసాడు. రవీంద్రుని గీతాంజలిని అనువదించాడు. మూలంలోని భావాన్ని మాత్రమే తీసుకుని, భావం చెడకుండా, తెలుగు నుడికారం పోకుండా చేసిన ఆ స్వతంత్ర అనువాదం బహు ప్రశంసలు పొందింది. ఏకలవ్యుడు అనే ఖండకావ్యం, కెరటాలు అనే గ్రంథం కూడా రచించాడు. సుందర సుధా బిందువులు అనే పేరుతో భావ గీతాలు వ్రాసాడు. జానపద గీతాలు వ్రాసాడు, స్థల పురాణ రచనలు చేసాడు. ఇవే కాక అపవాదు, పేదకవి, నాస్వామి, నేటి కవిత్వము, బలిదానము, కార్వేటి నగరరాజ నీరాజనము మొదలైనవి వీరి ఇతర రచనలు. మహాత్మాగాంధీ, బిల్హణీయం, దీనబంధు అనే సినిమాలకు పాటలు కూడా వ్రాసాడు. దీనబంధు సినిమాలో నటించాడు కూడా. సుందరాచారి "మా తెలుగు తల్లికి" గీతాన్ని 1942లో దీనబంధు సినిమా కోసం రచించాడు. కానీ ఆ చిత్ర నిర్మాతకు యుగళ గీతంగా వాడడానికి నచ్చక పోవటం వల్ల ఆ సినిమాలో చేర్చలేదు. టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం ఆ పాటను మధురంగా పాడిన తరువాతనే ఆ గీతానికి గుర్తింపు లభించింది. ఒకసారి ఢిల్లీ వెళ్ళి అక్కడ నెహ్రూను కలిసాడు. తాను రచించిన బుద్ధ చరిత్ర లోని ఒక పద్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ఆయనకు వినిపించాడు. నెహ్రూ ముగ్ధుడై ఆయనను మెచ్చుకుని 500 రూపాయలు బహూకరించాడు.

**సుందరాచారి గురించి పలువురి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...**

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ... మృదువైన పదములు, మధురమైన శైలి, మంచి కల్పన కలిగి వీరి కవిత్వము అనందము నాపాదించకలిగి ఉంది. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ... తెలుగు పలుకు, కవితాశక్తి, సౌకుమార్యము, ఈమూడు గుణములు మూటకట్టి వీరు పొత్తములను రచించు చున్నట్లున్నది. ఈ యుగములో వీరిదొక ప్రత్యేక వాఙ్మయముగా ఏర్పాటు కాబోవు చున్నట్లున్నది. వీరిశైలి సంస్కృత సమాసముల నుండియు, మారుమూల పదముల నుండియు విడివడి సరళమైనది. గడియారం వేంకటశేష శాస్త్రి ...ఈతని శైలి మిక్కిలి సరళమైనది. భాష సుగమనమైనది. ధార సహజమైనది. పోకడలు, ఎత్తుగడలు, అలంకారములు చమత్కారములు, మున్నగు ప్రసాధనములన్నియు సుముచిత సన్నివేశములే భావ శ్రుతిలో మేళవించినవి. శ్రీరాయప్రోలు సుబ్బారావు... సుందరాచారి గారి సూక్తి ఎంత తేటగా సూటిగా వినబడుతుందో అంత స్ఫురితంగా సుదూరంగా ధ్వనిస్తుంది. ఇది ఈ కవి రచనలలోని అనన్య విశిష్టత. శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ...తేటగీతుల తెలుగు తీదీపిరుచుల యూట....కొంకుల కొసరుల కాటుపడక సారతరమిది సుందరాచారి



కవిత. శంకరంబాడి సుందరాచారి గొప్ప కవి. పద్య కవిత్వం ఆయనకు ప్రీతిపాత్రమైన కవితా ప్రక్రియ. పద్యాలలోనూ తేటగీతి ఆయన ఎంతో ఇష్టపడ్డ ఛందస్సు. తేటగీతిలో ఎన్నో పద్యాలు వ్రాసాడు. "నా పేరు కూడా (శంకరంబాడి సుందరాచారి) తేటగీతిలో ఇమిడింది, అందుకనే నాకది బాగా ఇష్టం" అనేవాడు ఆయన. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గీతమైన తేటగీతులలోనే రాసిన మా తెలుగు తల్లికి.. ఆయన రచనలలో మణిపూస వంటిది. రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని రమ్యంగా వర్ణించిన నాలుగు పద్యాలు అవి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది.

**మా తెలుగు తల్లికి మల్లె పూదండ, మా కన్న తల్లికి మంగళారతులు.కడుపులో బంగారు కనుచూపులో కరుణ, చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి. గల గలా గోదారి కదలి పోతుంటేను, బిర బిరా కృష్ణమ్మ పరుగులిడు తుంటేను, బంగారు పంటలే పండుతాయి, మురిపాల ముత్యాలు దొరలుతాయి. అమరావతీ నగర అపురూప శిల్పాలు, త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు, తిక్కయ్య కలములో తీయందనాలు, నిత్యమై నిఖిలమై నిలచి ఉండేదాకబీ రుద్రమ్మ భుజ శక్తి మల్లమ్మ పతి భక్తి, తిమ్మరుసు ధీయుక్తి కృష్ణ రాయని కీర్తి, మా చెవులు రింగుమని మారు మ్రోగేదాక, నీ పాటలే పాడుతాం నీ ఆటలే ఆడుతాం జై తెలుగు తల్లీ, జై తెలుగు తల్లీ,జై తెలుగు తల్లీ.**

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# అమ్మ చేతికిస్తే నిమ్మ.. లాభాల కొమ్మే..!

నకిరేకల్ : మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున ఆహారశుద్ధి యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సహకారంతో వీటిని నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న పంట ఉత్పత్తులను గుర్తించి స్థానిక మహిళా పొదుపు సంఘాలతో వాటి శుద్ధికోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్గొండ జిల్లాలో బత్తాయి, సూర్యాపేట జిల్లాలో కూరగాయలు, పాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో పాడి ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటును తాజాగా ప్రతిపాదించారు. నల్గొండ జిల్లాలో బత్తాయితోపాటు నిమ్మ ఆహార శుద్ధి యూనిట్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో బత్తాయి తర్వాత నిమ్మసాగే అధికం. రాష్ట్రంలో 90 శాతం



నిమ్మ ఉమ్మడి జిల్లాలోనే సాగవుతోంది. నిమ్మ దిగుబడుల ద్వారా ఏటా రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. నిమ్మ, బత్తాయిల ప్రాధాన్యం గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలోనే ప్రథమంగా నల్గొండ జిల్లాలో నిమ్మ, బత్తాయి మార్కెట్లను నెలకొల్పింది. నకిరేకల్‌లోని నిమ్మ మార్కెట్ మాత్రమే విజయవంతంగా పనిచేస్తోంది. మార్కెట్ల మాదిరిగానే బత్తాయి, నిమ్మ ఆహార శుద్ధి యూనిట్లను జిల్లాలో నెలకొల్పాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిమ్మ దిగుబడుల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉంది. 20 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నిమ్మతోటలు సాగవుతున్నాయి. 17వేలకు పైగా రైతు కుటుంబాలకు నిమ్మసాగే ప్రధాన ఆధారం. వాతావరణం అనుకూలిస్తే ఏటా 2.50 లక్షల టన్నులకుపైగా నిమ్మకాయల దిగుబడులు వస్తాయి. మధ్యదళారులు, వ్యాపారుల మాయాజాలంతో సరైన ధర అందక నిమ్మ రైతులు నష్టపోతున్నారు. ఏటా లక్షల టన్నుల నిమ్మ దిగుబడులు వస్తున్న ఉమ్మడి జిల్లాలో.. ప్రధానంగా నకిరేకల్ ప్రాంతంలో ఈ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే రైతులకు భరోసా ఉంటుంది.

నిమ్మ సాగు ఇలా.. (ఎకరాలలో)

నల్గొండ: 8999

సూర్యాపేట: 8200

యాదాద్రి: 5020

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

– వేముల వీరేశం, ఎమ్మెల్యే

మహిళా శక్తి పథకంలో నిమ్మకు ప్రాధాన్యం కల్పించి ఈ ప్రాంతంలో ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రత్యేకంగా విన్నవిస్తాను. నిమ్మ పరిశ్రమల ఏర్పాటుకు మన ప్రాంతంలో ఉన్న అవకాశాలను సీఎంకు, వ్యవసాయశాఖ మంత్రికి చెబుతాను. యూనిట్ల ఏర్పాటుకు నా వంతు కృషిచేస్తా.

# ముంచుతోందని మూసేశారు..!

మోత్కూరు : రైతులకు లాభాలు తెచ్చిపెడుతుందని సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్ నష్టాల్లో ముంచుతోంది. మోత్కూరు నాగార్జున రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో 2018లో మండలంలోని తొర్రూరు–వలిగొండ రోడ్డుకు అనాజిపురం–దత్తప్పగూడెం మధ్యన రూ.20 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. నష్టాలు రావడంతో మూడేళ్ల కిందట మూసేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆయిల్ కంపెనీలతో ప్రత్యేక ఒప్పందం ప్రకారం రైతులకు డీజిల్, పెట్రోల్‌ను తక్కువ ధరలకు అందివ్వాలన్న లక్ష్యంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు బంక్‌లను ఏర్పాటు చేశారు. రైతుల కోసం ఆయిల్ కంపెనీల ప్రత్యేకంగా తక్కువ ధరలకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేయకపోవడం, నిర్వహణ లోపంతో వరుసగా నష్టాలు చవిచూసింది. మధ్యలో కొంతకాలం మూతపడింది. మళ్లీ రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి పునఃప్రారంభించినా నష్టాలు రావడంతో మూసివేయక తప్పలేదు.

బంక్ ఏర్పాటుకు 25 ఏళ్ల కాలపరిమితితో దత్తప్పగూడెం గ్రామ రైతు వద్ద స్థలం లీజుకు తీసుకున్నారు. స్థలం అద్దెగా ప్రతీనెలా రూ.10 వేలు చెల్లిస్తున్నారు. నిర్వహణకు ఉద్యోగిని నియమించుకుని రూ.10 వేల వేతనం ఇస్తున్నారు. బంక్ నడవకున్నా నెలకు రూ.20 వేలు సింగిల్‌విండో నుంచి చెల్లించాల్సి వస్తోంది. దీంతో జనవరి నెలలో ఉద్యోగిని మాన్పించారు. అయినా భూమికి అద్దె మాత్రం చెల్లించక తప్పడం లేదు.



**రూ.1 1.50 లక్షల విలువైన ఇంధనం నిల్వలు**

ప్రస్తుతం ఈ బంక్‌లో రూ.11.50 లక్షల విలువైన డీజిల్, పెట్రోల్ నిల్వ ఉంది. దీన్ని అమ్మేందుకు జిల్లా కలెక్టర్, డీసీవో అనుమతులు తీసుకొని, అమ్ముకోవాల్సి ఉంది. సీసీ కెమెరాలు, బంక్‌లోని బ్యాటరీలు చోరీకి గురవడంతో బంక్ వద్ద రక్షణ లేకుండా పోయింది.

**బంక్ ఏర్పాటుతో అంతా నష్టమే**

పేలపూడి వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ ఛైర్మన్

బంక్ ద్వారా అంతా నష్టమే వచ్చింది. ఈ పెట్టుబడి ఇతర వ్యాపారాల మీద పెడితే లాభాలు వచ్చేవి. గత పాలకవర్గం అవగాహన రాహిత్యంతో ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు, పాలకవర్గం నిర్ణయాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# ఏడేళ్లుగా అదే కూలీ



సిరిసిల్ల: ఆటుపోట్లను ఎదుర్కొంటున్న జిల్లా వస్త్ర పరిశ్రమలో మరో సమస్య వచ్చిపడింది. కార్మికుల కూలీరేట్ల పెంపుపై మూడురోజులుగా సమ్మె జరుగుతోంది. ప్రైవేటు ఆర్డర్లతోపాటు ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన మహిళా సంఘాల చీరలకు కూలీరేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. గురువారం సమ్మెచేస్తున్న కార్మిక సంఘాల నాయకులను అరెస్టుచేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాస్తవానికి ప్రైవేటు ఉత్పత్తులపై 2024 ఏప్రిల్‌లోనే కూలీ రేట్ల ఒప్పందం ముగిసింది. అయినా ఏడాదిగా యజమానుల నుంచి స్పందనలేదు. ఇటీవల వస్త్రోత్పత్తుల్లో నష్టం వస్తుందని పెద్ద, చిన్న పన్నాలకు కలిపి మూడు పైసల చొప్పున కూలీ తగ్గించారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ ఆర్డర్ల పంపిణీకి ముందే టెస్కో సేకరణ ధర, కార్మికులకు ఇచ్చే కూలీరేట్ల నిర్ణయం జరుగుతుంది. ఈసారి అవేమీ లేకుండానే వస్త్రోత్పత్తులు ప్రారంభించారు. ఇప్పటికే విద్యుత్తు సమస్యతో ఎస్ఎస్ఐ యూనిట్లను మూసివేయగా... మ్యాక్స్ సంఘాల్లో కార్మికుల కూలీ రేట్లతో సమ్మెబాట పట్టారు. పరిష్కారం లభించకపోతే రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు తప్పవనే ఆందోళన నెలకొంది.

**అటకెక్కిన ఒప్పందం** జిల్లా వస్త్ర పరిశ్రమలో 30వేల మరమగ్గాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా 20వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. పరిశ్రమలో ప్రతీ రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచుతారు. 33 ఏళుగా ఇది అనవాయితీగా వస్తుంది. తొలుత 1992లో పది పిక్కులకు పాలిస్టర్ వస్త్రం ఉత్పత్తి కూలీ 8 పైసల నుంచి ప్రారంభమైంది. అలా 2018లో చిన్నపన్నాకు 22.50 పైసలు, పెద్దపన్నాకు 23.50 పైసలు. కాటన్‌లో చిన్నపన్నా 40 పైసలు, పెద్దపన్నా 45 పైసలు చేశారు. వార్పిన్‌లకు వెయ్యిపోగులకు గాను రూ.32, వైపని వారికి రూ.88గా ధర నిర్ణయించారు. ఏడేళ్లుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

**కార్మికులు కోరుతున్నది ఇదీ..**

ఏడేళ్లుగా కూలీ రేట్లు పెరగడంలేదు. ఈ సారి పది పిక్కులకు చిన్నపన్నా 25పైసలు, పెద్దపన్నా 26 పైసలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. 2023లో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావాల్సిన పదిశాతం రాయితీని ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతున్నారు. బతుకమ్మ చీరల ఉత్పత్తికి మీటరుకు రూ.5.25తో పాటు నూలు రాయితీ కింద మరో రూ.1.42 చెల్లించారు. ప్రస్తుతం మహిళా సంఘాల చీరల ఉత్పత్తికి ముందే కూలీధర నిర్ణయించి, నూలు రాయితీ చెల్లింపులను కొనసాగించాలని కోరుతున్నారు.

**రూ.వెయ్యి చెల్లించాలి**

వస్త్రపరిశ్రమలోని కార్మికులకు ఏడాదిగా పనిలేదని పోరాటం చేస్తే ప్రభుత్వం మహిళా సంఘాల చీరల ఆర్డర్లు ఇచ్చింది. వీటి ఉత్పత్తిపై అధికారులు యజమానులు, ఆసాములతో కలిసి మాట్లాడారు. కార్మికుల కూలీరేట్ల విషయమై మాట్లాడలేదు. చీరలు ఉత్పత్తిచేసే కార్మికులకు రోజు కూలీ రూ.వెయ్యి ఇవ్వాలని కోరుతున్నాం.

ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

# పేరుకుపోతున్న పూడిక



జగిత్యాల : ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటివనరైన శ్రీరామసాగర్ జలాశయంలో పూడిక పేరుకుపోయి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గుతోంది. 112 టీఎంసీల సామర్థ్యంగల ఎస్సారెస్పీలో నిరుటివరకు 90.313 టీఎంసీల నీటిని నిల్వచేయగా పూడిక పేరుకుపోయి నిరుటి నుంచి నీటినిల్వ 80.501 టీఎంసీలకు తగ్గిపోయింది. ఈ ప్రభావం ఉమ్మడి జిల్లాపై అధికంగా పడనుంది. రాష్ట్రప్రభుత్వం పలు ప్రాజెక్టుల్లో పూడికతీతను చేపట్టగా ఎస్సారెస్పీలోని పూడికను కూడా తొలగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు అన్ని చెక్‌డ్యాంలు, రోళ్లవాగు తదితర ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల్లో నీటినిల్వ, కాలువల నిర్మాణాలకు మరమ్మతు, చెరువుల్లోకి ప్రాజెక్టులనీటిని తరలించే అనుసంధాన కాలువలు, పైపులైన్ల నిర్మాణం తదితరాలకు వేసవిలోనే చర్యలు చేపడితే వానాకాలం వరకు జిల్లాకు సాగునీటి సుస్థిరత ఏర్పడుతుంది.

ఒక ఏడాదిలో సరాసరిగా 80–104 గంటల వాన మాత్రమే కురుస్తుండగా ఈ వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని ఏడాది పొడవునా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10–17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40–51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలం బయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి. తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు. వ్యవసాయ బావులను రీఛార్జిచేసేలా బావికి సమీపంలో గుంతనుతవ్వి వృథానీటిని మళ్లించాలి. ఉపాధిహామీ ద్వారా పర్కులేషన్ ట్యాంకులతో పాటు కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలిస్తోంది. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20–45 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69–90 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను ప్రభుత్వం రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే.

గత వానాకాలంలో ఎస్సారెస్పీలోకి 287 టీఎంసీల వరదనీరు రాగా నిల్వసామర్థ్యం లేనందున దాదాపు 140 టీఎంసీలకుపైగా నీటిని మిగులు జలాలుగా గోదావరిలోకి వదలాల్సి వచ్చింది. మన జిల్లాలోనూ సాధారణం కన్నా 21 శాతం అధిక వర్షపాతం నమోదైనా దాదాపు 32 టీఎంసీలకుపైగా వరదనీరు వృథాగా దిగువకు వెళ్లిపోయింది. అధిక వర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాది పొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, సుస్థిర వినియోగం అత్యంత అవశ్యంగా మారింది. 14.33 లక్షల ఎకరాల సాగులో 8.71 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.

# ఆకాశంలో మబ్బులు.. గుండెల్లో గుబులు

సూర్యాపేట : ఆకాశం మేఘావృతమై వర్ష సూచనలు కన్పించడం అన్నదాతలను దడపుట్టిస్తోంది. అత్యధికం వరి పంటలు కోతకు వచ్చాయి. మరోవైపు మామిడి కాయలు చేతికి రానున్నాయి. కల్లాల్లో మిరప రాశులు ఆరబోశారు. ఎండల నుంచి జనం కొంత ఉపశమనం లభించినా రైతుల్లో మాత్రం ఆందోళన మొదలైంది. పలు ప్రాంతాల్లో జల్లులకు కురుస్తుండటం కలవరపెడుతోంది.

ఎస్సారెస్పీ కాల్వల్లో నీరు వదలక, భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోయి, చీడపీడలతో చాలా వరకు పంటలు ఎండిపోయాయి. ఉన్న కాస్త పంట కోతలు చేపట్టాలనుకుంటున్న రైతుల ఆశలు వాన ముంచెత్తే ప్రమాదముంది. మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గాలిదుమారం, వడగళ్ల వర్షం కురిస్తే మామిడి కాయలు, వరి ధాన్యం నేలరాలి తీవ్రనష్టం చేకూరే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు. మిరప ధరలేక కల్లాల్లో నిల్వచేసి ఉంచారు. మిరపకాయలు తడిస్తే నాణ్యత చెడిపోతుంది. టార్పాలిన్‌లు కప్పేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

**వరికి పెద్ద ముప్పు**

జిల్లాలో యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. చిన్నపాటి గాలి



వీచినా వెదజల్లడం, డ్రమ్ సీడర్ ద్వారా చేపట్టిన సాగు నేలవాలే ప్రమాదం ఎక్కువగా ఉంది. దీంతో పంట కోసేందుకు కష్టతరంగా మారి, గింజలు రాలి తీవ్రంగా నష్టం చేకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం చెడు వానలు కురిసే తరుణం కావడంతో వీరికి మరింత ముప్పు వాటిల్లనుంది. సూర్యాపేట జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోళు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం అక్కడక్కడా కోసిన పంటను గతంలో ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఆరబోస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

# వేసవి సెగలు.. సర్పాల బుసలు

ఖమ్మం : వేసవిలో పాముకాటు ప్రమాదాలు అధికం. వేడి, ఉక్కపోతకు సర్పాలు కలుగుల్లోంచి బయటకు వచ్చి ఆహారం, నీరు, చల్లటి ప్రదేశాల కోసం అన్వేషిస్తాయి. పొదలు, మరుగు ప్రాంతాల్లో చూసుకోకుండా వాటిపై కాలు వేస్తే ప్రాణరక్షణ కోసం కాటు వేస్తాయి. ఈ నేపథ్యంలో రైతులు, ఉపాధి కూలీలు, శివారు కాలనీలో జీవించేవారు చాలా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో విరుగుడు ఇంజెక్షన్లు ఉన్నాయన్నారు.

**ఈ సమయంలోనే ఎందుకు...**

నేల వేడెక్కడంతో చల్లని ప్రదేశాలను ఆశ్రయించడానికి పాములు సంచరిస్తుంటాయి. ఇంటి పరిసరాల్లో మరుగు ప్రదేశాల నుంచి నీటి కోసం ఇళ్లలోకి వస్తాయి. ఎలుకలు, చిన్నచిన్న కీటకాలు, గబ్బిలాలను తినేందుకు వెంబడిస్తాయి. కొన్నింటికి వేగంగా దాడి చేసే స్వభావం ఉంటుంది. రాత్రిపూట చురుగ్గా ఉంటాయి.

విషపూరితం: రక్తపింజర, కట్లపాము, నాగుపాము

విషరహితం: పసిరిక, జెరిగొడ్డు, నీరుగట్టె, రెండు తలల పాము(మన ప్రాంతంలో ఉండేవి 70 శాతం విషరహిత పాములే)

**జాగ్రత్తలు తప్పనిసరి**

పొలాల్లో, పొదల్లో పని చేసేవారు పొడవాటి బూట్లు ధరిస్తే మేలు. జీన్స్ వంటి కాటన్ దుస్తులు కొంత రక్షణ కల్పిస్తాయి.



రాత్రి వేళలో పాదచారులు టార్చిలైటును ఉపయోగించాలి.

ఇంటి పరిసరాల్లో పాత, చెత్త సామగ్రి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

పొదలను శుభ్రం చేసుకోవాలి.

గోడల రంధ్రాలు, కిటికీలు, తలుపుల కింద భాగాలను మూసివేయాలి.

వేసవిలో నేలపై పడుకోవడం ప్రమాదకరం.

బాధితులు ఏం చేయాలి

బాధితుడు ఎక్కువ కదలకుండా, ఆందోళన చెందకుండా చూడాలి.

సాధ్యమైనంత వేగంగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

కాటు వేసిన ప్రాంతాన్ని కోయడం, నోటితో పీల్చడం, మసాజ్ చేయడం, పైన కట్టుకట్టడం వంటివి చేయొద్దు.

కరిచిన పాము ఏరకానికి చెందిందో తెలుసుకుంటే చికిత్స సులభమవుతుంది. వీలైతే ఫొటో తీయాలి.

విష పూరిత పాము కరిస్తే గాయపడిన వాపు, రక్తం గడ్డకట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నాటు వైద్యం, మంత్రాల నెపంతో జాప్యం చేస్తే ప్రాణాంతకమవుతుందని ఖమ్మం సర్వజనాసుపత్రి జనరల్ మెడిసిన్ వైద్యుడు సునీల్ హెచ్చరించారు.

**కలెక్టరేట్ ఆవరణలో మహిళకు పాము కాటు**

ఖమ్మం కొత్త కలెక్టరేట్ భవనం ఆవరణలో గార్డెనింగ్ పనులు చేసే ఆదిలక్ష్మి అనే మహిళ పాము కాటుకు గురైంది. వి.వెంకటాయపాలెం నివాసి ఆదిలక్ష్మి కలెక్టరేట్ భవనం ఎదురుగా ఉన్న గార్డెన్‌లో చెత్త తొలగింపు పనులు చేస్తుండగా ధర్నా చౌక్ వెనక ప్రాంతంలో నాగుపాము ఆమె కాలిపై కాటేసింది. బాధితురాలిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాటు వేసిన పామును కొట్టి చంపారు. ఆదిలక్ష్మిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

# జీపీఎస్.. తుస్!

మెదక్ : చెత్త సేకరణ వాహనాలు సకాలంలో రావడంలేదని పురపాలి కల కాలనీల వాసులు గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే సమస్యను పరిష్కరించేందుకు చెత్త సేకరణ ఆటోలు, ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేశారు. ఈ విధానం అందుబాటులోకి వచ్చిన తొలిరోజుల్లో ఫిర్యాదుల సంఖ్య తగ్గింది. అయితే రానురాను పర్యవేక్షణ లేకపోవడంతో ఏర్పాటు చేసిన వాటిల్లో సగం కూడా పని చేయకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

జిల్లాలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ పురపాలికలున్నాయి. వీటిల్లో చెత్త సేకరణ చేసే ఆటోలు, ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లు, జేసీబీ, రోడ్లు ఊడ్చే యంత్రం, డోజర్లు, వైకుంఠ రథాలు తదితర వాహనాలకు రెండేళ్ల కిందట ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. శానిటేషన్ విభాగం అధికారులు పర్యవేక్షించారు. మొదట్లో సరిగానే ఈ విధానం పకడ్బందీగా సాగింది. అనంతరం వర్షానికి తడిసిపోయి కొన్ని మరమ్మతుకు గురయ్యాయి. మరికొన్నింటికి పారిశుద్ధ్యం సిబ్బందే తీగలు తెంపారని ఆరోపణలున్నాయి. అయినా అధికారులు పట్టించుకోలేదు.

సమన్వయం లేక

జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేసింది ఇంజినీరింగ్ శాఖ, పర్యవేక్షణ శానిటేషన్ విభాగం. పరికరాలు పనిచేయకపోతే స్థానికంగా మరమ్మతు చేసేందుకు అవకాశం లేదు. ఆ సంస్థకు చెందిన నిపుణులే వచ్చి బాగు చేయాల్సి ఉంటుంది. మెదక్ పురపాలికలో ఇదే పరిస్థితి తలెత్తగా, ఆ సంస్థ ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని శానిటేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులకు చెబితే వారు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. మిగతా పురపాలికల్లో జరుగుతున్నా, అన్ని పని చేస్తున్నాయని చెప్పడం గమనార్హం.

మెదక్ పట్టణం ఔరంగాబాద్, సంజీవయ్యనగర్ కాలనీ, పిల్లికొటాల్‌తోపాటు ఇతర కాలనీలకు సకాలంలో చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా మధ్యలోనే పారబోసి నిప్పు పెడుతున్నారని గతంలో కౌన్సిలర్లు ఆరోపించారు. అయినా అధికారులు చర్యలు తీసుకోలేదు. రామాయంపేట పట్టణం వెంకటేశ్వర కాలనీ, టీచర్స్ కాలనీతోపాటు, ఇతర ప్రాంతాలకు 2–3 రోజులకు ఒకసారి వాహనాలు వస్తున్నాయంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

నర్సాపూర్‌లో చెత్త సేకరణ సరిగా చేస్తున్నా, డంపుయార్డుకు తరలించకుండా ప్రధాన మార్గాల్లో కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్నారు. తూప్రాన్‌లో పలు కాలనీలోకి చెత్త సేకరణకు 2–3 రోజులకు ఒకసారి వాహనాలు వెళ్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాంనగేష్, అదనపు కలెక్టర్‌జీపీఎస్ పరికరాలు పని చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తాం. వాటి మరమ్మతుకు తగిన చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరణ సజావుగా సాగేలా చూస్తాం.

చురకలు



# లే'అవుట్'

కుత్బుల్లాపూర్ : ఎల్‌ఆర్‌ఎస్ కింద అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొందరు వ్యక్తులు ప్రైవేటు పట్టా భూములు లేఅవుట్లు చేసే క్రమంలో చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ మార్గదర్శకాల ప్రకారం ఆయా లేఅవుట్లలో ఉన్న ప్లాట్లు ప్రభుత్వ సర్వే నంబరులో ఉన్నాయా? లేదా? అనేది రెవెన్యూ అధికారులు నిర్ధారించాలి. కొన్నేళ్లుగా కనుమరుగవుతున్న స్థలాలను పట్టించుకోని యంత్రాంగం తాజాగా ఎలా స్పందిస్తుందోననే ఆసక్తి నెలకొంది.

**పదిహేడు ఎకరాల ఆక్రమణ..**

గాజులరామారం సర్కిల్‌లో రెండు దశాబ్దాలుగా కొందరు వ్యక్తులు వెంచర్లు వేసి విక్రయిస్తున్నారు. దీని మాటున రూ.470 కోట్లు విలువ చేసే 17.27 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. కొందరు



పథకం ప్రకారం ప్రైవేటు భూములు కొనుగోలు చేసి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు కలుపుకొన్నారు. పాత తేదీలతో గ్రామ పంచాయతీ లేఅవుట్లు (అక్రమ లేఅవుట్లు) సృష్టించి కనీసం సామాజిక అవసరాలకు స్థలాలు కేటాయించకుండా ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టారు. ఈ లేఅవుట్లలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరించేందుకు నిర్వాహకులు పావులు కదుపుతున్నారు. సంబంధిత లేఅవుట్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఉప తహసీల్దార్ మల్లికార్జున్‌తెలిపారు.

**కమిషనర్ పరిశీలన..**

గాజులరామారం 11,12,13,100,127 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత నెల 27న క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఆయా సర్వేనంబర్లలో ఎక్కడెక్కడ ఎంత భూమి కబ్జాకు గురైందో రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో కబ్జాదారుల వెన్నులో వణుకు పుడుతోంది.

# అత్యాశే.. అంతమొందిస్తోంది

జగిత్యాల: నిమిషాల్లో రూ.లక్షలు, గంటల్లో రూ.కోట్లు సంపాదించవచ్చనే ఆశ యువకులను ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల వైపు ఆకర్షిస్తోంది. కష్టపడితేనే నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చనే నిజాన్ని దాటేసి ఆన్‌లైన్ జూదం వైపు పరుగులు పెడుతున్నారు. బెట్టింగుల్లో పెట్టుబడులు పెడుతూ తాము మోసపోయామని గ్రహించేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. చేతిలో చిల్లిగవ్వలేక, తల్లిదండ్రులకు ముఖం చూపించలేక, సమాజంలో బతకలేమన్న బలహీనమైన ఆలోచనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బెట్టింగ్ మాయలో పడి ఏడాదిలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు.


గడచిన రెండేళ్లలో 1,298 బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను కేంద్రం రద్దు చేసింది. దీంతో అక్షరాలు మార్చి మరీ నిర్వాహకులు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభం కావడంతో ఈ మోసాలు మరింత పెరిగాయి. క్రికెట్‌తో పాటు క్యాసినో, పోకర్, రమ్మీ యాప్స్ యువకులను నిండా ముంచుతున్నాయి. బెట్టింగ్ కోసం అప్పులు చేయడం.. అవి తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయడం.. ఒక్కోసారి రుణయాప్స్‌లో డబ్బులు తీసుకోవడంతో తలకు మించిన భారమవుతోంది.

**పెరిగిన నిఘా**

తెలంగాణ గేమింగ్ చట్టం 2017 ప్రకారం ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అసెంబ్లీలో రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్/గేమింగ్‌లపై చర్యలు తీసుకునేందుకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డీజీపీ సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ యాప్స్ నిర్వాహకులపై నిఘా పెంచిన పోలీసులు యువకులను కూడా సామాజిక మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేస్తున్నారు.

**విషాదాలు ఇవీ..!**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పనిచేసే



యువకుడు బెట్టింగ్ యాప్స్‌లో రూ.10 లక్షల మేర నష్టపోయాడు. ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడి కుటుంబసభ్యులకు తీరని మనోవేదన మిగిల్చాడు.

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పెద్దపల్లి జిల్లా యైటింక్లైన్‌కాలనీకి చెందిన యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల వలలో పడి రూ.11 లక్షలు నష్టపోయాడు. ఉన్నదంతా కోల్పోయి చివరకు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. అప్పులు పెరిగిపోవడంతో మనోవేదనతో తమ వ్యవసాయబావిలోనే దూకి ప్రాణాలు కోల్పోయాడు.

**బెట్టింగ్ వలలో పడొద్దు**

రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

ఆన్‌లైన్ మోసాల బారిన పడినవారు కోలుకోవడం చాలా కష్టం. సాంకేతికతను ఆసరా చేసుకొని అమాయకులను వలలో వేసుకుంటారు. తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఆన్‌లైన్ లింకులు కూడా ప్రమాదాన్ని కొనితెస్తాయి. కష్టపడితే యువకులకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. మోసాల బారిన పడి ప్రాణాలు కోల్పోతే తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతుంది.

# నీటి వనరు.. మరమ్మతులు కనరు



తాండూరు: జిల్లాలోని 20 మండలాల్లో చెరువులు, కుంటల కింద వేలాది ఎకరాల ఆయకట్టు ఉంది. అన్నీ చిన్న నీటి వనరులే. ఏటా వర్షాకాలంలో వరదలతో అలుగు పారుతాయి. ప్రతి దానికి ఒకటి, రెండు తూములు, కాలువలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నీరు పారించని స్థితిలో ఉన్నాయని వెల్లడైంది. ప్రస్తుత వేసవిలో వీటిని మరమ్మతు చేసేందుకు మంచి అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

యాలాల మండలంలో పెద్దదైన జుంటుపల్లి జలాశయం కుడి, ఎడమ కాలువలు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. యాలాల పరిధి శివసాగర్ జలాశయం ఎడమ కాలువ తూము వెలుపలి భాగం 2013లోనే కొట్టుకు పోయింది. ఇప్పటి వరకు బాగు చేయలేదు.

ఇక జిల్లాలో అతిపెద్దదైన కోట్‌పల్లి జలాశయం ఎడమ, కుడి, బేబీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు శిథిల మయ్యాయి.

**ప్రమాదకరంగా సర్పన్‌పల్లి తూము మెట్లు**

వికారాబాద్ మండల పరిధిలోని సర్పన్ పల్లి ప్రాజెక్టు తూము మెట్లు ప్రమాదకరంగా మారాయి. కాలు పెట్టాలంటే భయపడాల్సిందే. పది సంవత్సరాలుగా సరిచేయాలని ఆయకట్టు రైతులు, జాలర్లు కోరుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు. కట్టకు రంధ్రం పడి నీరు వృథా

దుద్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గోపన్ చెరువు కట్టకు గతంలో కురిసిన వర్షాలకు రంధ్రం ఏర్పడి నీరు వృథాగా వెళ్లడంతో తూముకు అడ్డంగా రాళ్లు, మట్టి పోశారు. దీంతో తూము దగ్గర పిచ్చి మొక్కలు మొలిచాయి. కాలువ సైతం ముళ్ల పొదలతో నిండిపోయింది. **అలుగు పూర్తిగా దెబ్బతింది**

ధారూర్: మండల పరిధిలోని ఎబ్బనూర్ గ్రామ సమీపంలో అనంతగిరి కొండలకు దిగువన ఎబ్బనూర్ చెరువును నిర్మించారు. కొన్నేళ్లుగా నిర్వహణ చేపట్టక పోవడంతో అలుగు, కాలువలు మరమ్మతులకు చేరాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు అలుగు పూర్తిగా దెబ్బతిని నీరు నిలవని పరిస్థితి నెలకొంది.

**నీటి నిల్వకు వీలులేని ఎబ్బనూర్ చెరువు అలుగు**

మున్సిపల్ నుంచి పెద్ద చెరువుకు వెళ్లే కాలువను జాతీయ రహదారికి మధ్యలోకి వచ్చిందని పూర్తిగా తొలగించారు. కొడంగల్ పెద్ద చెరువుకు ఈ కాలువ ద్వారానే 90 శాతం నీరు చేరుతుంది. ప్రస్తుతం వర్షకాలం వస్తే కాలువ నీరు ఊర్లోకి చేరే ప్రమాదం ఉంది.

# వరుణ దేవా.. కరుణ చూపవా!



గంగాధర: యాసంగిలో ఆరుగాలం శ్రమించి పండించిన పంట కోత దశలో అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే మెడవిరుపు, సుడిదోమ వంట తెగుళ్లు సోకి పంటకు నష్టం మిగిల్చిందని ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో వరి ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు అక్కడక్కడా చినుకులు రాలడంతో ధాన్యం కాపాడుకు నేందుకు పరుగులు పెట్టారు. రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం కురవచ్చొని, గాలులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించడంతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. వరుణదేవా.. మా వైపు రావద్దని ప్రార్థిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

జిల్లాలో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ఆధారంగా ఎక్కువగా వరి పంటనే వేశారు. గోదావరి జలాలతో 2,66,896 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. 3.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 336 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తుండగా 7412 టార్పాలిన్లు అవసరమని గుర్తించారు. చాలామంది కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏ కేంద్రంలో కూడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులే సొంతంగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు యూరియా సంచులను పరదలుగా కుట్టించుకొని ధాన్యంపై కప్పి ఉంచుతున్నారు. కొందరు రైతులు అద్దెకు టార్పాలిన్లు తెస్తున్నారు.


టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంటను దేవుడిపైనే భారం వేస్తున్నారు. కోత దశలో ఉన్న వరిపంట వర్షానికి నేలంతా తేమగా మారి హార్వెస్టర్‌తో కోత చేయడానికి ఇబ్బందులు నెలకొననుండంతో చైన్ యంత్రాలకు డిమాండు పెరుగుతుంది. అప్పుడు ఈ యంత్రానికి అదనంగా రైతులు డబ్బులు వ్యయం చేయాల్సి వస్తుంది.

వర్షాలు కురిసి పొలం మడుల్లో నీరు నిల్వ ఉంటే గండ్లు పెట్టి నీరంతా బయటకు పంపించాలి. లేకపోతే సుడిదోమ సోకే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సుడిదోమ సోకిన పంట చుట్టూ గాలి తగిలేలా వరి పంట మధ్యలో పాయలు తొక్కాలి. తెగుళ్లు ఉద్ధృతమైతే మాత్రం వ్యవసాయ అధికారుల సూచన మేరకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

మామిడి తోటల్లో కాయలు పక్వ దశకు చేరగా ఈదురు గాలులకు కాయలు రాలిపోయే అవకాశముంది. వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలతో మామిడిలో రసం పీల్చే పురుగులు, ఆకుమచ్చ తెగులు ఆశిస్తున్నందున సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఇక కూరగాయలు సాగు చేసిన రైతులకు అకాల వర్షాల భయం వెంటాడుతూనే ఉంది.

లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. పంటలను కాపాడాలంటూ వరుణ దేవుడిని వేడుకుంటున్నారు.

# రాజన్న క్షేత్రం.. వసతి గగనం



వేములవాడ : వేములవాడ రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. నిరుపయోగంగా ఉన్న భవనాల స్థానంలో వసతి గదుల నిర్మాణం చేపడితే ఇబ్బందులు కొంతమేర తీరనున్నాయి. పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే విశాలమైన సంస్కృత కళాశాల భవనం స్లాబ్ పెచ్చులు ఊడి పోతుండటంతో అందులో విద్యాభ్యాసం చేసే వారికి ప్రమాదం ఉందని భావించిన ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని పరీక్షించారు. భవనం సిమెంటు, పిల్లర్లతో నిర్మించలేదని, గోడలపై స్లాబ్‌నిర్మాణం చేశారని నివేదిక ఇవ్వడంతో ఆ భవనం నుంచి సంస్కృత కళాశాలను ఖాళీ చేయించి జాతరగ్రౌండ్‌లోని దేవస్థానం భవనంలోకి మార్చారు. నాలుగు సంవత్సరాలుగా సంస్కృత కళాశాల భవనం నిరుపయోగంగా ఉంది. శిథిలమైన కళాశాల భవనం స్థానంలో రాజన్న భక్తుల కోసం 48 అధునాతన వసతి గదులు నిర్మాణం చేయాలని రూ.5 కోట్ల అంచనాతో ప్రణాళిక సిద్ధం చేసిన ఆలయ అధికారులు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

**గదులు నిర్మిస్తే ప్రయోజనం** రాజన్న ఆలయానికి ప్రతీ నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. ఉత్సవాల సందర్భంగా రద్దీ అధికంగా ఉంటుంది. భక్తుల వసతికి ఆలయానికి చెందిన గదులు ఏమాత్రం సరిపోవు. దీంతో చాలా మంది ఆలయ పరిసరాల్లో, పార్కింగ్ ప్రాంతాల్లో విడిది చేస్తుంటారు. మరి కొందరు భక్తులు అరకొర వసతులతో ఉన్న ప్రైవేటు ఇరుకు గదులను అద్దెకు తీసుకొని విడిది చేసి మరుసటి రోజు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం వసతి గదుల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం ఆలయానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర పురం, శంకర పురం వసతి కాంప్లెక్స్‌లు శిథిలం కావడంతో వాటిలో రాజేశ్వరపురం కాంప్లెక్స్‌ను పూర్తిగా తొలగించి పార్కింగ్‌కు వదిలేశారు. శంకరపురం కాంప్లెక్స్‌ను మూసివేశారు. ఉన్న కొద్దిపాటి కాంప్లెక్స్‌లలో వసతి గదులు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇప్పటికైనా ఆలయ అధికారులు తెలంగాణ కూడలి వద్ద సంస్కృత కళాశాల భవనం స్థానంలో అవసరమైన వసతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

**మళ్లీ ప్రతిపాదన చేయలేదు** సంస్కృత కళాశాల భవనం శిథిలమైందని, ఆ భవనం స్థానంలో వసతి గదులను నిర్మించాలని మొదట ప్రతిపాదనలు జరిగాయి. ఆ తరువాత ఇక్కడ వసతి గదులు నిర్మిస్తే భక్తులకు దూరం అవుతుందని భావించి ప్రతిపాదన విరమించుకున్నారు. తిరిగి ఈ భవనం స్థానంలో ఏ నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలు మళ్లీ చేయలేదు. రఘునందన్, డీఈఈ రాజన్న ఆలయం

# శస్త్రచికిత్సలకే మొగ్గు

మెట్‌పల్లి: సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని అటు ప్రభుత్వం, ఇటు వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నా ఆచరణలో మాత్రం నెరవేరడం లేదు. పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక శాతం శస్త్రచికిత్స కాన్పులే జరుగుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రులు సైతం అదేబాట పడుతున్నట్లు గణాంకాలు చూస్తే అర్థమవుతోంది. శస్త్రచికిత్స కాన్పుల వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిస్క్ కేసుల్లో, ప్రత్యేక సందర్భాల్లో తల్లి, బిడ్డ క్షేమం కోసం శస్త్రచికిత్స ప్రసవాలు చేయాలన్న నిబంధనలున్నా, చాలా వరకు శస్త్రచికిత్స ప్రసవాలకే మొగ్గు చూపుతుండడం ఆందోళనకరమని పలువురు పేర్కొంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు సుఖ ప్రసవాలు అయ్యేలా వారితో వ్యాయామాలు, ఆసనాలు చేయించడానికి మిడ్‌వైఫరీ నర్సుల వ్యవస్థ ఉంది. కానీ గర్భిణుల కుటుంబాలు కొందరు ముహూర్తాలు, మంచి రోజులు చూసుకోవడం, నొప్పులు భరించలేమని చెబుతూ వైద్యులపై ఒత్తిళ్లు




తేవడం కూడా సుఖ ప్రసవాలకు బదులు శస్త్రచికిత్సలు పెరగడానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆరోగ్య సిబ్బంది శస్త్రచికిత్సల వల్ల భవిష్యత్తులో వచ్చే అనారోగ్య సమస్యలను వివరించి సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని పలువురు పేర్కొంటున్నారు.

**నియంత్రిస్తేనే..**

మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 982 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధారణ 259, శస్త్రచికిత్స కాన్పులు 723 చేశారు. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సాధారణ ప్రసవాలు తగ్గుముఖం పట్టడంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరా తీశారు. సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో మాట్లాడారు. మెట్‌పల్లి మండల పరిధిలో ఏడాది వ్యవధిలో 702 ప్రసవాలు జరిగాయి. వీటిలో సాధారణ కాన్పులు 154, శస్త్రచికిత్స కాన్పులు 548 జరిగాయి. సుమారు 78 శాతం శస్త్రచికిత్స ప్రసవాలు జరగగా, సాధారణ కాన్పులు కేవలం 22 శాతం మాత్రమే జరిగాయి. ఇందులో మొదటి కాన్పు(ప్రైమీ) 401 జరగగా, ప్రభుత్వాసుపత్రిలో 250, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 151 కాన్పులు చేశారు. ప్రభుత్వాసుపత్రులో జరిగిన కాన్పుల్లో 54 సాధారణ, 196 శస్త్రచికిత్స, ప్రైవేట్‌లో జరిగిన కాన్పుల్లో 27 సాధారణ, 124 శస్త్రచికిత్స ప్రసవాలు జరిగాయి.

**అవగాహన కల్పిస్తున్నాం: సాజిద్‌అహ్మద్, సూపరింటెండెంట్, మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రి**

ఆసుపత్రిలో ఉన్న ఇద్దరు మిడ్‌వైఫరీ నర్సుల ద్వారా గర్భిణులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. సాధారణ ప్రసవాలకు సిద్ధమయ్యేలా వారిలో అవగాహన పెంపొందిస్తున్నాం. శస్త్రచికిత్స వల్ల భవిష్యత్తులో వచ్చే సమస్యలను వివరిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు గర్భిణులకు సూచనలివ్వాలని చెబుతున్నాం.

# రేషన్ వడపోత..!

మిర్యాలగూడ : రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ఈ నెల నుంచి ప్రారంభించింది. పదేళ్లకు పైగా రేషన్ కార్డులు లేక పలువురు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల ప్రభుత్వం రేషన్ కార్డులు, కార్డుల్లో పేర్లు చేర్చేందుకు పలు దఫాలుగా దరఖాస్తులు స్వీకరించింది. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టి ఆర్‌ఐ, తహసీల్దారు లాగిన్‌లలో నిక్షిప్తం చేస్తున్నారు.

**కొత్త కార్డులకు 96 శాతం పూర్తి..**

జిల్లా వ్యాప్తంగా గురువారం నాటికి కొత్త రేషన్ కార్డుల కోసం మొత్తం 8,273 దరఖాస్తులు రాగా వీటిలో ఆర్‌ఐ లాగిన్ 300, తహసీల్దారు లాగిన్‌లో 91 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 96శాతం దరఖాస్తుల విచారణ పూర్తయింది. ఇక కార్డుల్లో పేర్ల చేర్పు కోసం మొత్తం 39,900 దరఖాస్తులు రాగా ఆర్‌ఐ లాగిన్‌లో 1,850, తహసీల్దార్ల లాగిన్‌లో 2,293 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 95 శాతం దరఖాస్తుల విచారణ పూర్తయింది.

**మిర్యాలగూడలో అత్యధిక దరఖాస్తులు..**



కొత్త కార్డులు, కార్డుల్లో పేర్ల చేర్పుకు అత్యధిక దరఖాస్తులు మిర్యాలగూడ మండలంలోనే వచ్చాయి. మండలంలో కొత్త కార్డుల కోసం 1,175 దరఖాస్తులు, పేర్లు చేర్చేందుకు 5,207 దరఖాస్తులు వచ్చాయి. కొత్త కార్డుల కోసం వచ్చిన వాటిలో 99శాతం, పేర్లు చేర్చేందుకు వచ్చిన దరఖాస్తుల్లో 97శాతం క్షేత్ర స్థాయి విచారణ పూర్తయింది. అత్యధిక దరఖాస్తులు వచ్చిన మండలాల్లో నల్గొండ రెండో స్థానంలో ఉంది.

**తక్షణమే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం**

– ఎన్.హరిబాబు, తహసీల్దారు, మిర్యాలగూడ.

కొత్త రేషన్ కార్డులు, కార్డుల్లో పేర్లు చేర్చేందుకు వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి విచారణ ముమ్మరంగా సాగుతుంది. దీని కోసం ప్రత్యేకంగా బృందాలను నియమించాం. మరోవైపు విచారణ పూర్తయిన దరఖాస్తులను అదే రోజు రాత్రి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయిస్తున్నాం.

## విపణి విస్తరణకు సింగరేణి అడుగులు

గోదావరిఖని : సింగరేణి ఇతర రాష్ట్రాల్లో తన వ్యాపార సామ్రాజ్యం విస్తరణకు అడుగులు వేస్తోంది. కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల స్థాపనకు సిద్ధమైంది. ఇప్పటికే సింగరేణి ప్రాంతాల్లో 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాలతో పాటు 245 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరిన్ని కేంద్రాలను ఇతర రాష్ట్రాల్లో నెలకొల్పి సంస్థను జాతీయ స్థాయిలో విస్తరించేందుకు యాజమాన్యం ప్రణాళికలు వేస్తోంది. అందుకు అనుగుణంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వ్యాపారాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తుంది.

**సంయుక్తంగా నిర్మాణం**

రాజస్థాన్‌లో సోలార్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు అక్కడి రాష్ట్ర ఇంధన శాఖతో సింగరేణి సోమవారం ఒప్పందం చేసుకుంది. 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇరు పక్షాలు అంగీకారం కుదుర్చుకున్నాయి. ఇందులో రాజస్థాన్ ప్రభుత్వానికి 26 శాతం, సింగరేణికి 74 శాతం వాటాలుగా నిర్ణయించారు. రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థ(ఆర్‌వీఎన్ఎల్), సింగరేణి సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఒడిశాలో కూడా 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు



కేంద్రాలు నెలకొల్పేందుకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ప్రస్తుతం ఒడిశాలోని నైనీ బొగ్గుబ్లాకును తీసుకున్న సింగరేణి అదే ప్రాంతంలో విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసి బొగ్గును అదే ప్లాంటుకు తరలించాలని భావిస్తుంది.

**7650 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరణ**

వచ్చే అయిదేళ్లలో 7,650 మెగావాట్ల అతిపెద్ద విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల సంస్థగా సింగరేణి విస్తరించనుంది. ప్రస్తుతం 1200 మెగావాట్ల థర్మల్ కేంద్రాలు.. 245 మెగావాట్ల సోలార్ కేంద్రాల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. కొత్తగా ప్రణాళికలో సంయుక్త భాగస్వామ్యంతో నిర్మించనున్న థర్మల్ కేంద్రాలను 4000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనుంది. మరో 1500, 205 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ హైడ్రో విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉంది.

## పక్కన పడితే కష్టమే

పెద్దపల్లి : పెద్దపల్లిలో ఒకే సమయంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన రహదారి విస్తరణ పనులు 'ఒక అడుగు ముందుకు రెండడుగుల వెనక్కి' అనే చందంగా సాగుతున్నాయి. దీంతో ఆరు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా విడుదలయ్యే అభివృద్ధి నిధులను ఎప్పటికప్పుడు ఖర్చుచేస్తేనే ప్రగతి వీచికలు ప్రజలకు కనిపిస్తాయి కానీ.. ఏళ్లు గడిచినా పనులు ముందుకు సాగకపోవడంతో నిర్మాణ వ్యయం పెరగడంతోపాటు ప్రజలకు పనుల నిర్వహణ తీరుపై విసుగు కలుగుతోంది. పెద్దపల్లి పురపాలిక పరిధిలో రెండున్నరేళ్ల క్రితం వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.33.69 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.

**నత్తనడకన..**

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారుల విస్తరణ, మురుగుకాలువల నిర్మాణ పనులు ఆరు నెలలుగా కొనసాగుతున్నాయి. వీటిలో ఎల్లమ్మ గుడివైపు రహదారి మినహా మిగిలినవి పూర్తి కాలేదు. విద్యుత్తు సంస్థతో సమన్వయ లోపం కారణంగా స్తంభాలు తొలగించకుండానే మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. వివిధ ప్రాంతాలలో ఇళ్ల తొలగింపు ప్రక్రియ కూడా వివాదాస్పదం అవుతుండటం ఆటంకంగా మారుతోం



ది. వ్యాపార కేంద్రమైన శంకర్‌గంజ్, జెండా కూడలి ప్రాంతాల్లో నెలలు తరబడి పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తయిన పెద్ద పనులే లేవు..**

పెద్దపల్లిలోని కూరగాయల మార్కెట్ విస్తరణ పనుల కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి నిధులు కేటాయించారు. పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టగా వీటిలో రూ.4.20 కోట్లతో ప్రస్తుత కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది కానీ.. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయాని కి కూడా ఈ పనులు చేపట్టే అవకాశం కనిపించడం లేదు. రూ.25.80 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన 9 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.3.03 కోట్లతో చేపట్టిన పనుల్లో 90 శాతం పనులు జరిగాయి. రూ.28 లక్షలతో చేపట్టిన మూడు చిన్నపనులు మాత్రమే పూర్తి చేశారు.

కూరగాయల మార్కెట్ విస్తరణ పనులు మాత్రమే మొదలు కాలేదని.. డిజైన్‌పై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని.. నిధులు ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో వెనక్కిపోవని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ పేర్కొన్నారు.

# గుట్టుగా తవ్వేస్తున్నారు..!



హుజూరాబాద్ : గుట్టు చప్పుడు కాకుండా తవ్వేస్తున్నా మట్టి అక్రమార్కులకు సిరులు కురిపిస్తోంది. పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు ఎందుకు చూడటం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇకనైనా మట్టి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సాగుతోంది ఇలా..**

హుజూరాబాద్ మండలం సిర్సపల్లి శివారులోని పాండవుల గుట్టతోపాటు సమీప గుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. యంత్రాల సాయంతో ట్రాక్టర్లు, లారీల ద్వారా ఈ దందా నడిపిస్తున్నారు. ఇక్కడి నుంచి జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, సైదాపూర్ మండలాలకు రవాణా చేస్తున్నారు. ట్రిప్పుకు దూరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2500ల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

మట్టి దందా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల తహసీల్దార్ కనుకయ్యకు సమాచారం రావటంతో తానే స్వయంగా వాహనాన్ని నడుపుకొంటూ పాండవుల గుట్ట వద్దకు వెళ్లారు. ఆయన వస్తున్నారనే సమాచారం తెలుసుకోవడం.. అక్రమార్కులు అక్కడి నుంచి పరారవడం.. అక్రమార్కుల ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పటిష్ఠతను తెలియపరుస్తోంది. నిత్యం వందలాది ట్రిప్పుల మట్టిని అక్రమంగా విక్రయిస్తున్నారు. గ్రామ శివారులోని గుట్టలే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఎక్కడ మట్టి కనబడితే చాలు అక్కడికి యంత్రాలు చేరుకుంటున్నాయి. వారిని అడిగే నాథుడే కరవయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు మట్టిని తరలిస్తున్న వాహనాలు పట్టుకుంటే ప్రజాప్రతినిధుల నుంచి అధికారుల మీద ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని సమాచారం.

జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. సదరు నిర్మాణ కంపెనీ ఈ గుట్టల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తీస్తున్నారని సమీప గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా మట్టిని తీయటంతో లోతైన గోతులు ఏర్పడ్డాయని.. మైనింగ్ అధికారులు ఇటువైపే చూడటం లేదని చెబుతున్నారు.

శంకరపట్నం మండలం మెట్‌పల్లి, కరీంపేట, తాడికల్, మొలంగూరు గ్రామాల సమీపంలోని గుట్టలతోపాటు కాకతీయ ప్రధాన కాలువల సమీపంలోని మట్టి నిల్వలను వదిలిపెట్టలేదు. చీకటి పడితే చాలు.. ట్రాక్టర్లలో తరలింపు కొనసాగుతోంది.

మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని హుజూరాబాద్ ఎమ్మార్వో కనుకయ్య తెలిపారు. అక్రమంగా మట్టి తీయటం నేరమని.. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ముందుగా మైనింగ్ శాఖకు టెంపరరీ పర్మిట్‌తో దరఖాస్తు చేసుకోవాలి. కావాల్సిన పరిమాణాన్ని అందులో నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు పరిశీలన కోసం ఆ మండల తహసీల్దార్‌కు నివేదిస్తారు. తహసీల్దార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఎన్‌వోసీ జారీ చేసిన తర్వాతే మట్టి తీయాలి ఇదంతా 5 నుంచి 10 రోజుల్లో పూర్తి కావాల్సి ఉంటుంది.

# వనరులు అడుగంటి వన్యప్రాణుల విలవిల



సిరిసిల్ల : రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫలితంగా అడవుల్లో నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. ఊట కుంటలు, చెక్‌డ్యాంలలో నీటి జాడలు కనుమరుగవుతున్నాయి. వేసవి కాలంలో వన్యప్రాణుల మనుగడకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉండగా నిధుల లేమితో ఆయా పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అడవి జంతువులు దాహార్తితో అల్లాడుతున్నాయి. నీటికోసం జనారణ్యంలోకి వస్తున్నాయి. జిల్లాలో చందుర్తి, మల్యాల, సిరిసిల్ల అటవీక్షేత్రాల పరిధిలో 12 సెక్షన్లు ఉన్నాయి. 44 బీట్‌లలో సుమారు 27 వేల హెక్టార్లకు పైగా అటవీ విస్తీర్ణం ఉంది. ప్రధానంగా వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఎక్కువ శాతం అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో 2017-18 సంవత్సరంలో వన్యప్రాణి గణన చేపట్టారు. అడవుల్లో నీటి వనరులను పరిశీలిస్తే రాతి కట్టడాలు 178, పర్కొలేషన్ ట్యాంకులు(చిన్న, పెద్దవి)116, సాసర్‌పిట్లు 120 ఉన్నాయి.

**నిధులు వస్తేనే పనులు**

వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. అడవుల వృద్ధితోపాటు వన్యప్రాణి సంరక్షణకు గతంలో అటవీశాఖ నీటి వనరులను అభివృద్ధి చేసింది. నీటి జాడలు లేని ప్రాంతాల్లో 4 నుంచి 6 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున సాసర్‌పిట్లను ఏర్పాటు చేశారు. రూ.లక్షల నిధులతో చెక్‌డ్యాంలు, రాక్‌ఫిల్‌డ్యాంలు, సోలార్‌పంపు సెట్లు తదితరాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణతోపాటు మరమ్మతులకు అటవీశాఖకు భారీగా ఖర్చవుతుంది. ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టడం గగనంగా మారింది. అయిదు సోలార్ పంపు సెట్లలో నీటి లభ్యత క్రమంగా తగ్గుతుండగా కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా చేసే అవకాశాలు ఉన్నా ఇంధన కొనుగోలు భారంగా మారుతోంది. కొన్నిచోట్ల బీట్ అధికారులు, సెక్షన్ అధికారులు సొంత డబ్బులను వెచ్చిస్తున్నారు.

**తప్పని ముప్పు**

అడవుల్లో నీటి లభ్యత లేకపోవడంతో దప్పిక తీర్చుకునేందుకు వణ్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. పంట పొలాలను ధ్వంసం చేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వనాలు వీడే ప్రాణులను హతమార్చేందుకు వేటగాళ్లు మాటు వేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఇటీవల గంభీరావుపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి దుప్పి మాంసాన్ని విక్రయిస్తూ అధికారులకు పట్టు బడ్డాడు. సిరిసిల్ల రేంజ్ పరిధిలో ఏడుగురిపై కేసులు సైతం నమోదయ్యాయి. గతేడాది వీర్నపల్లి మండలంలో మూడు దుప్పులు శునకాల దాడిలో మృతిచెందాయి.

నీటి వసతి కల్పిస్తున్నాం అడవుల్లో వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. నిర్వహణ విషయంలో నిధుల కొరత వాస్తవమే. అయినప్పటికీ సాసర్‌పిట్లలో నీటిని నింపుతున్నాం. అడవి జంతువుల దాహార్తి తీర్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. వణ్యప్రాణులకు ముప్పు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. వన్యప్రాణుల దాడిలో నష్టం జరిగితే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. పరిశీలించి పరిహారం ఇప్పించేలా చూస్తాం. శ్రీహరి ప్రసాద్, అటవీక్షేత్రాధికారి సిరిసిల్ల

# ప్రధాన పంట వరి

జగిత్యాల : నీటి లభ్యతతో ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలోనూ వరి ప్రధానపంటగా నిలిచింది. నవంబరు నుంచి ఫిబ్రవరి 15 వరకు రైతులు పెద్దఎత్తున వరినాట్లు వేయగా విస్తీర్ణం రీత్యా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా తరువాత రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచినట్లు వ్యవసాయశాఖ తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాధారణం కన్నా 27 శాతం

వరకు అధిక వర్షపాతం నమోదు, భూగర్భ జలలభ్యత, ఆయకట్టుకు శ్రీరాంసాగర్, ఎల్ఎండీ తదితర ప్రాజెక్టు నీటిని విడుదల చేయటం, వరదకాలువలో నీటినిల్వ తదితర కారణాలతో రైతులంతా వరిసాగుకే మళ్లారు. ఇతర పంటలకు కూలీల కొరత, వణ్యప్రాణులు, కోతుల బెడద, ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య ఉండగా కనీస మద్దతు ధరకు దొడ్డు ధాన్యం సేకరణ, సన్నాలకు బోనస్ చెల్లింపు తదితర కారణాలతో మెజారిటీ రైతులు వరివైపే మొగ్గారు. నాలుగు జిల్లాల్లో 2022లో యాసంగిలో 6.64 లక్షల ఎకరాల్లోనే రైతులు వరిని సాగుచేయగా 2023లో 9.33 లక్షల ఎకరాల్లో, నిరుడు 9.15 లక్షల ఎకరాల్లో, ఈ యాసంగిలో 8.83 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నాలుగు జిల్లాల్లోనూ 84 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా తదుపరి నువ్వు, ఆవాలు, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, కంది, పెసర, మినుము, ఆయిల్‌పామ్, కూరగాయలు తదితర పంటలను విత్తుకున్నారు. వరిపంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయగా ఎండవేడిమి పెరగటంతో భూగర్భ జలమట్టం తగ్గి నీటితడులు సమస్యగా మారగా చివరి ఆయకట్టుకు ఆశించినట్లుగా కాలువనీరు వెళ్లటం లేదు. రాత్రి చలి, పగటిపూట ఎండవేడిమితో పోషకలోపాలు, చీడపీడల సమస్యకూడా పెరిగి వరి రైతులు పలుమార్లు సస్యరక్షణ చర్యలను చేపట్టాల్సి వచ్చి తల్లడిల్లుతున్నారు. మరోవైపు ఎల్లంపల్లి నుంచి నీటిని పూర్తిస్థాయిలో ఎత్తిపోసే వీలు లేకపోవటంతో ఎస్సారెస్పీపైనే భారం పడినా.. ఎస్సారెస్పీలోనూ నీటినిల్వ తగ్గుతుండటం ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో విద్యుత్, సాగునీరు, చీడపీడల సమస్యను అధిగమించి ధాన్యాన్ని సగటు స్థాయిలో ఉత్పత్తి చేయటం రైతులకు సవాలుగా మారింది. ఇప్పటినుంచి విద్యుత్, సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటేనే పంటను సజావుగా పూర్తిచేయగలుగుతారు.

# ఆర్థిక స్వావలంబన... ఆరోగ్య రక్షణ

బోయినపల్లి : స్వశక్తి మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాలు సాధించే విధంగా కృషి చేస్తున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించే విధంగా తాజాగా అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

**మహిళా సంఘాల సభ్యులకు అవగాహన**

జిల్లాలో 9854 స్వశక్తి సంఘాలు ఉండగా సుమారు 1,14,462 మంది సభ్యులు ఉన్నారు. సంఘాల్లోని సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు అందిస్తున్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుంటూ సభ్యులు కిరాణ, కుట్టు మిషన్, వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. తీసుకున్న రుణంతోపాటు వడ్డీ కలిపి ప్రతినెలా బ్యాంకులో వాయిదాలు చెల్లిస్తున్నారు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడుతున్నారు. కాగా మహిళా సంఘాల్లోని సభ్యులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. అనేక మంది క్యాన్సర్, థైరాయిడ్, మూత్రకోశ, రక్తహీనత, అధిక బరువు, మధుమేహం, ఇతర వ్యాధులతో బాధపడుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ



అనారోగ్య సమస్యలను చెప్పుకునే విధంగా అవగాహన కల్పించడంతోపాటు వాటి బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఏపీఎం, సీసీ, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులకు ఐసీడీఎస్, వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏ, గ్రామైక్య సంఘం పదాధికారులకు, ఆరోగ్య కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్యవంతంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడంతోపాటు వ్యాయామం చేయడం, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాలు, లభించే పోషకాహారం, వ్యాక్సినేషన్ గురించి వివరిస్తున్నారు. గ్రామాల్లోని స్వశక్తి మహిళా సంఘం సభ్యుల సమావేశంలో ఆరోగ్య అంశం ఎజెండాగా చేర్చాలని నిర్ణయించారు. సమావేశంలో వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడం, తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని వీవోఏలకు అధికారులు సూచిస్తున్నారు.

**తరచూ కార్యక్రమాలు నిర్వహించాలి**

**వజ్రవ్వ, వరదవెల్లి**

ఆర్థికంగా ఎదగడంతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇది మహిళా సంఘాల సభ్యులకు ఎంతగానో మేలు చేస్తుంది. మా సమస్యలు తెలుసుకొని పరిష్కారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం సంతోషం. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**ప్రత్యేకంగా వివరిస్తున్నాం**

**జయసుధ, ఏపీఎం**

మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏ, గ్రామైక్య సంఘం పదాధికారులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించాం. సంఘం సభ్యుల అనారోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర అంశాలపై వివరించాం. గ్రామాల్లో నిర్వహించే స్వశక్తి సంఘాల సమావేశాల్లో సభ్యులకు అంగన్వాడీ, వైద్య సిబ్బందితో అవగాహన కల్పించాలని ప్రత్యేకంగా వివరిస్తున్నాం. దీనివల్ల మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది.

# ఆదాయం అంతంతే

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఏటా జరిగే మహాశివరాత్రి జాతరకు యంత్రాంగం కోట్ల రూపాయలను భక్తుల సౌకర్యాల కోసం వెచ్చిస్తోంది. కాగా ఖర్చుకు తగిన ఆదాయం రావడం లేదు. గత నెల 25 నుంచి 27 వరకు ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి దాదాపు నాలుగు లక్షల మంది భక్తులు వస్తారని అంచనాతో ఆధ్యాత్మికత ఉట్టి పడేలా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ ఆ స్థాయిలో భక్తులు రాలేదు. మూడు రోజుల వేడుకలకు సుమారు మూడున్నర లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని వివిధ రకాల మొక్కులు చెల్లించుకుని వెళ్లారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ వేడుకలకు రూ.2.03 కోట్ల నిధులు వెచ్చించారు. వేడుకలు ముగిసిన తరువాత స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.1,31,89,177ల ఆదాయం సమకూరింది. హుండీల లెక్కింపుతో మరో రూ.కోటికి పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

**ఎక్కువ వ్యయం తాత్కాలిక ఏర్పాట్లకే...**

మహాశివరాత్రి జాతరలో ఏటా చాలా వరకు తాత్కాలిక పనులకు రూ.కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. శాశ్వత నిర్మాణ పనులపై అధికారులు దృష్టి సారించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఏటా చలువపందిళ్లు, కలకత్తా పెండాళ్లు, అద్దె ప్రాతిపదికన సీసీ కెమెరాలు, శివార్చన వేదిక వద్ద అద్దె ప్రాతిపదికన ఏర్పాట్లు, లైటింగ్, సూచిక బోర్డులు, కమాన్, ప్రత్యేక క్యూలైన్లు వంటి తదితర వాటికి నిధులు భారీగానే వెచ్చిస్తున్నారు. మహాశివరాత్రి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ కోసం ఆయా ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి భక్తులకు సకల సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నప్పటికీ అధికారుల అంచనా మేరకు భక్తులు, ఆదాయం రావడం లేదు. ప్రతి ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. వేములవాడకు వచ్చేవారికి అవసరమైన వసతి గదులు, క్యూలైన్లలో మౌలిక వసతులు, సులువుగా స్వామివారి దర్శనం తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

**శాశ్వత పనులకు అవకాశం లేదు**

మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టే ఏర్పాట్లలో శాశ్వత పనులు చేపట్టడానికి వీలు లేదు. ఇందులో కలకత్తా పెండాళ్లు, చలువ పందిళు, లైటింగ్, కమాన్, వంటివి ఆలంకరణ కోసమే ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత పని చేయాలంటే మాస్టర్ ప్లాన్‌ను అనుసంరించాల్సి నిర్మాణాలు చేయాల్సి ఉంది. రఘునందన్, డీఈ రాజన్న ఆలయం

చురకలు



## కొండల్లో ఎర్రమట్టి దొంగలు

ఒంగోలు : ఇది వెంకటాచలంపల్లి కొండ. బయటి నుంచి చూస్తే పచ్చగా ఉన్నట్లు కనిపిస్తుంటుంది. లోనికి వెళ్తే మాత్రం హరిత శోభ మాయమై.. మట్టి తరిగిపోయి.. గుంతలే కనిపిస్తాయి. వైకాపా హయాంలో అయిదేళ్లపాటు ఈ కొండను యంత్రాలతో తవ్వి.. లారీలు, ట్రాక్టర్లల్లో మట్టి తరలించి జేబులు నింపుకొన్నారు. ఇప్పుడూ అదే దోపిడీ సాగుతోంది. దర్శి నియోజకవర్గంలోని వెంకటాచలంపల్లి, చందలూరు, పోతవరంలో ఎర్రమట్టి గుట్టలు ఉన్నాయి. దూరం నుంచి చూస్తే పచ్చగా కనిపిస్తుంటాయి. వెంకటాచలంపల్లి వద్ద డ్వామా అధికారులు మొక్కలు పెంచి ఆర్చీ కూడా గతంలో నిర్మించారు. కొన్నాళ్లపాటు హరిత శోభతో అలరారిన ఈ గిరులు గత అయిదేళ్ల నుంచి అక్రమాలతో తరిగిపోవడం మొదలయ్యాయి. రాష్ట్రంలో అధికారం మారింది. ఇక్కడ దోపిడీ పర్వం కూడా చేతులు మారింది. కొందరు నాయకులు గత పాలనలోని విధ్వంసాన్నే కొనసాగిస్తున్నారు. యంత్రాలతో తవ్వుతూ.. వాహనాల్లో తరలించి విక్రయిస్తూ ధనలక్ష్మిని దాచేసుకుంటున్నారు.

**అనధికారికంగా రాసిచ్చారు**

కొండల నుంచి మట్టి తవ్వి తరలించడానికి ఇద్దరు వ్యక్తులకు అధికార



పార్టీకి చెందిన నాయకులు అనధికారికంగా అనుమతులిచ్చేశారు. ఒకరికి దర్శి, మరొకరికి కురిచేడు మండలాల బాధ్యతలు అప్పగించారు. ఈ ఇద్దరే ఏజెంట్ల అవతారమెత్తారు. అంతా వీరి కనుసన్నల్లో సాగుతుంది. మట్టి అవసరమైన వారికి చేరవేస్తుంటారు. అందుకుగాను ట్రక్కుకు రూ.500 చొప్పున ఏజెంట్లు సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఈ 'లెక్క' తప్పకుండా ఓ పర్యవేక్షకుడిని కూడా నియమించడం గమనార్హం.

**సమన్వయం లోపంతో ముప్పు**

అక్రమ మట్టి తవ్వకాలు వెంకటాచలంపల్లి కొండ వద్ద సుమారు పదెకరాల్లో, చందలూరు సమీపంలో అయిదెకరాల్లో, పోతవరం వద్ద ఆరెకరాల్లో సాగుతున్నాయి. అడ్డుకట్ట వేయాల్సిన భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసులు సాకులు వెతుక్కుంటున్నారు. సమన్వయం మాట మరిచి ఎవరివారే యమునా తీరే తరహాలో వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు భూగర్భ గనుల శాఖ అధికారులు బయటికొస్తారు. కనిపించిన వాహనాలను పట్టుకొని జరిమానా విధించి చేతులు దులుపుకొంటారు. గనుల శాఖకు సంబంధించిన అంశమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పోలీసులేమో మట్టి మాది కాదంటూ ఇసుకపై దృష్టిసారించారు. దీంతో మొత్తంగా 21 ఎకరాల్లో కొండలకు ఇప్పుడు ముప్పు తలెత్తింది.

**జేబుల్లోకి సహజ సంపద సొమ్ములు**

ఎర్రమట్టి పోసి చదును చేస్తే తడి ఆరాక నేల గట్టిగా ఉంటుంది. ఈ స్వభావం కారణంగా వెంచర్లలో ఈ మట్టి వినియోగానికి డిమాండ్ ఏర్పడింది. దీంతో దర్శి మండల పరిధిలో ట్రక్కుకు రూ.3,500, ఇతర మండలాలకు దూరాన్ని రూ.4,500కు విక్రయిస్తున్నారు. రోజూ 150 నుంచి 200 ట్రక్కుల్లో అక్రమంగా తరలిస్తున్నారు. తద్వారా రోజూ రూ.6 లక్షల విలువైన సహజ సంపద కాసుల రూపంలో రవాణాదారుల జేబుల్లోకి చేరుతోంది. అక్రమ తవ్వకాలపై సీఐ రామారావు మాట్లాడుతూ.. ఇసుక వ్యాపారం చేసేవారికి జరిమానా విధిస్తున్నామని, మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'దర్శి నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి ఎవరికీ లీజులివ్వలేదు. అనుమతుల్లేకుండా మట్టి తవ్వి తరలించడం అక్రమం. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం' అని భూగర్భ గనుల శాఖ మార్కాపురం ఏడీ విష్ణువర్ధనరావు తెలిపారు.

## విభిన్న నైపుణ్యాల కలయిక




ఏర్పేడు : తిరుపతి-శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాల మధ్య విద్యాక్షేత్రంగా వెలసిన భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ(ఐఐటీ) అతితక్కువ కాలంలోనే ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధించింది. మూడోతరం ఐఐటీ అయినప్పటికీ మొదటితరం వాటితో పోటీపడుతూ ప్రగతిపథంలో పరుగులు తీస్తోంది. నూతన సాంకేతిక నైపుణ్యాలతో సత్తా చాటుతూనే మరోవైపు పేదరికం నిర్మూలించేందుకు స్వయం ఉపాధిపై శిక్షణ, గ్రామీణ విద్యాభివృద్ధికి శ్రీకారం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

**జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు**

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు పంచుకునేందుకు తిరుపతి ఐఐటీ పదేళ్లలో 50 పైగా జాతీయ విశ్వవిద్యాలయాలు, పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే యుఎస్ఏ, నార్వే, కెనడాకు చెందిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఒప్పందం చేసుకుంది. ఇండియన్ నేవీ, ఎన్హెచ్ఏఐ, సీఎస్ఐఆర్, సీఎఫ్టీఆర్ఐ, సీఎంటీఐ, ఎన్ఏఆర్ఎల్తోపాటు తొషిబా సాఫ్ట్వేర్ ఇండియా, టీసీఎస్, హిందూస్థాన్ పెట్రోలియం వంటి పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది.

**విభిన్న క్లబ్లు**

విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కలిగేలా వివిధ క్లబ్లు నిర్వహిస్తోంది. సాంకేతిక నైపుణ్యాలపై చర్చించుకునేందుకు టెక్నికల్ క్లబ్, కొండలు, కోనలు పరిశోధనలపై ట్రెక్కింగ్ క్లబ్.. చిత్రాలు, షార్ట్ఫిల్మ్ తీసేందుకు పీఎఫ్సీ క్లబ్, సమాచారాన్ని పంచుకునేందుకు కమ్యూనికేషన్ క్లబ్, మహిళలకు మేథో క్లబ్, పర్యావరణం పరిరక్షణకు అరణ్య.. శారీరక, మానసిక దృఢత్వానికి ఫిట్నెస్, సంగీతానికి సరిగమ, వంటావార్పుకు రసోల్, పాలసీ క్లబ్, స్పైస్ మేకి, ఆర్టిస్ట్ క్లబ్ వంటివి నిర్వహిస్తుండటంతో ప్రతిభ సంతరించుకుంటోంది.

**ప్రభుత్వ సహకారం మరువలేనిది**పదేళ్ల కిందట తిరుపతిలో ఐఐటీని ఏర్పాటు చేయడంతోపాటు శాశ్వత ప్రాంగణాల నిర్మాణానికి స్థలం కేటాయించడం, మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఛైర్మన్, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సజ్జన్ జిందాల్, బోర్డు సభ్యుల సలహాలతో ఆదర్శవంతమైన పురోగతి సాధించాం. రానున్న రోజుల్లో దేశం గర్వించేలా నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు చేపడుతాం. డా.కె.ఎన్.సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ

## కష్టాలు తీర్చని కనక మహాలక్ష్మి

ఒంగోలు : గెలాక్సీ గ్రానైట్ గనులు తమ కాళ్ల కింద ఉన్నాయంటే స్థానికులు సంతోషించారు. వెలికి తీస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, మౌలిక వసతులూ సమకూరుతాయంటే సంబరపడ్డారు. ఏళ్లు గడిచినా పరిస్థితి మారలేదు.. సౌకర్యాలు మెరుగుపడలేదు. తడారిన గొంతులు నిరీక్షిస్తూనే ఉన్నాయి.

చీమకుర్తి మండలం ఆర్ఎల్పురం పంచాయతీ పరిధిలోని భూముల్లో విలువైన గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయి. వీటిల్లో 310.406 ఎకరాలకు భూగర్భ గనుల శాఖ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)కు 2000లో ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ఈ సంస్థ గెలాక్సీ గ్రానైట్ వెలికితీతకు 2005లో గ్లోబల్ టెండర్లు పిలవగా.. ఏపీ మిడ్వెస్ట్, పల్లవ రెడ్, జింపెక్స్ సంస్థలు అప్పట్లో దక్కించుకున్నాయి. నిబంధనల ప్రకారం ఆ కంపెనీలు ఏపీఎండీసీకి చెల్లించే రాయల్టీ మొత్తంలో అయిదు శాతం నిధులను స్థానికంగా విద్య, వైద్యం, రహదారుల




అభివృద్ధి, ఇతర మౌలిక వసతుల కల్పనకు కేటాయించాలి.

**అరకొరగా వసతుల కల్పన:** ఏపీఎండీసీ కేటాయించిన భూముల్లో 157.086 ఎకరాల్లో గ్రానైట్ కార్యకలాపాలు సాగుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న సంస్థలు రాయల్టీ చెల్లిస్తున్నాయి. తద్వారా సుమారు రూ.12 కోట్ల వరకు పోగయ్యాయి. ఈ మొత్తాన్ని మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయాలి. ఉత్పత్తి సామర్థ్యాలు పెంచుకునే సమయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు పలు సమస్యలు ప్రస్తావిస్తున్నారు. ఆ దిశగా చర్యలు చేపడతామంటూ అధికారులు హామీలు గుప్పించి దాటవేస్తున్నారు. ప్రజల కష్టాలు మాత్రం ఎక్కడివక్కడే ఉంటున్నాయి.

చీమకుర్తిలో రూ. 1.50 కోట్లతో శుద్ధి జల కేంద్రం ఏర్పాటు చేయాలి.

రామతీర్థం కూడలిలో ఆసుపత్రి లేదా క్లినిక్ నిర్వహించాలి.

రామతీర్థం కూడలిలో బస్సు ప్రాంగణం ఏర్పాటు అవసరం.

అధ్వానంగా ఉన్న ఆర్ఎల్పురం, రామతీర్థం ఆలయ రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

ఆర్ఎల్పురం, చీమకుర్తి, బూదవాడ, పంచాయతీల పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యలు ఆవశ్యం. ఈ తరహా పనులు చేపట్టాలంటే సాధారణంగా నిధుల కొరత అనే మాట ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి వినిపిస్తుంటుంది. చీమకుర్తి ప్రాంతంలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నం. ఇక్కడ కనక మహాలక్ష్మి ఖజానాలో ఉన్నప్పటికీ జనం కష్టాలు తీరడం లేదు.

ఏపీఎండీసీ పరిధిలోని గనుల విస్తీర్ణం: 310.406 ఎకరాలు

ఏపీ మిడ్వెస్ట్కు కేటాయించినవి: 48.562

బ్లాక్-4: 27.337

సంయుక్తా: 27.337

శాంభవి: 35.425

నాంది: 15.955

పెర్ల్: 2.47

## వేరుసెనగ 'వెల'విల



ఎమ్మిగనూరు : రబీలో వేరుసెనగ సాగు చేసిన రైతు 'వెల'విలలాడుతున్నాడు. వాతావరణం అనుకూలించలేదు... దిగుబడులు గణనీయంగా తగ్గి పెట్టుబడి రాక నష్టపోయారు. గతేడాది ఖరీఫ్ ఆరంభానికి ముందుగా వేసిన పంట ఉత్పత్తి బాగా పెరిగింది. రబీలో అంతకంటే అధిక దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశ మిగిల్చింది. **దెబ్బతీసిన తెగుళ్లు**

రబీలో వేరుసెనగ ఉత్పత్తులు తగ్గడంతో మార్కెట్పై ప్రభావం పడింది. ఉత్పత్తుల రాక గతేడాదికంటే తగ్గింది. 2024 జనవరి నుంచి మార్చి వరకు మార్కెట్కు 2,53,944 బస్తాలు అమ్మకానికి రాగా 2025 జనవరి నుంచి మార్చి వరకు 1,67,393 బస్తాలు వచ్చాయి. 86,551 బస్తాలు దిగుబడులు మార్కెట్కు తగ్గాయి. " రబీలో సాగు చేసిన వేరుసెనగ పంటకు మొదళ్ల కుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు సోకి దెబ్బతిందని" కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు.

**అప్పులే మిగిలాయి: రమేశ్, కప్పట్రాళ్ల**

రబీలో నాలుగెకరాల్లో వేరుసెనగ వేశాను. ఎకరానికి మూడు బస్తాలు చొప్పున 12 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.5,150కు కొన్నారు. నాలుగెకరాలకు రూ.60 వేల పెట్టుబడి పెట్టగా చేతికి రూ.20 వేలు వచ్చింది. నాలుగెకరాలకు కల్లం ఖర్చు రూ.18 వేలు, యంత్రానికి రూ.4 వేలైంది. దిగుబడి అంతా విక్రయించగా కల్లం, యంత్రం ఖర్చులకు సరిపోవడం లేదు. పెట్టుబడి కోసం అప్పులు తెచ్చిన వారికి ఏమి చెప్పాలో తెలియడం లేదు.

**ఎకరానికి 4-8 సంచుల దిగుబడి**

జిల్లాలో రబీలో 23 వేల ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. సాధారణంగా ఖరీఫ్లో వాతావరణం, అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడులపై ప్రభావం చూపుతుంది. ఈసారి రబీ పంటకు వాతావరణం అనుకూలించక దిగుబడులు గణనీయంగా తగ్గాయి. సాధారణంగా రబీలో ఎకరానికి 20 నుంచి 40 సంచుల వరకు దిగుబడులొస్తాయి. ఈసారి ఎకరానికి 4 నుంచి 10 బస్తాల్లోపు దిగుబడి వచ్చింది. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెట్టారు. దిగుబడులు అమ్మగా పెట్టుబడిలో సగం కూడా చేతికందక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

## ఆదాయానికి కరవు పోటు

ఒంగోలు : జిల్లాలో పండించిన పంట ఉత్పత్తులను ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలించే సమయంలో మార్కెట్ సెస్సు తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది. సరకు విలువలో ఒక శాతాన్ని మార్కెట్ ఫీజుగా వసూలు చేస్తుంటారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ముఖ్యమైన ఈ ఆదాయాన్ని కరవు మింగేసింది. జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో వంద శాతం వసలూ సాధించాలనే లక్ష్యాన్ని 89.62 శాతానికే పరిమితం చేసింది. గత ఏడాదితో పోల్చుకుంటే కొంత మెరుగైనప్పటికీ ఆశించిన స్థాయిలో రాకపోయింది.

**ఇవీ చుట్టుముట్టిన సమస్యలు**

గడిచిన రబీ సీజన్లో వర్షాభావం, తర్వాత అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి.కొన్ని చోట్ల తగినంత వర్షపాతం లేకపోయింది. దీంతో జిల్లాలోని 17 మండలాలను ప్రభుత్వం కరవు ప్రాంతాలుగా ఇటీవల ప్రకటించింది.గత ఏడాది పొగాకుకు మంచి ధర పలికింది. ఈ



విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ఈసారి పప్పుధాన్యం పంటలు బదులు పొగాకు వైపు మొగ్గు చూపారు. పొగాకు విక్రయాలపై మార్కెట్ ఫీజు ఉండదు. తద్వారా కొన్ని కమిటీలకు ఆదాయం గణనీయంగా తగ్గింది. ఉదాహరణకు కంభం కమిటీలో ఒక్క కంది పంట ద్వారా ఏటా రూ.40 లక్షలు ఫీజు సమకూరేది. ఈ ఏడాది రూ. 3 లక్షలే వచ్చింది.పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఎక్కువ మంది రైతులు ఉత్పత్తులను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. కందులు గతంలో క్వింటా రూ.10 వేలు పలకగా, ఇప్పుడు రూ.6,500 ఉంది. శనగలు రూ. 7,000 నుంచి రూ. 4,500కు పడిపోయింది. మిర్చి ధర కూడా తగ్గింది. దీంతో మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా నిల్వ ఉంచుతున్నారు. ఇటువంటి కారణాలతో మార్కెట్ ఫీజు రూ. 2,456.44 లక్షలు రావాల్సి ఉండగా.. రూ. 2,201.46 లక్షలే(89.62 శాతం) వసూలైంది. వీటిలోనూ అత్యధికంగా కొండపికి ఎక్కువ ఆదాయం రాగా, అట్టడుగు స్థానంలో కంభం ఉంది.

## పుర కుళాయిల్లో అక్రమ ధారలు



ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక కుళాయిల్లో అక్రమ ధారలు పొంగిపొర్లుతున్నాయి. వాటిని యంత్రాంగం కట్టడి చేయలేకపోవడంతో 'పన్ను' చెల్లించిన వారికి నీటి కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులుంటే.. వీరిలో 65 శాతం మందికే కుళాయిలున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన వారు నీటిని ప్రత్యామ్నాయ మార్గంలో, లేదంటే అక్రమ కుళాయి కనెక్షన్లతోనైనా నీరు పట్టుకుంటున్నారు.

**సిబ్బంది చేయి తడిపితే**

పట్టణీకరణకు అనుగుణంగా నీటి వనరులు పెంచుకుని, ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పం. అమృత్ వంటి పథకాల ద్వారా కొంత మేర మెరుగైనా.. కుళాయి కనెక్షన్ల మంజూరులో అక్రమాలు ఆగడం లేదు.

సిబ్బందికి చేయి 'తడిపితే' చాలు ఇట్టే కనెక్షన్ ఇచ్చేస్తారు. ఒక్కో కుళాయి కనెక్షన్కు పురపాలికల్లో అయితే రూ.15 వేలు, అదే కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి ప్రాంతాల్లో అయితే వీటి ధర అధికంగా ఉంటుంది. ప్రధాన పైపులైన్ నుంచి ఎలాంటి లాక్ లేకుండా ఉండేందుకు ఓ ధర. గతంలో వీటి గుర్తింపునకు ప్రత్యేక బృందాలను నియమించి లెక్క తీశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పక్కన పెట్టేశారు.

**ఆదాయానికి గండి**

ఉమ్మడి జిల్లాలో ఒక్కో మున్సిపాలిటీలో సగటున 13-14 వేల పైనే అక్రమ కుళాయిలున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే ఏడు వేల వరకు ఉన్నాయని అధికారుల సర్వేలో తేలింది. ఆదోనిలో మూడు వేలు, నంద్యాలలో 800, డోన్ 400, ఆళ్లగడ్డ 557, గూడూరు వంటి నగర పంచాయతీలో 569 వరకు అనుమతుల్లేని కుళాయిలున్నాయి. పురపాలికల్లో నెలకు నీటి పన్ను రూ.60 నుంచి రూ.120. అనుమతుల్లేని కుళాయి కనెక్షన్లు 14 వేలకు పైగా ఉన్నాయి. నెలకు నీటి పన్ను రూ.100 లెక్కించినా.. నెలకు రూ.14 లక్షలు, ఏడాదికి రూ.1.68 కోట్లు అవుతుంది. రూ.కోట్లలో పురపాలికలు ఆదాయం కోల్పోతున్నాయి. **క్రమబద్ధీకరణ లేనట్లేనా**

సాధారణ కుళాయి కనెక్షన్కు విరాళం రూ.6 వేలు, ఓవైటీకి రూ.10 వేలు ఉంది. అనుమతులు లేని కుళాయిలకు విరాళంతో పాటు 50 శాతం జరిమానా, ఒక ఏడాది నీటి పన్ను విధించి క్రమబద్ధీకరించే అవకాశం ఉంది. ప్రస్తుతం అక్రమ కుళాయిల క్రమబద్ధీకరణకు అవకాశమున్నా.. ఆ దిశగా యంత్రాంగం చొరవ చూపడం లేదు.

## వరికి సిరి

కొత్తపట్నం : 2024-25 రబీ సీజన్కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు నిమిత్తం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 21 మండలాల్లోని 188 రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం నుంచి కొనుగోలు ప్రారంభించనున్నారు. రబీ సీజన్లో పండించి ఈ-పంటలో నమోదైన రైతుల నుంచి మాత్రమే సేకరిస్తారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ కింద 22,983 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయగా.. 79,500 మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు అంచనా వేశారు. అందులో పది వేల మెట్రిక్ టన్నుల సేకరణకు తొలి దశలో ఆమోదం లభించింది.

**48 గంటల్లో నగదు జమ:**

ధాన్యం సేకరణపై ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు.

విక్రయించే రైతులు సమీపంలోని సేవా కేంద్రాల వద్దకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి.ఆధార్ అనుసంధానమైన చరవాణి సంఖ్యతో పాటు, బ్యాంక్ ఖాతా పాసుపుస్తకం నకలు అందించాలి.గోనె సంచులు, జీపీఎస్ వాహనాలతో పాటు, సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విక్రయించిన 48 గంటల్లో అన్నదాత బ్యాంకు ఖాతాలో కనీస మద్దతు



ధర నగదు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఖరీఫ్లో 8,879 మెట్రిక్ టన్నులు: మార్చి నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ కొనుగోళ్లు పూర్తయ్యాయి. జిల్లాలోని 10 మండలాల పరిధిలో 45 రైతు సేవా కేంద్రాల ద్వారా 1,319 మంది రైతుల నుంచి 8,879 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అందుకు రూ. 20.59 కోట్ల మేర చెల్లించాల్సి ఉండగా, అందులో ఇప్పటివరకు రూ. 18.75 కోట్ల మేర నగదును బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు.

సాగు చేసిన మండలాలు: 21

మొత్తం సాగు విస్తీర్ణం: 22,983 ఎకరాలు

దిగుబడి అంచనా: 79,500 మెట్రిక్ టన్నులు

కొనుగోలు కేంద్రాలు: 37

ధాన్యం సేకరణ లక్ష్యం: 10 వేల మెట్రిక్ టన్నులు

గ్రేడ్-ఏ రకం క్వింటా ధర: రూ.2,320

సాధారణ రకం ధర: రూ.2,300

## పాలారు సంరక్షణకు ప్రాధాన్యం

శాంతిపురం : కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని సహజ సాగునీటి వనరు పాలారు నదీ జలాల సంరక్షణకు సద్వినియోగానికి కూటమి సర్కారు ప్రాధాన్యం ఇస్తోంది. గతంలో తెదేపా ప్రభుత్వం వి.కోట, రామకుప్పం, శాంతిపురం, కుప్పం మండలాల పరిధిలో 32 చోట్ల చెక్డ్యాంలను నిర్మించింది. గత ఐదేళ్లు పర్యవేక్షణ లేకపోవడంతో పలుచోట్ల దెబ్బతిని సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. **చంద్రబాబు చొరవతో..** పాలారు జలాలను స్థానికంగా నిల్వ చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారు. గణేషపురం వద్ద చిన్నతరహా ఆనకట్ట నిర్మాణంపై తమిళనాడు అభ్యంతరాలతో సర్వోన్నత న్యాయస్థానంలో వివాదం నడుస్తున్న నేపథ్యంలో.. ప్రస్తుతానికి చెక్డ్యాంల పటిష్టతకు ఉపక్రమించారు. శాంతిపురం, కుప్పం మండలాల పరిధిలోని నాలుగు చెక్డ్యాంల మరమ్మతులకు రూ.10.24 కోట్లు కేటాయిస్తూ.. ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పునర్విభజన.. పడుతూ లేస్తూ పాలన

రాజమహేంద్రవరం : పాలన సులభతరం చేసేందుకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నామని గొప్పగా ప్రకటించి.. కనీస వసతులు కల్పించకుండా పునర్విభజన చేసింది నాటి వైకాపా ప్రభుత్వం. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏడాదిలోగా పూర్తి చేస్తామని చెప్పినా అవి అమలు కాలేదు. మరోవైపు వివిధ సేవల నిమిత్తం వస్తున్న ప్రజలు రెండుచోట్లకు తిరగలేక నానా అవస్థలు పడుతున్నారు. పలు శాఖలు ఇంకా ఉమ్మడి జిల్లాలోనే కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాను 2022 ఏప్రిల్ 4న నాలుగు జిల్లాలుగా పునర్విభజించారు. రాజమహేంద్రవరం గ్రామీణ మండల పరిధిలోని బొమ్మూరు న్యాక్ భవనంలోనే తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ ప్రారంభించగా ప్రస్తుతం ఇంకా అందులోనే జిల్లా పాలన వ్యవస్థను నడిపించాల్సిన పరిస్థితి. మూడేళ్లు పూర్తియినా నేటికీ కలెక్టరేట్‌కు సొంత భవనాలు సమకూరలేదు.

**ప్రతిపాదనలు ఉన్నా..**

కలెక్టరేట్ సొంత భవనం నిమిత్తం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలోని రిజర్వు పోలీసు మైదానాన్ని పరిశీలించి ఉన్నతాధికారులు నాటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయినా ఫలితం లేకపోయింది.

**ప్రజలకూ అవస్థ**

కలెక్టరేట్‌కు వెళ్లేందుకు సరైనా రవాణా సౌకర్యం లేకపోవడం... వివిధ శాఖల జిల్లా కార్యాలయాన్నీ ఒకేచోట లేకపోవడంతో జిల్లా



నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు నేటికీ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సొంత వాహనాల్లో రావాలి.. లేదా ప్రైవేటు వాహనాలు ఆశ్రయించాల్సిన పరిస్థితి. కలెక్టరేట్ ఆవరణలో తాత్కాలిక పార్కింగ్ షెడ్లు కూడా లేవు.

**కాకినాడ పరుగు పెట్టాల్సిందే..**

విభజన జరిగినా జిల్లా పరిషత్తు కార్యకలాపాలు ఉమ్మడి జిల్లా పరిధిలోనే జరుగుతున్నాయి. ఈ సమావేశాలకు తూర్పు గోదావరి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు కాకినాడ జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లు కాకినాడ జిల్లా కేంద్రం నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది సర్వీసులకు సంబంధించిన పనులన్నీ ఉమ్మడి తూర్పుగోదావరి కిందే జరుగుతున్నాయి. బదిలీలు, ఉద్యోగోన్నతులు వంటివి కాకినాడ కలెక్టరేట్ నుంచి చేస్తున్నారు.

**అక్కడికి వెళ్లాలన్నా తంటానే..**

జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ, డీఆర్‌డీఏ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఏపీఈడబ్ల్యూఐడీసీ తదితర శాఖల జిల్లా ప్రధాన కార్యాలయాలు బొమ్మూరులోని గ్రామీణ తహసీల్దారు కార్యాలయం సమీపంలోని గిరిజన యువత శిక్షణ కేంద్రం(వైటీసీ) భవన సముదాయాల్లో కొనసాగుతున్నాయి. ఆ కార్యాలయాల చిరునామా తెలుసుకుని వెళ్లేందుకు జిల్లావాసులు అవస్థలు పడుతున్నారు.

# క్రమబద్ధీకరణ సాగేనా.. ఆగేనా..!

కాకినాడ : అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) పథకం గడువు మార్చి 31తో ముగిసింది. గత నాలుగేళ్లుగా గడువు పెంచుతూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంచుతారా? ఆపేస్తారా? అనే చర్చ నడుస్తోంది. 2020 జనవరి 8న అనధికార లేఔట్ క్రమబద్ధీకరణకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 10 జారీ చేసింది. 2019 ఆగస్టు 31కి ముందు వేసిన నాన్ లేఔట్ల రెగ్యులైజేషన్‌కు అవకాశం కల్పించింది. ఈ లేఔట్లలో ఒక్క ప్లాట్ అయినా క్రయ, విక్రయాలు జరిగితే క్రమబద్ధీకరణకు అర్హత కల్పించారు. 2020 డిసెంబరు 31 వరకు రెగ్యులైజేషన్‌కు దరఖాస్తులు స్వీకరించారు.

**కూడాకు రూ.20.94 కోట్లు..**



కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పూర్వపు గుడా, ప్రస్తుత కుడా) పరిధిలో 3,195 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 2,031 దరఖాస్తులను ఆమోదించారు. 263 దరఖాస్తులను తిరస్కరించారు. పత్రాలు సక్రమంగా సమర్పించని, రుసుం చెల్లించని(షార్ట్‌ఫాల్) 569 దరఖాస్తులకు నోటీసులు జారీ చేశారు. రెగ్యులైజేషన్‌కు సొమ్ములు చెల్లించాల్సిన 168 మందికి తాఖీదులిచ్చారు. మార్చి 31వరకు పరిష్కరించిన దరఖాస్తుల ద్వారా కుడాకు రూ.20.94కోట్ల ఆదాయం సమకూరింది. గడువు పెంచితే మరో రూ.4కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. షార్ట్‌ఫాల్, రుసుం చెల్లించాల్సిన 737 దరఖాస్తులను పరిష్కరిస్తే రూ.4కోట్లు వస్తుందని అంచనా వేశారు.

**నగరపాలికకు రూ.9.68 కోట్లు**

అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణ పథకం ద్వారా కాకినాడ నగరపాలక సంస్థకు ఇప్పటివరకు రూ.9.68కోట్ల మేర ఆదాయం సమకూరింది. నగరపాలక సంస్థ పరిధిలో నాన్ లేఔట్ల రెగ్యులైజేషన్‌కు అవకాశం ఇవ్వగా, 2020 డిసెంబరు 31 వరకు 204 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 171 ఆమోదించారు. 17 తిరస్కరించారు. షార్ట్‌ఫాల్, రుసుం చెల్లించాల్సిన దరఖాస్తులు 14 ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంచితే వీటితో మరో రూ.89లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దీనిపై డిప్యూటీ సిటీ ప్లానర్ కేవీ కృష్ణారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఇప్పటివరకు గడువు పెంపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదన్నారు.

# ఆరోగ్యంతో 'చల్లగాటం



అనంతపురం: బయట దొరికే పండ్ల రసాలు, నన్నారీ, చెరుకు రసం తాగుతున్నారా? ఐస్ కలిపిన శీతలపానీయాలను ఇష్టంగా సేవిస్తున్నారా? అయితే మీ ఆరోగ్యం జాగ్రత్త సుమా.!. ఎందుకంటే అత్యంత కలుషిత నీటితో తయారుచేసిన ఐస్‌ను శీతలపానీయ దుకాణాల నిర్వహకులు వాడుతున్నారు. వాటిని తాగిన వారికి పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో చిన్నవి, పెద్దవి కలిపి 100 నుంచి 120 వరకు ఐస్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. ఏ ఒక్కదాంట్లోనూ నిబంధనలు పాటించడం లేదు. తయారీ నుంచి రవాణా వరకు కనీస పరిశుభ్రతను గాలికి వదిలేశారు. కాలం చెల్లిన, తుప్పు పట్టిన బాక్సుల్లో బోరు నీటిని ఉంచి ఐస్ తయారు చేస్తున్నారు. ఫ్యాక్టరీ పరిసరాలు సైతం అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. స్టోరేజీ కోసం వినియోగించాల్సిన ఐస్‌ను రెండు జిల్లాల్లోని జ్యూస్ షాపులకు సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆహారభద్రతా శాఖ అధికారులు తరచూ తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రతి దశలోనూ..**

ఫ్యాక్టరీల్లో ఐస్ తయారీకి శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి. మలినాలను తొలగించడానికి రివర్స్ ఆస్మాసిస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. నీటి నాణ్యతపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలి. బాక్సులను నిత్యం శుభ్రం చేయడం తప్పనిసరి. కార్మికుల చేతులకు గ్లౌజులు వేసుకోవాలి

అనంత నగరంతో పాటు, హిందూపురం లాంటి పట్టణాల్లోని ఐస్ ఫ్యాక్టరీల నిర్వహకులు ఇవేమి పాటించడం లేదు. సురక్షితం కాని బోరు నీటిని నేరుగా బాక్సుల్లో నింపి తయారు చేస్తున్నారు. రవాణాలోనూ ప్రమాణాలు పాటించడం లేదు. గోనెసంచుల్లో వరిపొట్టు నింపేసి ఐస్‌ను తరలిస్తున్నారు. ఈ ప్రక్రియలోనూ మరింత కలుషితమవుతోంది.

**విస్తుగొలిపే అంశాలు**

అనంతపురం నగరంలో ఐస్ తయారుచేస్తున్న పెద్ద ఫ్యాక్టరీలు 3 ఉన్నాయి. ఇళ్లల్లో తయారుచేస్తున్నవారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. ఎవరికీ అనుమతులు లేవు.

అధికారులు తనిఖీలకు వెళితే చేపలు, రొయ్యల నిల్వ కోసమే ఐస్‌ను వినియోగిస్తున్నామని చెప్పి తప్పించుకుంటున్నారు.

ఉమ్మడి అనంత జిల్లాలోని సుమారు 4 వేల శీతలపానీయాల దుకాణాలకు వాటి నుంచే ఐస్ సరఫరా అవుతోంది.

**తప్పదు ముప్పు!**

కలుషిత నీటితో తయారుచేసిన ఐస్ వినియోగిస్తే విరేచనాలు, టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు, గ్యాస్ట్రిక్ సమస్యలు, గొంతు ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. ఫ్లోరైడ్ ఉంటే ఫ్లోరోసిస్, నైట్రేట్ వల్ల చిన్నపిల్లల్లో బ్లూబేబి సిండ్రోమ్‌కు దారి తీసే అవకాశం ఉంది. అర్సెనిక్ ఉంటే క్యాన్సర్‌కు దారితీస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# మిల్లర్లు.. ముంచేస్తున్నారు



పుత్తూరు : రైతుల రెక్కల కష్టం వ్యాపారుల పరమవుతోంది. వారు చెప్పిందే ధర, నిర్ణయించిందే తూకం కావడంతో అన్నదాత అప్పుల ఊబిలోంచి బయటపడలేకపోతున్నాడు. ప్రభుత్వం ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి, వేరుసెనగ, సజ్జలు, మొక్కజొన్నలు తదితర పంటలు సేకరించాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదు. ఇవేమీ అధికారులకు పట్టకపోవడంతో అన్నంపెట్టే రైతులు అన్నివిధాలుగా మోసపోతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రబీలో 25,000 హెక్టార్లలో వరి సాగు చేశారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, నాయుడుపేట, గూడూరు, వడమాలపేట, పుత్తూరు, నాగలాపురం మండలాలు, చిత్తూరు జిల్లాలో నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం మండలాల్లో వరి సాగైంది. చిత్తూరు పరిధిలో మార్చి మొదటి వారంలో కోతలు ప్రారంభం కాగా తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో పూర్తయ్యాయి. అయితే ఇప్పటివరకు ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోలేదు. దోపిడీని అరికట్టాల్సిన అధికారులు అటువైపు దృష్టి సారించడంలేదు.

**ఎకరాకు రూ.57 వేల వరకు..**

ధర విషయంలో బస్తాకు రూ.265 వరకు ఎకరాకు 30 బస్తాలు దిగుబడి అనుకున్నా రూ.7,950 నష్టపోతున్నారు. దీనికితోడు తుకాల్లోనూ మోసంతో బస్తాపై మరో రూ.115 నష్టం జరుగుతోంది. అంతిమంగా ఎకరాకు రూ.3,450 మోసం జరుగుతోంది. ధర, తూకాల్లో మొత్తం రైతు ఎకరాకు రూ.11,400 వరకు నష్టపోతున్నారు. ఇలా ఐదెకరాల రైతు ఏకగా రూ.57 వేలు కోల్పోవాల్సి వస్తోంది. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో ఒక్కో రైతు 20 నుంచి 30 ఎకరాలు సాగు చేస్తుండగా రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఇదంతా దళారులు, వ్యాపారుల పాలవుతోంది.

తేమ పేరుతో తకరారు..: తేమ పేరుతో ధాన్యం బస్తాకు 4 నుంచి 5 కిలోలు మినహాయించుకుంటున్నారు. దీనికితోడు ఒక్కో రైతుకు ఒక్కో ధర చెల్లిస్తున్నారు. పంటపొలాలు పరిశీలించి ఓ ధరను నిర్ణయించి అడ్వాన్స్ ఇస్తున్నారు. తీరా కోతలు అయ్యాక తేమ, చెత్తాచెదారం ఉన్నాయని ధరలు తగ్గిస్తున్న సందర్భాలు ఉన్నాయి.

పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన రైతు ఆనందయ్య ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. ప్రభుత్వం ఈ ఏడాది ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పొలంలోనే విక్రయించాడు. 80 కిలోలకుగాను గోతాకు ఒక కిలో.. తేమశాతం ఉందని, ధాన్యం శుభ్రంగా లేదని 85 కిలోల వరకు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి కోతలు జరిగే అన్ని మండలాల్లోనూ ఇదే దుస్థితి. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలు సాధారణ రకానికి రూ.2,300, సన్నరకాలకు రూ.2,320 నిర్ణయించింది. ఈమేరకు 80 కిలోల బస్తాకు రూ.1,840 ధర దక్కాల్సి ఉండగా రూ.1,575 మాత్రమే చెల్లిస్తున్నారు. ఫలితంగా బస్తాకు రూ.265 మేర నష్టపోతున్నారు.

**122 క్లస్టర్లు గుర్తించాం**

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 122 క్లస్టర్లు గుర్తించాం. వాటిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ప్రతిపాదనలు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులకు పంపాం.సుమతి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ గోదాం

# కబ్జా కోరల్లో కుంట స్థలం



గుంతకల్లు : గుంతకల్లులోని భాగ్యనగర్ కొత్తకొట్టాలకు సమీపంలోని ప్రభుత్వానికి చెందిన కుంట స్థలం రోజురోజుకీ కబ్జాకు గురవుతోంది. ఇప్పటికే కొందరు ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకోగా మరికొందరు పునాదులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు. భాగ్యనగర్ కొత్తకొట్టాల కాలనీలో గుంతకల్లు - ఆదోని రహదారికి ఆనుకుని 328-డి సర్వేనంబరులో 3.1 ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉంది. కొందరు ఆక్రమించి నివాసగృహాలను నిర్మించుకోవడంతో కుంట విస్తీర్ణం తగ్గిపోయింది. మరికొంత ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.10 కోట్లు విలువచేసే ఎకరా స్థలం ఆక్రమణకు గురైంది. ఇప్పటి మార్కెట్ విలువ ప్రకారం కుంట స్థలం మొత్తం విలువ దాదాపు రూ.29 కోట్లు ఉంటుందని అంచనా.

**స్థలాల కోసం షికారీలు..**

కుంటకు చెందిన స్థలంలో దాదాపు 12 మంది వరకు షికారీలు ఇళ్లు, షెడ్లను నిర్మించుకున్నారు. ఇక్కడ ఇళ్లను నిర్మించుకోవడంతో వర్షం వచ్చిన సమయాల్లో కుంటలోకి నీరు పెద్దఎత్తున రావడం, కొంత నీరు షికారీల ఇళ్లలోకి వెళ్లడం జరుగుతోంది. మున్సిపాలిటీ వారు వచ్చి కుంటలోని నీటిని పంపులద్వారా తోడేస్తుంటారు. కుంటలోని స్థలానికి ఇంటి పట్టాలు ఇవ్వడం నిబంధనలకు వ్యతిరేకమని తహసీల్దారు రమాదేవి చెబుతున్నారు. మరోవైపు అక్కడి వారు ఎప్పటికైనా స్థలం ఇస్తారన్న ఆశతో ఉండటం గమనార్హం.

కుంటకు చెందిన కొంత స్థలంలో గార్బేజ్ కలెక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మున్సిపల్ అధికారులు నిర్మాణాలు చేపట్టి అర్ధాంతరంగా ఆపివేశారు. విలువైన కుంటను కాపాడటానికి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కృషి చేయాల్సిన అవసరముంది.

**రక్షణ చర్యలు చేపడతాం - రమాదేవి, తహసీల్దారు**

ప్రభుత్వానికి చెందిన కుంట ఆక్రమణలకు గురికాకుండా కాపాడుతాం. ఆక్రమించిన వారిపై చర్యలు చేపడతాం. కుంట రక్షణ విషయంలో మున్సిపాలిటీ వారు కూడా చొరవ చూపాలి. కుంటలో ఇళ్లను నిర్మించుకున్న వారికి, నిర్మించుకునే వారికి ప్రభుత్వం తరఫున పట్టాలు ఇవ్వడం కుదరదు.

# ట్రంప్ దెబ్బకు.. రొయ్యో మొర్రో..!

అల్లవరం : అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆక్వా రంగంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూపంలో పిడుగు పడింది. రొయ్యలపై ప్రస్తుతం ఉన్న 3 నుంచి 4 శాతం సుంకాన్ని అమెరికా 26 శాతానికి పెంచినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం రొయ్యల కొనుగోళ్లు పూర్తిగా నిలిచి పోయాయి.

**50 శాతానికి చేరిక..!**

కొత్త సుంకాలు అమలులోకి వస్తే రూ.లక్ష విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేయాలంటే రూ.26వేలు పన్ను కట్టాలి. రవాణా, ప్యాకింగ్ ఇతర ఖర్చులతో కలిపి 50 శాతానికి చేరుతుంది. ఈ మేరకు రొయ్యల ధరలు తగ్గి ఆ భారం రైతులపై పడనుంది.

**నిలిచిన వైనం..**రెండు రోజుల క్రితం వరకు 100 కౌంట్ ధర రూ.230 వరకు ఉంది. ఇది రూ.50- 60 వరకు తగ్గనుందని అంచనా. తాజాగా ఈ కౌంట్ ధరను రూ.30 నుంచి రూ.40 వరకు తగ్గించేశారు.



**సమావేశంలో నిర్ణయం తర్వాతే...**

రొయ్యల కొనుగోలుపై అమెరికా సుంకాలపై రాష్ట్రంలో రొయ్యల ఎగుమతిదారులు సమావేశం నిర్వహించి అమెరికా విధించిన సుంకాల ప్రభావం ఏ మేర ఉంటుంది? వాటి వల్ల ఎంత ధక తగ్గించాలి? ఏ విధంగా కొనుగోలు చేయాలి? అనే అంశాలు చర్చించి ధరలు నిర్ణయించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉత్పత్తులు తీసుకుంటాం గాని, ధరలు మాత్రం సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఉంటాయని డీలర్లు చెబుతున్నారు. గత్యంతరం లేని పక్షంలో రైతులు వారి షరతులకు లోబడే పట్టుబడులు చేస్తున్నారు.

**పెంచితే ప్రభావం-వర్ధన్, జిల్లా మత్స్యశాఖ ఇన్‌ఛార్జి అధికారి**

అమెరికా దిగుమతి సుంకాలు పెంచిన విషయం ప్రస్తుతం మా దృష్టికి రాలేదు. దీనిపై కేంద్ర స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ దిగుమతి సుంకాలు పెంచితే కచ్చితంగా దాని ప్రభావం ఇక్కడి కొనుగోళ్లపై పడుతుంది. దీనిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తాం.

# అరచేతిలో స్వర్గం.. అవస్థలే సర్వం

అమలాపురం: పాలన సులభతరం చేసేందుకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నామని గొప్పగా ప్రకటించి.. కనీస వసతులు కల్పించకుండా పునర్విభజన చేసింది నాటి వైకాపా ప్రభుత్వం. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏడాదిలోగా పూర్తి చేస్తామని చెప్పినా అవి అమలు కాలేదు. మరోవైపు వివిధ సేవల నిమిత్తం వస్తున్న ప్రజలు రెండుచోట్లకు తిరగలేక నానా అవస్థలు పడుతున్నారు.జిల్లాను 2022 ఏప్రిల్ 4న అంబేడ్కర్ కోనసీమ జిల్లాను ఏర్పాటు చేసినా నేటికీ అసౌకర్యాల నడుమే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. పలు శాఖలు ఇంకా ఉమ్మడి జిల్లాలోనే కొనసాగుతున్నాయి.

**ప్రజలకు దూరాభారం** సేవల నిమిత్తం నిత్యం ప్రజలు అమలాపురంలో కలెక్టరేట్‌కు వస్తుంటారు. అధికారులు సంబంధిత కార్యాలయాలకు వెళ్లాలని సూచిస్తుండటంతో మళ్లీ ముమ్మిడివరం వెళుతున్నారు. కలెక్టరేట్ నుంచి నేరుగా ముమ్మిడివరానికి రవాణా సౌకర్యం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఆయా శాఖాధిపతులు కలెక్టరేట్‌లో నిర్వహించే వివిధ సమావేశాలు, సమీక్షలకు అమలాపురం రావడంతో వివిధ సమస్యలు చెప్పుకోవడానికి ముమ్మిడివరం వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పర్యవేక్షణ కొరవడడంతో ఇక్కడ పనిచేసే సిబ్బందిలో పారదర్శకత లోపిస్తోంది.

**ప్రతిపాదనలకే పరిమితం** కలెక్టరేట్, ఇతర జిల్లా కార్యాలయాలకు అవసరమైన భవన సముదాయం నిర్మించేందుకు అమలాపురం పరిసర ప్రాంతాల్లో భూమి కోసం అధికారులు 2023లో ప్రయత్నించారు.



అమలాపురం మండలం భట్నవల్లి సమీపంలో సుమారు 15 ఎకరాల భూమి చూసినా ప్రతిపాదనల దశలోనే ఆగిపోయింది.

**ఏదీ అభివృద్ధి**గత వైకాపా పాలకులు హడావుడిగా జిల్లాల పునర్విభజన చేయడం మినహా.. అభివృద్ధికి సరైన ప్రణాళిక రూపొందించలేదు. మూడేళ్లు గడుస్తున్నా పెద్దగా మార్పు కనిపించడం లేదనే భావన ప్రజల్లో నెలకొంది. పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశాలు ఉన్నా.. కొబ్బరి, ఆక్వా, వ్యవసాయాధారిత వనరులు పుష్కలంగా ఉన్నా.. ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేదు.

**ఇదీ పరిస్థితి**జిల్లాలో 79 శాఖలకు సంబంధించి అమలాపురంలో 18 శాఖల జిల్లా కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలినవి ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలల్లో ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. శాంతి భద్రతల్లో ప్రధాన భూమిక పోషించే జిల్లా పోలీసు కార్యాలయం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. భవనం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జిల్లా అటవీ శాఖ కార్యాలయమూ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. డ్రెయినేజీ, భూగర్భ జలవనరుల శాఖ కార్యాలయాల విభజన జరగకపోవడంతో నేటికీ కాకినాడ జిల్లాలోనే కొనసాగుతున్నాయి.సమాచార శాఖ కార్యాలయం ముమ్మిడివరంలో ఏర్పాటు చేసినా.. విభాగాధిపతి కార్యాలయం అమలాపురంలోనే ఉంది.

# రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఇసుకను కొందరు కర్ణాటకకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో అక్రమార్కులు జోరుగా దందా సాగిస్తున్నారు. ఇక్కడి వేదవతి నదిలో నాణ్యమైన ఇసుక లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. దీంతో పగలు ఒకచోట ఇసుక నిల్వ చేసి రాత్రి టిప్పర్ల ద్వారా సరిహద్దులు దాటించేస్తున్నారు. ముఖ్యంగా గుమ్మఘట్ట మండలం రంగచేడు, భూపసముద్రం, కేపీకుంట, తాల్లకెర గ్రామాల మధ్య, రాయదుర్గం మండలం రేకులకుంట, జుంజురాంపల్లి తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. కర్ణాటకలో ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది.



**చుట్టూ నిల్వలే..**

పట్టణ శివారులోని మొలకాల్మూరు రోడ్డులో ఇటీవల ముళ్లకంపల్లో సుమారు 20 ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు అధికారులు దాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. వీటితోపాటు గొల్లపల్లి దారిలో ఓ వ్యవసాయ తోటలో పగలు ఇసుక నిల్వ చేసి రాత్రికి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అనంతపురం, మొలకాల్మూరు రోడ్డుకు ఆనుకుని ఓ వ్యవసాయ తోటలో ఇసుకను డంపింగ్ చేశారు. ఇక్కడి నుంచి రోజు మార్చి రోజు కర్ణాటకకు తరలిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఇసుక కర్ణాటకకు తరలివెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**దాడులు నిర్వహిస్తాం**

ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా, కర్ణాటకకు తరలించినా కఠిన చర్యలు తప్పవు. ఇటీవల పైతోట సమీపంలో ఇసుకను స్వాధీనం చేసుకున్నాం. దానికి త్వరలో వేలం పాట నిర్వహిస్తాం. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి ఇసుక అక్రమంగా తరలి వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.నాగరాజు, తహసీల్దార్

# కలప తరలుతోంది.. పచ్చదనం తగ్గుతోంది!

చెన్నేకొత్తపల్లి : కొన్ని రకాల కలప తరలించేందుకు అనుమతి అవసరం లేదన్న నిబంధనలను సాకుగా చేసుకొని ఇక్కడి కలపను ఇతర రాష్ట్రాలకు ప్రధానంగా గుజరాత్‌కు తరలుతోంది. ఇతర రాష్ట్రాల్లో సుబాబుల్, నీలగిరి కలపకు మంచి గిరాకీ ఉంది. కాగితపు తయారీ కంపెనీల వారు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. సుబాబుల్, నీలగిరి వంటి మొక్కలను రైతులు తమ పొలాల్లో ప్రత్యేకంగా ఐదు నుంచి పదేళ్ల వరకు పెంచి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు, బంజరు భూముల్లో స్వతహాగా పెరిగిన సుబాబుల్ చెట్లను నరికి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.



**విలువ తెలుసుకొని..**

ఇతర రాష్ట్రాల్లో ఈ కలప విలువ తెలిసిన కొందరు వ్యాపారులు పలు ప్రాంతాల్లో కొనుగోలు పాయింట్లు ఏర్పాటు చేసి టన్నుకు రూ.మూడు నుంచి రూ.4 వేలకు కొని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ టన్ను రూ.ఆరు నుంచి ఏడు వేలకు మిల్లుల యజమానులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.

**నిత్యం లారీల్లో..** ఉమ్మడి జిల్లాలోని హిందూపురం, బత్తలపల్లి, ఎన్ఎస్ గేట్, పామిడి, గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో లారీల కలప తరలుతోంది. ప్రకృతిలో సహజంగా పెరిగిన చెట్లను అక్రమార్కులు తెగ నరికి తరలిస్తున్న వైనంపై వృక్ష ప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతలో నానాటికీ అడవుల విస్తీర్ణం తరగి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. కలప అక్రమ రవాణాపై జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్ దృష్టికి తీసుకుపోగా సుబాబుల్, నీలగిరి కలప తరలించేందుకు అనుమతి అవసరం లేదన్నారు. ఇతర చెట్లు నరికి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# పేదల స్థలాల్లో పెద్దల పెత్తనం

బనగానపల్లి : మండలం యనకండ్లలో సర్వే నంబరు 191-1లో 1989-1990లో 1.50 ఎకరాల స్థలంలో 22 మంది లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేశారు. ఇక్కడ కొంత కాలం పాలిష్ పరిశ్రమలు నడిచాయి. కాలక్రమేణా మూతపడి పోయాయి. ఇక్కడ అసలు పరిశ్రమలు ఉన్నట్లు ఆనవాళ్లు కనిపించడం లేదు. సుమారు ఎకరా వరకు ఆక్రమణకు గురైంది. ఇక్కడ ఎకరా పొలం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉంటుంది. ఈ భూమి ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిందని బోర్డు వేసినా పొలం ఆక్రమణకు గురైంది.ఎస్సీల సంక్షేమం కోసం కేటాయించిన స్థలాలు పరులపాలవుతున్నాయి. ఎక్కడికక్కడ పెద్దలు పాగా వేస్తున్నారు.. రూ.కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ కింద దశల వారీగా భూ పంపిణీ చేశారు. పరి'శ్రమి'స్తారన్న ఉద్దేశంతో పాలిష్ పరిశ్రమలు పెట్టుకోవడానికి 48.44 ఎకరాలు ఇచ్చారు. మొత్తం 490 యూనిట్లు ఉన్నాయి.. ఒక్కో యూనిట్ పరిధిలో 20-22 మంది ఉన్నారు. ఒక్కో యూనిట్‌కు ఎకరం నుంచి రెండెకరాల వరకు కేటాయించారు. కార్పొరేషన్ నిధులు వెచ్చించి యంత్రాలు కొనుగోలు చేసి ఇచ్చింది. కొన్నాళ్లు లబ్ధిదారులు గనుల నుంచి రాళ్లను తెప్పించుకొని పాలిష్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. కాలక్రమేణా నష్టాలు రావడంతో దశల వారీగా పరిశ్రమలు మూతపడ్డాయి. చివరకు అక్కడ పాలిష్ పరిశ్రమలు ఉన్నాయనే గుర్తులు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఖాళీ స్థలాలుగా మారిపోయాయి. విలువ పెరిగింది.. దీంతో కొందరు ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకొంటున్నారు.

# దంత వైద్యం.. అందని దైన్యం!



అనంతపురం : ఉమ్మడి జిల్లాలో అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న దంత వైద్యులు అందిస్తున్న సేవలు నామమాత్రంగా ఉన్నాయి. పుచ్చిన దంతాలను తొలగించటం..శుభ్రం చేయటం.. సిమెంట్ నింపడం వంటి మాత్రమే అందిస్తున్నారు. కొన్ని చోట్ల ఆధునిక పరికరాలు ఉన్నా వినియోగించని పరిస్థితి. ప్రాంతీయ, సామాజిక, జిల్లా ఆసుపత్రుల్లోని వైద్యులే యూహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో మంగళవారం, గురువారం, శనివారం ఓపీ సేవలు అందిస్తున్నారు. అక్కడా ఇక్కడా విధులు నిర్వహిస్తుండటంతో సేవలపై ప్రభావం చూపుతోంది. యూహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో దంత చికిత్సలకు సంబంధించి పరికరాలు అందుబాటులో లేవు. కేవలం ఓపీ చూసి మందులు రాసివ్వటంతో సరిపెట్టేస్తున్నారు.

**ఎనిమిది మందికి ఇద్దరే..** అనంతపురంలోని సర్వజన వైద్యశాలలో దంత వైద్యానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్ ఉండాలి. ఇక్కడ కేవలం అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. వీరిద్దరూ రోజు వారి ఓపీకి వస్తున్న 30 నుంచి 40 మంది రోగులకు సేవలు అందిస్తున్నారు. సోమవారం, బుధవారం, శుక్రవారం ఓపీ చూస్తున్నారు.

**నాలుగేళ్లుగా అంతే..**

కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాలుగేళ్లుగా పంటి శస్త్రచికిత్సలు ఆగిపోయాయి. ఇక్కడ ఒక వైద్యురాలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది నియమించలేదు. ఆమె వారంలో మూడు రోజులు ఇక్కడ.. మరో మూడు రోజులు యూహెచ్‌సీ, పీహెచ్‌సీలో పని చేస్తున్నారు. రోగులను పరీక్షించి ఔషధాలు రాసి ఇస్తున్నారు.

**వారానికి మూడు రోజులే..**

కదిరి ప్రాంతీయ ఆసుపత్రిలో వారంలో మూడు రోజులు మాత్రమే దంత వైద్యం అందుబాటులో ఉంటుంది. పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందించేందుకు పరికరాలు అందుబాటులో ఉన్నా ఇక్కడ సేవలందించే వైద్యురాలు మూడురోజుల పాటు ఉంటున్నారు. దీంతో దంతసమస్యలు ఉన్న రోగులు ప్రైవేటు ఆసుపత్రులపై మొగ్గుచూపుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులే మూడు రోజులపాటు యూహెచ్‌సీ, పీహెచ్‌సీలో సేవలు అందిస్తున్నది వాస్తవమే. ఈ విధానం సక్రమంగా లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆసుపత్రుల్లో మరిన్ని ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. డాక్టర్ పాల్ రవికుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త

# నిధులున్నా చెల్లింపులో జాప్యమెందుకు?



కదిరి : గత ఏడాది నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయులకు మంజూరైన రవాణా భత్యం అందజేయడంలో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇంతకాలం నిధులు రాలేదని కారణాలు చెబుతూ కాలం వెళ్లదీసిన అధికారులు తీరా అవి విడుదలయ్యాక.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య బోధించాలనే సంకల్పంతో ఉపాధ్యాయులకు గత ఏడాది టీచ్-టూల్, ఎఫ్ఎల్ఎన్, లీడర్ షిప్‌లపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా శిక్షణ కేంద్రాలు దూరప్రాంతంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాలతో సొంత ఖర్చులు వెచ్చించి వ్యయ, ప్రయాసాలు పడుతూ ఉపాధ్యాయులు వెళ్లారు. శిక్షణకు హాజరైన వారికి నిర్ణయించిన రవాణా భత్యం చెల్లింపుల్లో జాప్యం నెలకొంది.

ఇప్పటికే ఏడెనిమిది నెలలు గడిచిపోయింది. అయినా ప్రయాణ ఖర్చులను ఇవ్వటం లేదు. మరో 50 రోజుల్లో పాఠశాలలకు సెలవులు రానున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిక్షణ ప్రయాణ ఖర్చులను మంజూరు చేయాలని కోరుతున్నారు.

**ఉపాధ్యాయులకు రావాల్సిన సొమ్ము ఇలా..**

ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రథమార్థంలో టీచ్ - టూల్ శిక్షణకు సుమారు 509 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణ నిర్వహణకు ఉపాధ్యాయుల రవాణా భత్యంతో పాటు భోజనం, అల్పాహారం తదితర ఖర్చులకు రూ.20.61 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు రూ.7.20 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.13.40 లక్షలు ఉపాధ్యాయులకు ఇవ్వాల్సి ఉంది.

ఏడో విడతల్లో మొత్తం 1,620 మందికి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ) శిక్షణను హిందూపురం బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇచ్చారు. హాజరైన ఒక్కొక్కరికి రూ.200 చొప్పున రూ.3.24 లక్షలు రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది.

'లీడర్‌షిప్' శిక్షణకు హాజరైన 650 మంది ప్రధానోపాధ్యాయులకు.. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది.

త్వరలో ఖాతాలకు జమ: దేవరాజ్, ఏపీసీ, ఎస్ఎస్ఏ, శ్రీసత్యసాయి జిల్లా టీచ్-టూల్‌కు సంబంధించిన రూ.13.40 లక్షల నిధులు వచ్చాయి. రెండు, మూడు రోజుల్లో ఖాతాలకు జమ చేస్తాం. ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ శిక్షణకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉంది. వచ్చిన వెంటనే శిక్షణ పొందిన అందరి ఖాతాలకు రవాణా భత్యం సొమ్ము జమ చేస్తాం.

# పట్టాలెక్కిస్తామని.. పత్తాలేకున్నారు..!




అమరావతి : విజయవాడ శివారులో రాయనపాడు, గొల్లపూడి, కొండపల్లి నాలుగు లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద వంతెన (ఆర్వోబీ)లను 2019లో రైల్వే మంజూరు చేసింది. రాష్ట్రం, రైల్వే 50-50 శాతం చొప్పున నిధులు వెచ్చించి నిర్మించాలనేది ఒప్పందం. కానీ.. జగన్ సర్కారు స్పందించలేదు. 2021లో మరోసారి పాలసీ మారింది. ఈసారి భూసేకరణ మాత్రమే రాష్ట్రం చేసిస్తే.. నిర్మాణం అంతా రైల్వేనే చూసుకుంటుంది. కానీ.. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023-24లో పూర్తిగా పాలసీ మారింది. భూసేకరణ సహా మొత్తం నిర్మాణం రైల్వేనే భరిస్తుంది. ఒక్క రూపాయి కూడా రాష్ట్రం ఇవ్వాల్సిన పనిలేదు. కేవలం బడ్జెట్ అంచనాలు ఆయా శాఖలు ఇస్తే చాలని రైల్వే ప్రకటించింది. అయినా.. అంచనాలు ఇవ్వడానికీ చొరవ చూపలేదు.జగన్ సర్కారు... నిధులు ఇవ్వలేనంది... సరే భూమి సేకరించి ఇవ్వమంది.. రైల్వే అదీ తన వల్లకాదని చేతులెత్తేసింది... సరే ఆ బాధ్యతా మాదే.. అంచనాలైనా ఇవ్వండంది.. రైల్వే ఆసాంతం తామే నిర్మిస్తామని నిర్దయగా గాలికొదిలేసింది.. ప్రస్తుతం నాలుగు ఎల్‌సీ గేట్ల వద్ద నిత్యం వందల మంది నరకం చూస్తున్నారు. రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండే హైదరాబాద్-విజయవాడ మార్గం కావడంతో.. ప్రతి అరగంటకోసారి గేట్ పడుతోంది. ప్రయాణికులు, సరకు రవాణా రైళ్లు భారీగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో నాలుగు ఎల్‌సీ గేట్ల వద్ద ప్రజలు తల్లడిల్లుతున్న వేళ ఆరేళ్ల కిందటే ఆర్వోబీలను రైల్వే మంజూరు చేసింది. కానీ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్యరూపం దాల్చలేదు. విజయవాడ నుంచి వెళ్లే వాహనాలన్నీ శివారులో గొల్లపూడి, రాయనపూడి మీదుగానే పైడూరుపాడు, కవులూరు, జి.కొండూరు, మైలవరం, జక్కంపూడి, షాబాద, కొత్తూరు తాడేపల్లి చేరాలి. ఈమార్గంలో రైల్వే గేట్ వద్ద నిత్యం గంటల కొద్దీ వాహనదారులు వేచి ఉండాల్సిందే. కొండపల్లి వద్ద ఉన్న ఎల్‌సీ గేట్ వద్ద కూడా ఇంతే.

**కూటమి ప్రభుత్వం వచ్చాక...**

కొండపల్లి వద్ద ఎల్‌సీగేట్ నంబరు 140, రాయనపాడు 147, 148, గొల్లపూడి 150.. ఈ నాలుగు ఆర్వోబీల నిర్మాణంలో తాజాగా కొంత కదలిక వచ్చింది. చంద్రబాబు సర్కారు కొలువుదీరాక.. తొమ్మిది నెలల్లో ఇప్పటికే మూడుసార్లు సమన్వయ భేటీలు పెట్టి చర్చించారు. రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు సహా అన్ని ప్రభుత్వ విభాగాలు, రైల్వే అధికారులు సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా.. అన్ని విభాగాలు బడ్జెట్ అంచనాలు రూపొందించి రైల్వేకు పంపాలని నిర్ణయించారు. భూసేకరణ అంచనాలు రెవెన్యూ సిద్ధం చేసిచ్చింది. నీటి పైప్‌లైన్లు, విద్యుత్తు లైన్ల తరలింపు.. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్తు సహా కొన్ని విభాగాల నుంచి ఇంకా రైల్వేకు పంపక పోవడంతో మరింత జాప్యం జరుగుతోంది.

**త్వరగా నివేదికలు అందిస్తేనే...**

జిల్లా అధికారుల నుంచి బడ్జెట్ అంచనాలు రైల్వేకు పూర్తిగా అందాకే ప్రక్రియ ఆరంభమవుతుంది. అంచనాలు అందాక.. వాటితో కలిపి పూర్తి డీపీఆర్‌ను తయారుచేసి విజయవాడ రైల్వే డివిజన్ నుంచి బోర్డుకు పంపడానికి మరో నెలన్నరపైనే పడుతుంది. ఆ నివేదిక పంపాకే.. నిధులకు రైల్వే అనుమతి ఇస్తుంది. తర్వాతే టెండర్లు పిలిచి.. పనులు పట్టాలెక్కిస్తారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వ విభాగాలు నివేదికలు త్వరగా అందిస్తే.. సమస్య పరిష్కరించినట్లే.

# మల్లె రైతులకు లేవు సిరునవ్వులు

మైలవరం : 'ఆహా..ఈ రోజు కిలో మల్లె రూ.1,500 పలుకుతోంది..' డిసెంబరులో కొన్ని రోజుల పాటు రైతుల మురిపెమిది. 'అయ్యో.. ఈ రోజు రూ.100, 150కే కొంటున్నారు..' జనవరి నుంచి సీజన్ పూర్తయ్యే వరకు మల్లె సాగు రైతుల ఆవేదన.. రాష్ట్ర వ్యాప్తంగా మైలవరం ప్రాంతం మల్లెతోటలకు ప్రసిద్ధి..మండలంలోని చంద్రగూడెం కేంద్రంగా దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో మార్కెట్ కొనసాగుతోంది. దాదాపు 10 గ్రామాల రైతులు ఐదారు నెలల పాటు అక్కడ పూలు విక్రయిస్తుంటారు. వాటిని వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. నెల కిందట ఇక్కడ కిలో రూ.1,500ల నుంచి రూ.2 వేల వరకు పలికింది..అదీ వారం రోజుల లోపే. కానీ అప్పట్లో తోటల్లో దిగుబడులు అంతంత మాత్రమే..మార్కెట్‌కు వచ్చేది రోజుకి ఒకట్రెండు క్వింటాళ్లే. గరిష్ఠ ధరలున్నప్పుడు దిగుబడులు క్వింటాళ్లకే పరిమితమయితే, ధరలు దిగజారేనాటికి టన్నుల్లో దిగుబడులు వస్తున్నాయి. ముందస్తు పూల ధరను చూసి మురిసే లోపే, రైతుల ఆశలు ఆవిరై పోతున్నాయి.

**టన్నుల కొద్దీ దిగుబడులు**



జనవరి చివరి నుంచి ప్రస్తుతం అన్ని గ్రామాల్లోని తోటల్లో దిగుబడులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. ఎకరానికి సరాసరి రోజుకి 40 కిలోల దిగుబడి వస్తుండగా, మార్కెట్‌కు 10 టన్నుల వరకు పూలు వస్తున్నాయి. దిగుబడులు పెరిగి గిరాకీ తగ్గిందన్న కారణంతో కిలో రూ.100 నుంచి రూ.150 మధ్య నాలుగైదు రోజులుగా కొనుగోళు సాగుతున్నాయి. రోజుకి ఒక కూలీకే 400 ఇస్తున్నామని..కూలి ధర, రూ.లక్షల్లో పెట్టుబడి..తగ్గిన మార్కెట్ సౌలభ్యంతో నష్టాలు తప్పడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అనుబంధ పరిశ్రమలుంటేనే**

రోజువారీ క్రయ విక్రయాలు, శుభముహూర్తాలే మల్లెలు అవసరం కావడంతో రైతులకు ఎక్కువగా నష్టం, లేదా అరకొర ఆదాయమే లభిస్తోంది. దశాబ్దం కిందటే మల్లె అనుబంధ పరిశ్రమలను స్థాపిస్తే..నిలకడైన ధరలుంటాయని రైతులు కోరడంతో, ఆ దిశగా అప్పట్లో ఆరా తీసినా ఎవరికీ పట్టలేదు. ప్రస్తుతం గ్రామంలో పరిశ్రమలకు కేటాయించిన పోరంబోకు స్థలంలో చొరవ తీసుకుని స్థాపిస్తే సాగు మరింత పెరుగుతుందని రైతులు అంటున్నారు.

**సాగు వివరాలిలా...**

సాగు విస్తీర్ణం : సుమారు 900 ఎకరాలు
పెట్టుబడి వ్యయం : రూ.1 లక్ష
కౌలు ధర : రూ.80,000- రూ.లక్ష
సరాసరి దిగుబడి : 5 నుంచి 6 టన్నులు
నికర ఆదాయం : నిలకడలేదు

# అనుమతులకే పరిమితం.. ఆపై పట్టించుకోం


మచిలీపట్నం : జిల్లాలోని గనుల శాఖలో అధికారుల కొరత వెంటాడుతోంది. స్వయంగా గనుల శాఖ మంత్రి జిల్లాలోనే అధికారులు లేకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. గత వైకాపా హయాంలో అక్రమాలను అడ్డుకోవడంలో ఈ శాఖ విఫలమైంది. ముడుపులు పుచ్చుకొని జిల్లాలో ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకో లేదు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోనే ముడా భూముల్లో మట్టి తవ్వకాలు, బుసుక, ఇసుక తరలిస్తున్నా చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్ మినహా దాదాపు అన్ని స్థానాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఉన్న అధికారులు సైతం వైద్య సంబంధ సెలవులో కొనసాగుతున్నారు.

**ఫిర్యాదులకు పరిష్కారం శూన్యం**

మట్టి, ఇసుక మాఫియాలతో ఇబ్బంది పడుతున్న రైతులు, గ్రామస్థులు మండల స్థాయిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నారు. ఇక్కడికి వచ్చిన అర్జీలను గనుల శాఖకు పంపుతున్నారు. అక్కడ కేవలం టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే ఉండటంతో ఫిర్యాదులను పరిష్కరించలేక వాటిని మళ్లీ మండల అధికారుల వద్దకే బదలాయిస్తున్నారు. అక్కడ సమస్య తీరకుండానే పరిష్కరించినట్లు చూపుతుండటంతో అధికారుల తీరుపై అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సెలవులోనే ఏజీ, ఏడీ**

గనుల శాఖ ఏడీ అనారోగ్యం కారణంగా కొంత కాలంగా సెలవులో ఉన్నారు. ఈ స్థానంలో ఎవరూ లేకపోవడంతో ఎన్టీఆర్ జిల్లా డీడీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో ఆసక్తి చూపట్లేదు. ప్రజల నుంచి మట్టి, ఇసుక మేటల తొలగింపుపై వచ్చిన దరఖాస్తులు, ఇతర దస్త్రాలపై ఆయన సంతకాల కోసం ఇక్కడ ఉన్న టెక్నికల్ అసిస్టెంట్



విజయవాడ తీసుకెళ్లాల్సిందే. ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, స్థానాలు భర్తీ చేయాల్సి ఉంది. ఇక్కడ సర్వేయర్‌ను ఎన్టీఆర్ జిల్లాలో ఇన్‌ఛార్జి ఇవ్వడంతో అక్కడ విధులకే పరిమితమవుతున్నారు. ఏజీ సైతం అనారోగ్యం కారణంగా తరచూ సెలవు పెడుతున్నారు. నెలలో ఒకటి రెండ్రోజులు విధులకు రావడం, ఆరోగ్యం బాగోలేదని మళ్లీ సెలవు పెట్టడం పరిపాటిగా మారింది.

**తనిఖీలు లేవు..!**

పేర్ని నానికి చెందిన గోదాములకు ఉపాధి పనులు చేసిన మట్టిని తరలించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటి వరకు విచారణ లేదు. జిల్లాలోని ఇసుక రేవుల్లో రేయింబవళ్లు యథేచ్ఛగా యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. ముడా భూముల్లో రాత్రి, పగలు విచ్చలవిడిగా అక్రమంగా బుసక తవ్వుతున్నా ఎవరూ ఆపట్లేదు. మండల రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక, బుసక మాఫియాతో ముడుపులు తీసుకొని మిన్నకుండిపో తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చురకలు



## అమ్మబోతే.. అగమ్యగోచరం

మచిలీపట్నం : రామానగరానికి చెందిన తొట్టెంపూడి పెదబాబుకు పదిహేను రోజుల కిందట తన పదెకరాల్లో మాసూలు చేశారు. దిగుబడి 350 బస్తాలు(ముతకరకం) రాగా కొనే దిక్కే లేక పొలంలోనే మగ్గుతున్నాయి. ధర తగ్గించి కొనుగోలు చేసేందుకు సైతం మిల్లర్లు ఆసక్తి చూపకపోవడంతో ఏం చేయాలనే విషయంపై మల్లగుల్లాలు పడుతున్నారు. పాగోలుకు చెందిన రైతు శ్రీహరికి 300 బస్తాల బీపీటి రకం దిగుబడి వచ్చింది. కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో దళారులకు బస్తాను రూ.1,400 చొప్పున విక్రయించి రమారమి రూ.2లక్షల వరకూ నష్టపోవాల్సి వచ్చింది.

ఆరుగాలం కష్టార్జితానికి ఆశించిన మద్దతు ధర దక్కుతుందన్న సాగుదారుల ఆశలు అడియాసలే అవుతున్నాయి. పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర దక్కేలా చూస్తామంటూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలయ్యే పరిస్థితులు కన్పించడం లేదు. అధికారికంగా నిర్దేశించుకున్న కొనుగోళ్ల లక్ష్యం పూర్తికాకపోయినా కొనుగోలు కేంద్రాలు మూతపడడంతో ఇంకా అన్నదాతల వద్దే ఉన్న దాదాపు 3.99 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో 1.67 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. మొదట 13లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు ఊహించిన అధికారులు అధిక వర్షాలు, వరదల కారణంగా దాన్ని 9.5లక్షల మెట్రిక్ టన్నులకు కుదించారు. మార్కెట్‌లో ధర పలికే సన్నరకాలు పోనూ 5.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో గత నవంబరులో 302 కేంద్రాలు ప్రారంభించారు. జనవరిలో కొన్ని రైస్ మిల్లుల లక్ష్యం పూర్తయిందన్న వంకతో కొనుగోళ్ల ప్రక్రియ మందగించింది. అదనంగా ధాన్యం కొనుగోలు చేయడానికి పలువురు రైస్‌మిల్లర్లు కోరినా ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలంటూ అధికారులు చేతులెత్తేశారు. జనవరిలోనే నిర్దేశిత లక్ష్యం పూర్తయ్యిందంటూ రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిలిపివేశారు. రైతులు,



కొందరు ప్రజాప్రతినిధులు ఆందోళన చేయడంతో కేవలం 30వేల టన్నుల కొనుగోలుకు అనుమతించారు. అదీ పూర్తికావడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

**మార్కెట్లో అమ్ముకోమంటున్నారు..**

రెండో పంట, ఇతరత్రా కారణాలతో రమారమి 3.99లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్దే మిగిలిపోయింది. అపరాలతో పాటు వరి మాసూలు చేసిన రైతులు అమ్ముకునేందుకు రైతుసేవా కేంద్రాలకు వెళితే ప్రభుత్వ ఆదేశాలు లేవని, సర్వర్ ఓపెన్ కాదని చెబుతున్నారు. మార్కెట్‌లో అమ్ముకోవాలంటూ సూచిస్తున్నారు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పుకు వడ్డీలు పెరిగిపోతుండడంతో రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. వారు బస్తాకు రూ.300 వరకూ తక్కువకు అడగడమే కాకుండా నగదు ఇచ్చేందుకు గడువులు పెడుతున్నారు. దీంతో ధాన్యాన్ని అమ్ముకోలేక... నిల్వ ఉంచుకోలేక అయోమయ స్థితిలో రైతులు ఉన్నారు.

## అనుమతి లేని పరీక్షలు

మార్టేరు :తాడేపల్లిగూడెంలోని రామారావుపేట, జూబ్లీ రోడ్డులో అనుమతులు లేని ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. వారంలో ఒక రోజు ప్రత్యేక వైద్యుడిని తీసుకొచ్చి అధిక ఓపీ ఫీజు వసూలు చేస్తూ సేవలు అందిస్తున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధమైనా, బహిరంగంగానే తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇదే పట్టణంలో నాలుగేళ్ల బాలిక అనారోగ్యంతో ఒకే రోజు వేర్వేరు చోట్ల పరీక్షలు చేయించుకోగా వేర్వేరు ఫలితాలు వచ్చాయి. దీంతో ల్యాబ్‌ల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం బోర్డులు లేకుండానే పెనుమంట్ర పంచాయతీ పరిధి బ్రాహ్మణచెర్వు కేంద్రంగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ఆర్‌ఎంపీలు ఇచ్చే సమాచారం మేరకు సిబ్బంది అక్కడికి వెళ్లి నమూనాలు సేకరించి ఫలితాల నివేదికలను ఇస్తున్నారు. ఈ రకంగా అనధికారికంగా కార్యకలాపాలు సాగిస్తూ ప్రజల నుంచి భారీగా దండుకుంటున్నారు. ఇదంతా వైద్యాధికారులకు తెలిసినా మౌనంగా ఉండటం గమనార్హం. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని ఏ అనుమతులు లేకుండానే కొందరు ల్యాబ్‌ల నిర్వహణ చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో గుర్తింపు పొందిన ల్యాబ్‌లు సుమారు 350 మాత్రమే ఉ



న్నాయి. వైద్యులు, ఆర్‌ఎంపీలు, పీఎంపీల సూచన మేరకు రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో అనధికార ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు. వాటిల్లో రోగుల నుంచి భారీ మొత్తంలో దోచేస్తున్నారు. ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో తీరులో ఫలితాలు వస్తున్నాయి. దీంతో రోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అర్హతలు లేని వ్యక్తులతో.. ఈ ల్యాబ్‌లలో పనిచేసే సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేయాల్సి ఉండగా పదిశాతం మినహా మిగిలిన వారు ఎటువంటి అర్హత లేకుండానే పరీక్షలు చేస్తున్నారు. కోర్సు చేసినవారి అర్హత పత్రాలను అడ్డుపెట్టుకుని ల్యాబ్‌లను నడుపుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలే అనధికారి ల్యాబ్‌లను ప్రోత్సహిస్తున్నారు. దీంతో వీరిచ్చే రోగ నిర్ధారణ ఫలితాలు సమగ్రంగా ఉండటం లేదు. ల్యాబ్‌లో సౌకర్యాలను, సిబ్బంది అర్హతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన యంత్రాంగం ఉదాసీన వైఖరిని అవలంబిస్తోంది.

గుర్తించి చర్యలు తీసుకుంటాం.. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన ల్యాబ్‌ల్లో ప్రమాణాలను పాటిస్తూ రోగులకు పరీక్షలు చేయాలి. అనధికారికంగా ల్యాబ్‌లు నిర్వహిస్తే అటువంటివి గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.– భానునాయక్, జిల్లా వైద్యాధికారి, భీమవరం

# కృష్ణమ్మ జలసవ్వడి ఇక మూడు రోజులే!



అనంతపురం : రానున్న మూడు రోజుల్లో గలగలపారే కృష్ణమ్మ సవ్వడులు వినిపించవు. వచ్చే శనివారం నాటికి హంద్రీనీవా ప్రధాన కాలువలో నీటి ప్రవాహం ఆగిపోనుంది. ఇందుకు సంబంధించిన సంకేతాలు ఇక్కడి జలవనరుల అధికార యంత్రాంగానికి చేరవేశారు. ప్రస్తుత నీటి సీజన్‌లో మొత్తం 24.351 టీఎంసీలు జిల్లా సరిహద్దుకు చేరాయి. గత రెండేళ్లతో పోల్చితే ఈ దఫా ఎక్కువ జలాలు జిల్లాకు రావడం విశేషం. శ్రీశైలం జలాశయం వెనుక భాగంలో నంద్యాల జిల్లా మాల్యాల పంపుహౌస్ నుంచి మొత్తం 27.604 టీఎంసీల నీటిని ఎత్తిపోయగా.. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 3.253 టీఎంసీలు వినియోగించారు. తక్కిన 24.351 టీఎంసీలు ఉమ్మడి అనంత జిల్లాకు చేరాయి. గతేడాది ఆగస్టు 1న నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి ఈనెల 8 నాటికి లెక్కిస్తే మొత్తం 220 రోజులు నిర్విఘ్నంగా నీటి ప్రవాహం కొనసాగింది. వైకాపా ప్రభుత్వ హయాంలో మధ్యమధ్యలో నీటి ఎత్తిపోసే ప్రక్రియను ఆపేస్తూ వచ్చారు. విద్యుత్తు మోటర్లకు సంబంధించిన బిల్లు ఎక్కువ వస్తుందన్న ఉద్దేశంతో నీటి ఎత్తిపోతలను నిలుపుదల చేశారు. ప్రస్తుత నీటి సీజన్‌లో ఒక్కరోజు కూడా నీటి ప్రవాహం ఆగలేదు. ఈనెల 8నాటికి మల్యాల నుంచి నీటి సరఫరా బంద్ అయ్యే అవకాశం ఉందని హంద్రీనీవా ఎస్ఈ స్వరూప్ కుమార్ తెలిపారు. దిగువ కాలువలకు నీటి ప్రవాహం మరికొన్ని రోజులు కొనసాగుతుందన్నారు.

**89 చెరువులు...**అనంత జిల్లా పరిధిలో 144 కి.మీ. నుంచి జీడిపల్లి జలాశయం ఉన్న 216 కి.మీ. దాకా 8.160 టీఎంసీలను వాడారు. గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో 15 చెరువులకు, రెండో దశ కాలువ కింద ఉన్న కళ్యాణదుర్గం, రాప్తాడు, అనంత, పెనుకొండ, కదిరి, పుట్టపర్తి, మడకశిర, హిందూపురం, ధర్మవరం వంటి ప్రాంతాల్లో ఉన్న 74 చెరువులకు నీరు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 89 చెరువులను భర్తీ చేశారు. పీఏబీఆర్ జలాశయానికి 2.091, ప్యాకేజీ 36కు 0.168 టీఎంసీల జలాలను సరఫరా చేశారు. వచ్చే శనివారం లేదా ఆదివారం నాటికి నీటి సరఫరా బంద్ అవుతుంది. ముచ్చుమర్రి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను కొనసాగిస్తారా లేదా? అన్నదానిపై సందిగ్ధం నెలకొంది.

**5.681 టీఎంసీలు వృథా** ఉమ్మడి అనంత జిల్లా సరిహద్దుకు మొత్తం 24.351 టీఎంసీలు చేరగా.. ఇందులో ప్రధాన కాలువ తొలి విడత పరిధిలో 8.160 టీఎంసీలు, రెండో విడత పరిధిలో 16.191 టీఎంసీలను వినియోగించారు. జిల్లాకు చేరిన మొత్తం జలాల్లో ఏకంగా 5.681 టీఎంసీలు ఆవిరి, లీకేజీ.. వంటి రూపాల్లో వృథా అయ్యాయి. ప్రస్తుతం జిల్లా సరిహద్దులో 383 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. జీడిపల్లి జలాశయానికి 297 క్యూసెక్కుల మేర చేరుతున్నాయి. ఇక్కడి నుంచి రెండో దశ ప్రధాన కాలువకు 314 క్యూసెక్కుల ప్రవాహం వెళ్తోంది.

## టమాటా ధరల పతనం.. గిట్టుబాటు గగనం



అనంతపురం : తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే టమాటా సాగుపై అనంత రైతులు మక్కువ చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్, రబీలో పంట సాగు చేస్తున్నారు. దిగుబడి వస్తున్నా మార్కెట్‌లో ధరలు క్రమేణా పతనం అవుతున్నాయి. పెట్టుబడి కూడా చేతికందక నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.10 దాటడం లేదు. సాధారణంగా దిగుబడి తగ్గితే.. ధరలు పెరగాలి. ఉమ్మడి జిల్లాలో ఇందుకు భిన్నంగా ఉంది. అనంతపురం గ్రామీణ పరిధిలోని కక్కలపల్లి మార్కెట్‌లో రోజుకు 4 వేల నుంచి 5 వేల టన్నుల టామాటా వచ్చేది. ప్రస్తుతం 200–300 టన్నులకు పడిపోయింది. దీంతో అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక చర్యలు చేపట్టింది. మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటా కొనుగోలు చేయిస్తూ.. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తోంది. మరింతగా ఊతమిస్తేనే రైతుకు ప్రయోజకరం ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

**రూ.7 కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్లు**


కళ్యాణదుర్గం మండలం వెంకటాంపల్లి, కుందుర్పి మండలం బండమీదపల్లిలో రూ.3.50 కోట్లు చొప్పున రెండు ప్రాసెసింగ్ యూనిట్లకు నిధులు... మార్చి, 2023లో మంజూరయ్యాయి. అయినా ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో అధికారులు ప్రాసెసింగ్ యూనిట్ల పనులు చకచకా చేయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఆధ్వర్యంలో నిర్మాణాలు సాగుతున్నాయి. గంటకు ఒకటిన్నర మెట్రిక్ టన్ను టమాటా ప్రాసెసింగ్ చేస్తారు. అందులోనే 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో శీతల గోదాములు నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కాగానే రెండు యూనిట్ల నిర్వహణ బాధ్యతలను ఆర్డీటీకి అప్పగించనున్నారు. టమాటాకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ధరలు తగ్గినప్పుడు ప్రాసెసింగ్ చేయడం...సాస్, ఊరగాయ, వడియాలు వంటివి తయారు చేయనున్నారు.

**కొనుగోలు చేస్తున్నాం..: సత్యనారాయణచౌదరి, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ**

టమాటా ధరలు సాధారణంగా రూ.7కు తగ్గితే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేస్తాం. ఇప్పటికే జిల్లాలో గత అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 540 మెట్రిక్ టన్నులు రైతుల నుంచి కొన్నాం. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, భీమవరం, ఏలూరు, ఒంగోలు, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేశాం.

## అదనపు సొమ్ముతో సొంతిల్లు సాకారానికి ఊతం

అనంతపురం : ఐదేళ్ల వైకాపా హయాంలో ఊర్లు నిర్మిస్తామంటూ బీరాలు పలికి పేదలకు చుక్కలు చూపించారు. ఇళ్ల నిర్మాణ సామగ్రి రెట్టింపు కావడంతో వారికి సొంతిళ్లు కలగానే మిగిలింది. ఇళ్లు మంజూరు అయినా ఐదేళ్లుగా కనీసం నిర్మాణం పూర్తి చేసుకోలేని దుస్థితి. లే అవుట్లలో గుత్తేదారులకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలు సైతం బిల్లులు తీసుకొని మధ్యలోనే ఆపేశారు. పెరిగిన ధరలతో పేదలు అప్పులతో మరింత కుదేలు అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్ల నిర్మాణాలపై పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతోంది. పేదలకు సొంతిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీలతోపాటు చేనేతలకు అదనంగా ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లకు వివిధ దశల్లో ఉన్నా వాటికి కూడా అదనంగా సొమ్ము ఇవ్వాలని నిర్ణయించారు. ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీలకు రూ.50 వేలు, చేనేతలకు రూ.50 వేలు అందజేస్తారు. అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 7,324 ఇళ్లు ఆయా వర్గాల వారి ఇళ్లు లేఅవుట్లు, సొంత స్థలాల్లో నిర్మాణం చేసుకొని వివిధ దశల్లో ఉన్నా వారందరికీ తాజాగా ప్రయోజనం ఒనగూరనుంది. గత వైకాపా హయాంలో కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇంటి నిర్మాణానికి మంజూరు చేసేవారు. కొత్తగా ఇళ్లు నిర్మాణాలు చేసుకొనే వారికి కూటమి ప్రభుత్వం వచ్చిన



అనంతరం ఇతరులకు రూ.2.50 లక్షలు, ఎస్టీలకు రూ.3.25 లక్షలు, ఎస్సీలకు, చేనేతలకు రూ.3 లక్షలు గృహ నిర్మాణానికి బిల్లు అందజేయనున్నారు. అంశం: ఎస్సీ, ఎస్టీ, చేనేతల గృహ నిర్మాణానికి అదనంగా సొమ్ముఅనంతపురం జిల్లాలో ప్రయోజనం పొందే ఎస్సీలు: 5,925ఇచ్చే సొమ్ము: రూ.29.62 కోట్లు

ఎస్టీలు: 1,363అదనంగా ఇచ్చేది: రూ.10.22 కోట్లువేగంగా గృహ నిర్మాణాలకు అవకాశం: శైలజ, గృహనిర్మాణ సంస్థ పీడీఅదనంగా సొమ్ము ఇస్తుండటంతో లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. వేగంగా ఇళ్లు నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం ఉంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వస్తాయి.

## పల్లె నిధులు పక్కదారి

చిత్తూరు : వైకాపా హయాంలో పలు పంచాయతీల్లో నిధులు పక్కదారి పట్టించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను నాటి వైకాపా ప్రభుత్వం దారి మళ్లించగా, మిగిలిన అరకొర నిధులను ఆ పార్టీ నేతలు, సిబ్బంది స్వాహా చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే ఒకొక్కటిగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ప్రజల ఫిర్యాదులపై విచారించి చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది.

**తేలని లెక్కలు..**పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు, స్థానిక పన్నులు, ఇతరత్రా నిధులకు సరైన లెక్కలు లేవు. ఒకవేళ అందుబాటులో ఉన్నా కాకిలెక్కలేనన్న విమర్శలున్నాయి. వైకాపా నేతలతో కుమ్మక్కైన సిబ్బంది నిధుల దుర్వినియోగానికి సహకరించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే అక్రమాలను నిగ్గు తేల్చే పని ప్రారంభించింది. ఫిర్యాదుల ఆధారంగా విచారణ అక్రమాలు తేలితే బాధ్యులపై చర్యలు చేపట్టనున్నారు.

రామకుప్పం మండలం కొంగనపల్లి పంచాయతీ సర్పంచి వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా రూ.7 లక్షలు డ్రా చేసినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలడంతో చెక్ పవర్ రద్దు చేశారు.

బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి సర్పంచి శ్రీనివాసులు అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్థులు ఈ నెల 3న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత మూడేళ్లుగా బిల్లులు, ఎంబుక్ లేకనే పారిశుద్ధ్య పనులకు సంబంధించి



రూ.10 లక్షలు డ్రా చేశారని, గ్రీన్ అంబాసిడర్స్ వేతనాలు రూ.2 లక్షలకు నకిలీ వోచర్లు సృష్టించారన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలకు బిల్లులు, ఎంబుక్ లేకుండా చెక్కుల ద్వారా నిధులు డ్రా చేసినట్లు సహచట్టం ద్వారా సేకరించిన వివరాలను అధికారులకు నివేధించారు. తుంబకుప్పం పంచాయతీలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శితో పాటు వైకాపా నాయకులు కుమ్మక్కై నిధులు స్వాహా చేసినట్లు ఫిర్యాదు అందింది. దీనిపై చిత్తూరు డీఎల్‌పీవో పార్వతి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి నెలలు గడిచినా విచారణలో జాప్యం జరుగుతోంది.

రామకుప్పం మండలం బందార్లపల్లి, గుడుపల్లె మండలం పీబీవాడ, వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి, శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీల్లో వైకాపా హయాంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటన్నింటిపైనా విచారణకు ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు: 1,411

అభియోగాలున్న పంచాయతీలు: 235

విచారణ సాగుతోంది.. : పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నాయి. విచారణ ప్రారంభించాం. నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేలిన పంచాయతీల్లో సంబంధిత సిబ్బంది లేదా బాధ్యులైన సర్పంచులపై చర్యలు చేపడతాం. సుధాకర్‌రావు, డీపీవో

## కట్టడాల్లో 'పుర'పాట్లు.. ఇక చెల్లవు

పాలకొల్లు : తాడేపల్లిగూడెంలో 2024లో భవన నిర్మాణాల నిమిత్తం మొత్తం 257 దరఖాస్తులొస్తే 256 అనుమతులిచ్చారు. ఇన్ని అనుమతులిచ్చినా అనధికారికంగా మరో 35 నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించి 26 మందికి నోటీసులు జారీ చేశారు. అత్యధికంగా నరసాపురంలో 42 అనధికార నిర్మాణాలు గుర్తించి 31 మందికి నోటీసులిచ్చారు. రూ.11 లక్షల వరకు జరిమానాలు వసూలయ్యాయి. జిల్లాలోని పట్టణాల్లో ప్రణాళిక విభాగం తనిఖీలు, పనితీరును ఇది తేటతెల్లం చేస్తుంది. ప్రతి భవనం నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం నిబంధనల ప్రకారం యజమానులు నడుచుకోవడాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ఏ పట్టణాన్ని తీసుకున్నా టౌన్ ప్లానింగ్ వ్యవస్థ లోపాలమయంగా తయారవ్వడంతో నిబంధనలు తుంగలో కలిసిపోతున్నాయి. ఇప్పటి వరకు 300 చదరపు గజాలు దాటిన నిర్మాణాలకే పరిమితమైన నివాసయోగ్య పత్రం ఇకమీదట అన్నిటికీ తప్పనిసరి చేశారు. తాజాగా పట్టణాభివృద్ధి శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. వీటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని



హెచ్చరికలు జారీ కావడంతో అక్రమ నిర్మాణదారుల్లో వణుకు మొదలయ్యింది. ప్రతి పట్టణంలోను పదుల సంఖ్యలో ఉన్న అక్రమ నిర్మాణాలపై ఎటువంటి ఆదేశాలు అందుతాయో అనే దానిపై చర్చ నడుస్తోంది.

**సిఫార్సులకు చెక్కు..**

పట్టణాల్లో పలువురు నిర్మాణదారులు రాజకీయ సిఫార్సులతో అక్రమ కట్టడాలు కడుతున్నారు. ఇటువంటి వాటికి ఇకమీదట చెక్ పెట్టనున్నారు. అనుమతులు పొందిన భవన ప్లానింగ్ కాపీని నిర్మాణం పూర్తయ్యే వరకు ఆ స్థలంలో విధిగా ప్రదర్శించాలి. ప్రస్తుతమైతే ఏ ఒక్క చోట ఇలా కనిపించడం లేదు. తాజా మార్గదర్శకాల్లోను దీనిని పొందుపరిచారు. ప్రతి నిర్మాణంలో ఇంకుడు గుంత ఏర్పాటు తప్పనిసరి. పది శాతం కూడా అమలు చేయడం లేదు.

**పత్రం తప్పనిసరి..** భవిష్యత్తులో నియమాలు తప్పితే నివాసయోగ్య పత్రం మంజూరు చేయరు. అది ఉంటే తప్ప గృహ ప్రవేశంగాని బ్యాంకు రుణాలు, క్రయవిక్రయాలు జరిగే అవకాశం ఉండదు. ఒకవేళ ఎక్కడైనా లంచావతారాలు సదరు పత్రాన్ని జారీ చేసినట్లు రుజువైతే వారి ఉద్యోగానికే ఎసరు పెట్టనున్నారు. దీనిపై పురపాలిక ఆర్డీ సీహెచ్. నాగనరసింహారావును సంప్రదించగా అనధికార నిర్మాణాలన్నిటిపై ఛార్జిషీటు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త ఉత్తర్వుల ప్రకారం తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు.

## గ్లామర్ షోలో నిన్ను కొట్టేవారే లేరు 'మృణాల్'

మృణాల్ ఠాగూర్.. తన టాలెంట్, అందం, అద్భుతమైన అభినయంతో సినీ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు అందుకున్న నటి. టెలివిజన్ ద్వారా కెరీర్ ప్రారంభించిన ఆమె, హిందీ టీవీ సీరియల్స్‌లో మెరిసి, సినిమాల వైపు అడుగులేశారు. ఆమె నటనతో మెప్పించి, అతి తక్కుక కాలంలోనే బాలీవుడ్‌లో వరుస ఛాన్స్ లు అందుకుంది. 2019లో వచ్చిన 'సూపర్ 30' సినిమాలో హృతిక్ రోషన్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక బాలీవుడ్‌లో అనంతరం అమ్మడు పలు వెబ్ సీరీస్ లలో కూడా మంచి క్రేజ్ అందుకుంది. అనంతరం మెల్లగా టాలీవుడ్‌లోనూ అడుగు పెట్టారు. తెలుగులో ఆమె చేసిన తొలి చిత్రం 'సీతారామం' ఏ స్థాయిలో సక్సెస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హను రాఘవపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ సరసన ఆమె 'సీత' పాత్రలో అదరగొట్టారు. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆ సినిమా తరువాత బాలీవుడ్‌లో కూడా ఆమెకు మంచి ఆఫర్లు వచ్చాయి. 'సీతారామం' తర్వాత మృణాల్ టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా మారింది. నాని హీరోగా



నటించిన 'హాయ్ నాన్న' మూవీలో కూడా ఆమె ప్రధాన పాత్రలో కనిపించారు. ఈ మూవీ మరో హిట్ కావడంతో మృణాల్‌కు టాలీవుడ్‌లో మరింత క్రేజ్ పెరిగింది. ఆమె నటన, ఎమోషనల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు షేర్ చేశారు. అందులో ఆమె తెల్లటి కలర్‌లో రంగుల డిజైన్ ఉన్న లాంగ్ గౌన్‌లో చాలా అందంగా మెరిసిపోతున్నారు. ఆమె సింపుల్ స్టైల్, క్యూట్ లుక్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. బ్యాక్‌లెస్ డ్రెస్‌లో ఆమె క్యూట్ అండ్ క్లాసీగా కనిపించారు. మేకప్ కూడా సింపుల్‌గా, నేచురల్ గ్లోతో ఉన్నది. ఫ్యాన్స్ ఈ స్టిల్స్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ టాలీవుడ్ బాలీవుడ్‌లో పలు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు. సన్ ఆఫ్ సర్దార్ సినిమాతో పాటు మరో మూడు హిందీ సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇక అడివి శేష్ తో డెకయిట్ అనే సినిమా చేస్తోంది. తెలుగులో ఆమె ఒక స్టార్ హీరోతో సినిమా చేస్తున్నారని టాక్. తన టాలెంట్, అందం, హార్డ్‌వర్క్‌తో మృణాల్ తక్కువ కాలంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. మరి భవిష్యత్తులో అమ్మడి నుంచి రాబోయే సినిమాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

## ఎన్టీఆరే బెస్ట్ పెర్ఫార్మర్ అనేసిన హీరోయిన్..!

తెలుగు మూలాలున్నా సరే తమిళ నటిగా గుర్తింపు తెచ్చుకుని అక్కడ ఒక మోస్తారు పాపులారిటీ తెచ్చుకున్న బ్యూటీ ఐశ్వర్య రాజేష్ అమ్మడు తెలుగులో కూడా వరుస సినిమాలు చేయాలనే ఆలోచన ఉన్నా ఐదేళ్ల క్రితమే ఇక్కడ ఒకటి రెండు సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు అందుకే కాస్త వెనకపడ్డది. ఐతే ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం తో సూపర్ హిట్ అందుకుని మళ్లీ వార్తల్లో నిలిచింది ఐశ్వర్య రాజేష్. హెూమ్లీ లుక్ తో తనదైన పాత్రల్లో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య సంక్రాంతికి వస్తున్నాం హిట్ తో టాలీవుడ్ లో కూడా సక్సెస్ సాధించింది. ఐతే ఈ హిట్ తో మరిన్ని అవకాశాలు రాబట్టాలని చూస్తుంది అమ్మడు. సంక్రాంతికి వస్తున్నాం హిట్ తో కెరీర్ లో జోష్ కనబరుస్తుంది. ఇక హిట్ జోష్ లో వరుస ఇంటర్వ్యూస్ చేస్తున్న ఐశ్వర్య రాజేష్ రీసెంట్ ఇంటర్వ్యూలో తెలుగులో బెస్ట్ పెర్ఫార్మర్ ఎవరన్న ప్రశ్నకు ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చింది. తన దృష్టిలో బెస్ట్ పెర్ఫార్మర్ ఎన్టీఆర్ అని అన్నది. జూనియర్ ఎన్టీఆర్



అభిమానిని నేను. ఎన్టీఆర్ డైలాగ్ డెలివరీ, డ్యాన్సుల్లో స్పెషాలిటీ ఉంటుందని అన్నది ఐశ్వర్య రాజేష్. అందరి ప్రదర్శన ఇష్టమే కానీ ఎన్టీఆర్ నా ఫేవరెట్ అని చెప్పింది అమ్మడు.

ఎన్టీఆర్ నటన గురించి ఇప్పటికే చాలామంది భామలు చెప్పారు. ఇప్పుడు ఆ లిస్ట్ లో ఐశ్వర్య కూడా చేరింది. ప్రస్తుతం తారక్ పై ఐశ్వర్య రాజేష్ చేసిన కామెంట్స్ ని ఎన్టీఆర్ ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు. ఇక ఐశ్వర్య కెరీర్ విషయానికి వస్తే సంక్రాంతికి వస్తున్నాం తో తెలుగులో తొలి సక్సెస్ అందుకుంది అమ్మడు. ఇలా హెూంలీ రోల్స్ తో తెలుగులో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది ఐశ్వర్య. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీనాక్షి చౌదరి కన్నా వెంకటేష్ భార్యగా నటించిన ఐశ్వర్య రాజేష్ కే ఎక్కువ మార్కులు పడ్డాయని చెప్పొచ్చు. ఎన్టీఆర్ తన ఫేవరెట్ అని చెప్పింది కాబట్టి ఈ కామెంట్స్ విన్న ఏ డైరెక్టర్ అయినా తారక్ సినిమాలో ఛాన్స్ ఉంటే మాత్రం ఐశ్వర్య రాజేష్ ని తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు.




## రాజధానిలో కన్నప్ప ప్రచారమా!




తెలుగు సినిమా ప్రచారం పాన్ ఇండియాని తాకిన సంగతి తెలిసిందే. చెన్నై, బెంగుళూరు, కొచ్చి, ముంబై, పాట్నా, చండీఘర్ అంటూ అన్ని రాష్ట్రాలు తిరిగేస్తున్నారు. సినిమా ప్రచారం అంటే ఎలా ఉంటుందో? ఆయా రాష్ట్రాలకు రుచి చూపిస్తున్నారు. ఇదంతా అక్కడ వాళ్లకు కొత్తగా ఉంది. నేరుగా ప్రేక్షకులతో హీరోలు ఇంటరాక్ట్ అవ్వడంతో? థ్రిల్లింగ్ ఫీలవుతున్నారు.

పబ్లిక్ గా ఈవెంట్లు నిర్వహించడంతో ఆడియన్స్ తెలుగు హీరోలకు కనెక్ట్ అవుతున్నారు. బన్నీ ..చరణ్ కి ఆ రకంగా మంచి కనెక్టింగ్ ఏర్పడిని సంగతి తెలిసిందే. పుష్ప-2, గేమ్ ఛేంజర్ ప్రచారం నార్త్ లో ఏ రేంజ్ లో జరిగిందే విధితమే. ఇప్పుడిదే కోవలో మంచు ఫ్యామిలీ కూడా ప్రచారం ప్లాన్ చేస్తున్నట్లు లీకులందాయి. మంచు విష్ణు కథానాయకుడిగా ప్రతిష్టాత్మకంగా కన్నప్ప చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సినిమాలో మోహన్ బాబు, మోహన్ లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్ సహా చాలా మంది స్టార్ హీరోలు నటిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తోన్న చిత్రమిది. అన్నింటిని మించి ఇది శివయ్య కథ కావడంతో? అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. హిందుత్వం అంశం ఇక్కడ హైలైట్ అవుతుంది. సరిగ్గా ఇదే పాయింట్ ని పట్టుకుని ప్రచారం పరంగా కలిసొచ్చే వ్యూహంతో ముందుకెళు న్నారు. ఈ సినిమాకి సంబంధించి రిలీజ్ కు ముందు రాజధాని ఢిల్లీలో ఈవెంట్ నిర్వహించాలని ప్లాన్ చేస్తు న్నారుట.

ఆ ఈవెంట్ కు ప్రభాస్ , మోహన్ లాల్ సహా అంతా హాజరయ్యేలా వాళ్ల వెసులుబాటును బట్టి ఈవెంట్ తేదీని ఫిక్స్ చేయాలని సన్నాహాలు చేస్తున్నట్లు ఉప్పందింది. నిజంగా రాజధాని నడి బొడ్డున ఇలాంటి సినిమా ప్రచారం అన్నది కలిసొచ్చేదే. మోదీ, షాలు హిందు వాదులు కాబట్టి సినిమాకి కొన్ని రకాల మినహాయింపులు దక్కే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా సులభంగా దక్కుతాయి. మరి ఇదంతా నిజమా? కాదా? అన్నది నిర్మాతల నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## టచ్ మీ నాట్ ఎలా ఉంది..?




ఆసక్తికరమైన కథ కథనాలు ఉన్న వెబ్ సీరీస్ లకు ప్రేక్షకులు తమ ఆమోద ముద్ర వేస్తారు. అందుకే ప్రతి వారాంతరం థియేటర్ లో సినిమాలు ఎలా రిలీజ్ కామనో ప్రతి వీకెండ్ ఓటీటీల్లో సీరీస్ లు కూడా అంతే కామన్ అయ్యాయి. వీకెండ్ సినీ లవర్స్ ని ఎంటర్టైన్ చేసేలా వెబ్ సీరీస్ లు వస్తున్నాయి. ఈ క్రమంలో లేటెస్ట్ గా తెలుగులో వచ్చిన వెబ్ సీరీస్ టచ్ మీ నాట్. నవదీప్, దీక్షిత్ శెట్టి లీడ్ రోల్ లో నటించిన ఈ సీరీస్ను రమణ తేజ డైరెక్ట్ చేశారు. ఈ సీరీస్ జియో హాట్ స్టార్ ఓటీటీ ఫ్లాట్ ఫాం లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇంతకీ అసలు ఏంటి ఈ టచ్ మీ నాట్ కథ అంటే.. 2009 లో దీపావళి పండుగ హడావిడి టైం లో మారుతి అపార్టుమెంట్ లో నలుగురు మహిళలు హత్యకు గురవుతారు. ఆ తర్వాత హత్య చేసిన వ్యక్తి గ్యాస్ లీక్ చేసి అక్కడ నుంచి పారిపోతాడు.

ఆ ఇన్సిడెంట్ లో రాఘవ (నవదీప్) తల్లిని కోల్పోగ రిషి (దీక్షిత్ శెట్టి) తల్లిదండ్రులకి దూరమవుతాడు. పదేళ్ల తర్వాత రాఘవ ఒక పోలీస్ ఆఫీసర్ అవ్వగా.. రిషిని కూడా అతనే చూసుకుంటాడు. రిషికి గతంలో గాయం వల్ల సైకో మెట్రి పవర్ వస్తుంది. అంటే వస్తువులు, మనుషులను టచ్ చేస్తే వాటి వివరాలు అన్నీ చెప్పగలుగుతాడు. ఈ టైం లోనే రిషికి మేఘ (కోమలి ప్రసాద్) పరిచయం అవుతుంది. ఆమె కూడా మారుతి అపార్టుమెంట్ బాధితురాలే అని తెలుస్తుంది. మరోపక్క రాఘవను అతనితో పనిచేసే దేవిక (సంచిత పూనాచ) ఇష్టపడుతుంది. ఐతే ఒక హాస్పిటల్ లో ఫైర్ యాక్సిడెంట్ వల్ల 20 మంది పేషెంట్స్ చనిపోతారు. దాని వల్ల మరోసారి మారుతి అపార్టుమెంట్ కేసు తెర మీదకు వస్తుంది. ఐతే ఆ కేసుతో దీన్ని పోల్చుతూ రిషి సైకో మెట్రి శక్తితో వివరాలు తెలుసుకోవాలని చూస్తారు. ఆ తర్వాత ఏం జరిగింది అన్నది వెబ్ సీరీస్ కథ. ఈ వెబ్ సీరీస్ కొరియన్ సీరీస్ హీ ఈజ్ సైకో మెట్రిక్ ఆధారంగా తెరకెక్కించారు. ఐతే కథ సైకో మెట్రి మీద డిపెండ్ అవ్వగా దాన్ని పూర్తిస్థాయిలో చూపించలేకపోయారు. కథ బాగున్నా కథనం చాలా ల్యాగ్ అయినట్టుగా అనిపిస్తుంది. ముఖ్యంగా టచ్ మీ నాట్ సీజన్ 2 ఆసక్తి కలిగించేలా ఉండేందుకు మొదటి సీజన్ లో అన్ని అలా పై పైన లాగించినట్టు ఉంది. టచ్ మీ నాట్ మొదటి సీజన్ 6 ఎపిసోడ్స్ తో వచ్చింది. తెలుగుతో పాటు మిగతా 6 భాషల్లో ఈ వెబ్ సీరీస్ రిలీజైంది. సీరీస్ మొదట్లో ఆసక్తికరంగా అనిపించినా ఎపిసోడ్స్ నడుస్తున్నా కొద్దీ బోర్ ఫీలింగ్ వస్తుంది.

## కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రండి: రకుల్


ఒకప్పుడు టాలీవుడ్ లో అగ్ర హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ స్టార్ హీరోలందరితో కలిసి సినిమాలు చేసింది. కానీ గత కొంత కాలంగా రకుల్ కు ఆశించిన స్థాయిలో సినిమాలు రావడం లేదు. అమ్మడు చివరిగా ఇండియన్2 సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. కానీ ఆ సినిమాలో పెద్దగా గుర్తింపు లేని పాత్ర చేసిన రకుల్ ఇప్పుడు తన భర్త నిర్మాణంలో బాలీవుడ్ లో ఓ సినిమా చేస్తోంది. ప్రస్తుతం రకుల్ తన ఫోకస్ మొత్తం బాలీవుడ్ పైనే పెట్టింది. అమ్మడు ఇప్పుడు అజయ్ దేవగన్, మాధవన్ తో కలిసి దే దే ప్రాయ్ దే2 సినిమాలో నటిస్తోంది. దీంతో పాటూ తమిళంలో కమల్ హాసన్ హీరోగా తెరకెక్కనున్న ఇండియన్3 లో కూడా నటించనుంది. రకుల్ కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గానే ఉంటుంది. తన సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ తో పాటూ, వ్యక్తిగత అభిప్రాయాలను కూడా



రకుల్ తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది. అందులో భాగంగానే రకుల్ తాజాగా తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ చేసింది. అందులో అలవాటైన పనుల నుంచి, ప్రాంతాల నుంచి బయటకు రమ్మని, కంఫర్ట్ గా ఉన్న ప్లేసే మీకెప్పుడూ శత్రువుగా మారుతుందని రాసి ఉన్న కోట్ ను పోస్ట్ చేసింది. ప్రజలు సోమరితనంగా మారడానికి కారణం ఎప్పుడూ ఒకే ప్లేస్ లో ఉండటమని, దాని వల్ల సౌకర్యం ఎక్కువ అవుతుందని, ఎవరూ ఒక వర్క్ నుంచి మరో వర్క్ కు మారడం లేదని, రెగ్యులర్ గా అలవాటైన పనినే చేస్తున్నారని, వీటన్నింటినీ అలవాటు పడి ఏదైనా కావాలనుకున్నప్పుడు కూడా రేపు చూద్దాంలే అనుకుంటున్నారని, ఈ కారణాల చేతే చాలా మంది ఎదగడం లేదని రకుల్ షేర్ చేసిన కోటేషన్ లో ఉంది. ఎవరైనా సరే జీవితంలో పైకి ఎదగాలంటే కఠినమైన విషయాల గురించి ఆలోచించాలని, వాటిని ఆచరణలో పెట్టాలని అప్పుడే సక్సెస్ అందుకుంటామని, అలవాటైన ప్రాంతం అందంగా ఉన్నప్పటికీ అది జీవితంలో పైకి ఎదగనీయదని రాసి ఉన్న కొటేషన్ ను రకుల్ షేర్ చేసింది. ఇక రకుల్ తన గురించి చెప్తూ తాను చాలా స్ట్రాంగ్ అని, తనను తాను ఎక్కువగా ప్రేమించుకుంటానని, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటాననని రకుల్ తెలిపింది.

## పెళ్లి తర్వాత మళ్లీ చెలరేగుతోందిగా

ఆప్ నాయకుడు రాఘవ్ చద్దాను పెళ్లాడాక పరిణీతి చోప్రా కొంత స్తబ్ధుగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రేమ వివాహం తర్వాత కొంతకాలంగా గ్లామరస్ ఫోటోషూట్లకు బ్రేక్ పడింది. కానీ ఇప్పుడు మళ్లీ యథావిధిగా ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. పారీ తనదైన గ్లామర్ ని ఎలివేట్ చేస్తూ వరుస ఫోటోషూట్ల లో పాల్గొంటోంది. తాజాగా పారి ఒక భారీ లాంచ్ ఈవెంట్‌లో కనిపించింది. ఆ సమయంలో తన యూనిక్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. నిజానికి పరిణీతి ఫ్యాషన్ గేమ్ ఇటీవల పెద్ద చర్చగా మారింది. పరిణీతి ఆల్ క్లాసిక్ బ్లాక్ లుక్ లో అందరి దృష్టిని ఆకర్షించింది. మోనోక్రోమ్ స్టైల్‌తో ఆఫ్ షోల్డర్ మినీ డ్రెస్‌లో పారీ ప్రత్యేకంగా కనిపించింది. ఈ లుక్ కి తగ్గట్టే ఎంపిక చేసుకున్న ఆభరణాలు ఆకట్టు



కున్నాయి. ఇంతకుముందు పరిణీతి బ్రౌన్ బాడీకాన్ డ్రెస్‌లో ఫోటో షూట్ లో పాల్గొంది. ఆఫ్ షోల్డర్ ప్యాటర్న్ ఫిగర్ గ్రేజింగ్ స్టైల్ ఎంతో ఆకట్టుకుంది. ఆసక్తికరంగా పరిణీతి మేకప్ లెస్ రూపంలో కనిపిస్తోంది. వేదికలపై అనవసర హంగామాను సృష్టించేందుకు ఈ భామ అస్సలు ఇష్టపడదు. పరిణీతి నెక్ట్స్ ఏంటి? అంటే... ఈ భామ కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంది. కొత్తగా పెళ్లయింది గనుక పారీ తన భర్త కోసం విలువైన సమయాన్ని వెచ్చిస్తోంది. ఇంతలోనే ఈ బ్యూటీ తిరిగి నటనలోకి రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ప్రముఖ దర్శకనిర్మాతలతో మంతనాలు సాగిస్తోందని సమాచారం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536